సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 335
శనివారం 17-8-2024



'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



పారాలింపిక్స్ సమయం

ఫ్రాన్స్‌కు బయలుదేరిన భారత అథ్లెట్లు.. 12 క్రీడాంశాల్లో 84 మంది పోటీ - 13లో



అతిపెద్ద ర్యాలీ

1,331 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ నిఫ్టీ 397 పాయింట్ల లాభం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మోగింది ఎన్నికల భేరి

జమ్మూకశ్మీర్‌లో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే హరియాణా ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది.

వివరాలు 6లో ▸



ముంచుకొస్తున్న 'మంకీపాక్స్'

కోవిడ్ సృష్టించిన మహా విలయం నుంచి ప్రపంచం తేరుకోకముందే ఎంపాక్స్ రూపంలో మరో వైరస్ భూమండలాన్ని చుట్టేస్తోంది.

వివరాలు 6లో ▸



హిందువులకు రక్షణ కల్పిస్తాం

బంగ్లాదేశ్‌లోని హిందువులకు దాడుల నుంచి రక్షణ కల్పిస్తామని తాత్కాలిక ప్రభుత్వ సారథి యూనస్ మోదీకి హామీనిచ్చారు.

వివరాలు 6లో ▸



థాయి ప్రధానిగా పేటోంగ్‌టార్న్!

థాయిల్యాండ్ ప్రధాని ఎన్నిక కోసం జరిగిన పార్లమెంటరీ ఓటింగ్‌లో పేటోంగ్‌టార్న్ షినవత్ర మెజారిటీ ఓట్లను దక్కించుకున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బంగాళాఖాతంలో అల్పపీడనం



వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. మరోవైపు ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రెండు రోజుల పాటు కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా తేలికపాటి వానలు పడే అవకాశాలున్నాయి.

3లో

కదం తొక్కిన జూడాలు



రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు తమ విధులను బహిష్కరించారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నేడు సాధారణ వైద్య సేవలను బంద్ చేయాలని ఐఎంఏ నిర్ణయించింది.

10లో

పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వండి



పోలవరం నిర్మాణం కోసం నిధులివ్వాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ బాధ్యతను 2022లో ముందు కొచ్చిన ఏజెన్సీకే అప్పగించాలని నిర్ణయించినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు.

2లో

వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం



రాష్ట్రంలో కూటమి నేతల అరాచకాలు కొనసాగుతున్నాయి. అనకాపల్లి జిల్లా శ్రీరాంపురంలో, బాపట్ల జిల్లా మూల్పూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను కూటమి నేతలు ధ్వంసం చేశారు.

10లో



డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుల కమిటీ (ఫైల్)

చంద్రబాబు తప్పిదం వల్లే.. వాల్ ఢమాల్

పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

2017, 2018లో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్ మీదుగా వరద ప్రవాహం

- ఆ ప్రభావం డయాఫ్రమ్‌వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్న కమిటీ
- వరదల ఉధృతికే డయాఫ్రమ్‌వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బ తిన్నట్లు స్పష్టీకరణ
- 2017లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాదులు జెట్ గ్రౌటింగ్ వాల్‌ల నిర్మాణం
- వరద ప్రభావం వాటిపై పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోని టీడీపీ సర్కారు
- 2018 వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్‌లో 200 -260 మీటర్ల మధ్య దెబ్బతిన్న జెట్ గ్రౌటింగ్ వాల్
- వాల్ సామర్థ్యాన్ని పూర్తిగా పరీక్షించకుండానే 2018 డిసెంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు ప్రారంభం
- వాటిని పూర్తి చేయలేక చివరకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలు వదిలేసిన నాటి బాబు ప్రభుత్వం
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల ఖాళీ ప్రదేశాల గుండా కుచించుకుపోయి ప్రవహించిన గోదారి
- దీనివల్ల వరద ఉధృతి పెరుగుతుందని తెలిసినా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు
- దాంతో 2019 వరదలకు ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం
- డయాఫ్రమ్‌వాల్ కోతకు గురై 693 మీటర్ల పొడవున దెబ్బతిన్న వైనం
- కోతకు గురైన దిగువ కాఫర్ డ్యామ్
- ఈ విధ్వంసానికి చంద్రబాబు చారిత్రక తప్పిదాలే కారణమని గతంలోనే చెప్పిన నిపుణులు

2లో

ఒకే సీజన్‌లో.. కొత్త డయాఫ్రమ్‌వాల్

- 2024 నవంబర్ 1 నుంచి 2025 జూలై 31లోగా పూర్తి చేయాలి
- పాత డయాఫ్రమ్‌వాల్‌కి ఎగువన సమాంతరంగా కొత్తది నిర్మించాలి
- కేంద్ర జలసంఘానికి అంతర్జాతీయ నిపుణుల నివేదిక

2లో



తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని షార్ నుంచి నింగిలోకి దూసుకెళ్తున్న ఎస్‌ఎస్‌ఎల్‌వీ డి-3 రాకెట్

ఇస్రో అమ్ములపొదిలోకి మరో రాకెట్

ఎస్‌ఎస్‌ఎల్‌వీ డి-3 ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి సురక్షితంగా చేరిన ఈవోఎస్-08, డెమోశాట్ ఉపగ్రహాలు

ఉపగ్రహాల నుంచి విజయవంతంగా అందిన సంకేతాలు

ఇస్రోలోని అన్ని టీమ్‌లకు అభినందనలు: సోమనాథ్

14లో

ఈవోఎస్-08 ఉపయోగాలు

భూమి మీద వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేస్తూ సమాచారాన్ని చేరవేస్తుంది. ముఖ్యంగా అటవీ, వ్యవసాయం, భూమి స్వభావం, నీరు, నేల తీరు అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది.

పక్కా స్కెచ్చు..దోపిడీ కిక్కు!

మద్యంలో భారీగా దండుకునేందుకు సర్కారు పెద్దల ఎత్తుగడ

- ఎక్సైజ్ శాఖకు మట్టి అంటకుండా ఏపీయూఐఏఎంఎల్ ద్వారా తతంగం
- టీడీపీ నేతల లిక్కర్ సిండికేట్‌కు తలుపులు బార్లా.. 'కన్సల్టెన్సీ'కి మద్యం విధానం రూపకల్పన బాధ్యత
- చంద్రబాబు మార్క్ నిబంధనలతో టెండర్ల ప్రక్రియ.. అస్మదీయ కన్సల్టెన్సీ ఎంపికయ్యేలా అర్హత నిబంధనలు
- రూ.100 కోట్ల టర్నోవర్ ఉండాలట!
- 13న టెండరు నోటిఫికేషన్.. 17లోగా బిడ్ల దాఖలు.. నాలుగు రోజులే గడువు ఇవ్వడంలో అంతర్యమేంటి?
- ఆన్‌లైన్‌లో కాకుండా బిడ్ దాఖలుకు స్వయంగా రావాలనడంలో మతలబు ఏమిటి?
- ఆ మరుసటి రోజే ప్రజెంటేషన్ ఎందుకు?
- ఇతర కన్సల్టెన్సీలు పోటీకి రాకుండా అడ్డుకునే కుట్రే కదా..?

10లో



భావోద్వేగానికి పట్టం

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రకటన



రిషబ్‌శెట్టి

ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి

ఉత్తమ నటీమణులు నిత్యామీనన్, మానసీ పరేఖ్

ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రం **కార్తికేయ-2**

12లో



నిత్యామీనన్



మానసీ పరేఖ్

రికార్డు ధర పలుకుతున్న పొగాకు

ఆకాశాన్నంటుతున్న పొగాకు బ్యారన్, పొలం కౌలు ధరలు

2024-25 సీజన్‌కు పంట పరిమితిని భారీగా పెంచిన బోర్డు



ధరలోనూ 'దొర'తనమే!

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పేరుకు తగ్గట్టుగానే.. 'దొర' (వర్జీనియా) పొగాకు ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు ఉత్పత్తులకు విపరీతమైన డిమాండ్ రావడంతో ఈ ఏడాది రైతులకు ఊహించని విధంగా లాభాలు తెచ్చిపెడుతోంది. దీంతో రైతుల మధ్య నెలకొన్న పోటీతో పొగాకు బ్యారన్, పొలం కౌలు ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి.

పెరిగిన సాగు విస్తీర్ణం

రెండేళ్లుగా పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో పొగాకు సాగు విపరీతంగా పెరిగింది. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 2023-24 సీజన్‌కు సంబంధించి 88 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులను అమ్ముకునేందుకు బోర్డు అనుమతిచ్చింది. ప్రస్తుతం అదనపు పొగాకు ఉత్పత్తులను సైతం వేలంలో కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని కందుకూరు-1, కందుకూరు-2, డీసీ పల్లి, కలిగిరి వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఈ నాలుగు వేలం కేంద్రాల్లో 27.5 మిలియన్ కేజీల వరకు అధికారిక ఉత్పత్తులు అమ్మకాలు జరగాల్సి ఉండగా 46.1 మిలియన్ కేజీల వరకు పొగాకును రైతులు పండించారు. అయినా సరే వేలంలో రికార్డు ధరలు నమోదవుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన వేలంలో బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు అత్యధిక ధర రూ.365 వరకు నమోదయ్యింది. అంటే నాణ్యమైన పొగాకు క్వింటా పొగాకు రూ 36,500 ధర పలుకుతుంది. అన్ని గ్రేడ్‌లు కలిపి కేజీ పొగాకు సరాసరి ధర రూ.254 నమోదైంది.

పంట పరిమితి భారీగా పెంపు

పొగాకు బోర్డు రాష్ట్రంలో 2024-25 పంట సీజన్‌కు మొత్తం 162 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతించగా.. ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 105.27 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులను పండించేందుకు బోర్డు అనుమతించింది. అలాగే ఈ ఏడాది బ్యారన్ సాగు పరిమితిని కూడా భారీగా పెంచింది. బ్యారన్‌కు దాదాపు 6 క్వింటాళ్లు అదనంగా పెంచినట్లయింది.

రెండింతలైన కౌలు ధరలు

వరుసగా పొగాకు పంట రైతులకు కాసులు కురిపిస్తుండడంతో పొగాకు సాగుపై విపరీతమైన క్రేజ్ రైతుల్లో ప్రస్తుతం ఏర్పడింది. దీంతో బ్యారన్, పొలాల కౌలుధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. గతేడాది రూ.1.50లక్షలు ఉన్న బ్యారన్ కౌలు ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరింది. అలాగే పొలాల కౌలు ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి.

'సుప్రీం' తీర్పులకు ఈసీ వక్రభాష్యం

- ఈవీఎంల వెరిఫికేషన్‌కు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు
- అందుకు విరుద్ధంగా స్వీయ ఎస్‌వోపీ రూపొందించిన ఈసీ
- వెరిఫికేషన్ స్థానంలో మాక్ పోలింగ్ నిర్వహణకు ఆదేశాలు
- ఎన్నికల కమిషన్ తీరుపై హైకోర్టులో బాలినేని పిటిషన్

5లో

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక



విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

2లో

కూటమిలో తేలని 'పదవుల' పంచాయితీ

- రెండు నెలలైనా ఒక్క నామినేటెడ్ పదవీ భర్తీ చేయని చంద్రబాబు
- కీలకమైన టీటీడీ, ఆర్టీసీ, ఏపీఐఐసీ వంటి వాటిపైనా అస్పష్టత
- టీటీడీ చైర్మన్ పదవి కోసం ముఖ్యుల పట్టు
- మూడు పార్టీల మధ్య అవగాహన కుదరకపోవడమే కారణం

10లో



క్లుప్తంగా...

27న ఈ-కేబినెట్ భేటీ
ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



సాక్షి, అమరావతి: ఈనెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయం మొదటి బ్లాక్‌లో కేబినెట్ సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 27వ తేదీ నుంచి ఈ-కేబినెట్ సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు సీఎస్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అంటే ట్యాబ్‌ల ద్వారా కేబినెట్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. గతంలోనూ చంద్రబాబు ఈ తరహా కేబినెట్ సమావేశాలను నిర్వహించిన విషయం తెలిసిందే. 27వ తేదీ కేబినెట్ సమావేశానికి ప్రతిపాదించాల్సిన అంశాలను ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖలను సీఎస్ ఆదేశించారు.

కేరళకు ఏపీ ప్రభుత్వం రూ.10 కోట్ల సాయం



సాక్షి, అమరావతి: కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలు, వరద విపత్తు నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ఏపీ ప్రభుత్వం రూ.10 కోట్ల సాయాన్ని ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. దీంతో రూ.10 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి కేరళ ప్రభుత్వానికి ఇచ్చేందుకు మంజూరు చేస్తూ రెవెన్యూ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగులకు మరో ఏడాది ఉచిత వసతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చి పని చేస్తున్న ఉద్యోగులకు ఉచిత వసతి సదుపాయాన్ని మరో ఏడాదిపాటు ప్రభుత్వం పొడిగించింది. సచివాలయం, అసెంబ్లీ, శాఖాధిపతులు, రాజ్‌భవన్ ఉద్యోగులకు ఉచిత వసతి సదుపాయం ఈ ఏడాది జూన్ 27తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆ ఉద్యోగులకు వచ్చే ఏడాది జూన్ 26 వరకు ఉచిత వసతి సదుపాయం పొడిగిస్తూ సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వారంలో నివేదిక ఇవ్వండి
అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనలో ఏపీ ప్రభుత్వానికి ఎన్సీఎస్సీ నోటీసు

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనలో జాతీయ ఎస్సీ కమిషన్ (ఎన్సీఎస్సీ) తీవ్రంగా స్పందించింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి నేతృత్వంలోని బృందం ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే స్పందించిన కమిషన్.. ఏపీ సీఎస్, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఘటన తర్వాత తీసుకొన్న చర్యలు ఏమిటో వారం రోజుల్లో తెలపాలని ఆదేశించింది. ఈ నోటీసులు సీరియస్‌గా తీసుకోవాలని లేదంటే తమకున్న అధికారాలు ఉపయోగించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంబేడ్కర్ విగ్రహంపై దాడికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోద్బలం ఉందంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌లు ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానాకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

కృషి ఫలించింది.. గేటు పడింది

- తుంగభద్ర డ్యాం స్టాప్‌లాగ్ గేటు తొలి భాగం అమరిక
- నేడు మరో రెండు భాగాలు ఏర్పాటు



గేటును అమర్చుతున్న ఉద్యోగులు


సాక్షి, బళ్లారి/ హొసపేటి/అనంతపురం సెంట్రల్: వారం రోజులుగా ఇంజినీర్లు చేస్తున్న కృషి ఫలించింది. తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు విజయవంతంగా మొదలైంది. స్టాప్‌లాగ్ గేట్‌లో మొదటి భాగాన్ని శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు, కార్మికులు విజయవంతంగా అమర్చారు. 15 టన్నులు బరువుతో 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉన్న ఈ భాగాన్ని భారీ క్రేన్ల సాయంతో అమర్చారు. ఇక్కడ మరో నాలుగు భాగాలు అమర్చాల్సి ఉంది. శనివారం రెండు, మూడు భాగాలు అమర్చడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత డ్యాం నుంచి 60 టీఎంసీల నీటిని వదిలేసి, 40 టీఎంసీలకు చేరుకున్నాక గేటు అమర్చాల్సి ఉంటుందని నిపుణులు చెప్పారు. అయితే నీటి వృథాను అడ్డుకొని రైతులకు అందించే లక్ష్యంతో స్టాప్‌లాగ్ గేటును అమర్చుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, మొదటి భాగాన్ని విజయవంతంగా అమర్చారు.

స్వల్ప వేతన జీవులే సింహభాగం!

దేశంలో 68 శాతం మంది రూ.20 వేలలోపు జీతగాళ్లే..




సాక్షి, అమరావతి: దేశంలో ఉద్యోగుల జీతాలు అరకొరగానే ఉంటున్నాయని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. దేశంలో నెల జీతం మీద ఆధారపడుతున్న వారిలో దాదాపు 68 శాతం మంది నెలకు రూ.20 వేల లోపు జీతగాళ్లేనని కూడా తెలిపింది. కేంద్ర గణాంక శాఖ 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(పీఎల్ఎఫ్ఎస్) తాజా నివేదిక దేశవ్యాప్తంగా నిరుద్యోగిత పెరుగుతోందని కూడా పేర్కొంది. ఉద్యోగుల జీతాలపై కీలక అంశాలను వెల్లడించింది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు, అసంఘటిత రంగాల్లో కలిపి దేశం మొత్తం మీద 8.50 కోట్ల మంది నెల జీతం మీద ఆధారపడి జీవిస్తున్నారని ఆ నివేదిక తెలిపింది. దేశంలో నెలకు రూ.70 వేలకు పైగా జీతం తీసుకుంటున్నవారు కేవలం 2.6 శాతం మందే ఉన్నారంది. అలాగే, దేశంలో నిరుద్యోగిత క్రమంగా పెరుగుతోందని పీఎల్ఎఫ్ఎస్ నివేదిక తెలిపింది. దేశంలో 27 రంగాల్లో ఉద్యోగ కల్పన పరిస్థితులను విశ్లేషించి నివేదిక వెల్లడించింది. ఆ ప్రకారం 2022–23 కంటే 2023–24లో దేశంలో 4.66 కోట్ల మంది నిరుద్యోగులు పెరిగారు. 2022–23లో దేశంలో 59.67 కోట్ల మంది నిరుద్యోగులు ఉండగా... 2023–24లో 64.33 కోట్లకు చేరారు. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత 1 శాతం తగ్గగా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం నిరుద్యోగిత 3శాతం పెరిగింది.




బాబు తప్పిదం వల్లే 'వాల్' ఢమాల్


పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై సీడబ్ల్యూసీకి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ



పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ పునాది జేటీ(జెట్ గ్రౌటింగ్) వాల్ 2018 వరదలకే దెబ్బతిందని తేల్చిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ



జేజీ వాల్ 200 నుంచి 260 మీటర్లు మధ్య దెబ్బతిన్నా దాని సామర్థ్యాన్ని పరీక్షించకుండా 2018 డిసెంబర్‌లో ఎగువ కాఫర్ డ్యామ్ పనులు చేపట్టడంపై విస్మయం వ్యక్తంచేసిన నిపుణుల కమిటీ



2018 నుంచే వరద ప్రవహించడం వల్ల ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిందని స్పష్టంగా చెప్పిన కమిటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు సర్కారు అనాలోచిత నిర్ణయాలు, అవగాహనా రాహిత్యం, అస్తవ్యస్థ పనులు మరోసారి బహిర్గతమయ్యాయి. పోలవరం డయాఫ్రమ్ వాల్ ధ్వంసం కావడానికి, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో విధ్వంసం చోటు చేసుకోవడానికి ముమ్మాటికీ చంద్రబాబు ప్రభుత్వం తప్పిదాలే కారణమని అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక సాక్షిగా నిర్ధారణ అయింది. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను పూర్తి చేసి చారిత్రక తప్పిదం చేశారని ఆక్షేపించింది. గోదావరికి అడ్డంగా 2016 డిసెంబర్ నుంచి 2017 జూలై వరకు 1,006 మీటర్లు.. 2017 డిసెంబర్ నుంచి 2018 జూన్ వరకూ 390.6 మీటర్ల పొడవున మొత్తం 1,396.6 మీటర్ల మేర ప్రధాన (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారని పేర్కొంది. అయితే నదీ ప్రవాహాన్ని పూర్తి స్థాయిలో మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకపోవడంతో 2017, 2018లో గోదావరి ప్రవాహం డయాఫ్రమ్ వాల్ మీదుగా ప్రవహించిందని గుర్తు చేసింది. ఆ ప్రభావం డయాఫ్రమ్‌వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్‌లో ఐదు చోట్ల 693 మీటర్ల పొడవున కోతకు గురై దెబ్బ తిందని స్పష్టం చేస్తూ ఈనెల 12న కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక అందచేసింది. గతేడాది ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నిర్వహించిన అధ్యయనంలో నాలుగు చోట్ల 485 మీటర్ల పొడవున డయాఫ్రమ్‌వాల్ దెబ్బ తిన్నట్లు తేల్చగా తాజాగా అంతర్జాతీయ నిపుణుల కమిటీ మరో 208 మీటర్ల మేర అధికంగా దెబ్బ తిన్నట్లు తేల్చడం గమనార్హం. పోలవరం నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు సలహాలు, సూచనలు అందించేందుకు డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో (యూఎస్ఏ), రిచర్డ్ డొన్నెల్లీ, సీన్ హించ్‌బెర్గర్ (కెనడా)లతో కూడిన అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ), సీడబ్ల్యూసీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. జూన్ 29–జూలై 4 మధ్య పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి జలవనరుల శాఖ, సీడబ్ల్యూసీ అధికారులతో చర్చించిన ఈ బృందం గత నెల 7న ప్రాథమిక నివేదిక అందచేసింది. పూర్తి నివేదికను ఈనెల 12న సీడబ్ల్యూసీకి సమర్పించింది. అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదికలో ప్రధానాంశాలు ఇవీ..

క్రమబద్ధంగా పనులు

- గాడి తప్పిన పోలవరం పనులను 2019 తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చక్కదిద్దింది. 2020లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్‌పై వరద ప్రభావం పడకుండా పూర్తి స్థాయిలో రక్షణాత్మక చర్యలు చేపట్టింది. గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేసింది. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనుల నాణ్యత ప్రమాణాల మేరకు ఉంది.
- ఎగువ కాఫర్ డ్యామ్‌ను 42.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసి 2021 జూన్‌లోనే గోదావరి ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా మళ్లించింది.
- దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని జియో బ్యాగ్‌లలో ఇసుక నింపి పూడ్చింది. 2023 ఫిబ్రవరి నాటికి దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పటిష్టంగా ఉన్నాయి. 2018లో జెట్ గ్రౌటింగ్ వాల్ సామర్థ్యాన్ని పరీక్షించకుండా ఎగువ కాఫర్ డ్యామ్ పనులు చేపట్టడం వల్లే సీపేజీ (లీకేజీ) అధికంగా ఉంది.

జగన్ సర్కారు పనులపై కమిటీ సంతృప్తి

- పోలవరం పనులను 2019 నుంచి గాడిలో పెట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్ శరవేగంగా పూర్తి
- ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహం స్పిల్‌వే మీదుగా మళ్లింపు
- దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతంలో జియో బ్యాగ్‌లు ఇసుకతో నింపి పూడ్చివేత
- 2023 ఫిబ్రవరికి దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పటిష్టంగా ఉన్నట్లు నిపుణుల కమిటీ సంతృప్తి
- గతంలో జెట్ గ్రౌటింగ్ గోడలో లోపాల వల్లే ఎగువ కాఫర్ డ్యామ్‌లో లీకేజీ

వాస్తవాలకు దర్పణం

ప్రపంచంలో ఎక్కడైనా ఏదైనా ప్రాజెక్టు కట్టాలంటే తొలుత నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేస్తారు. ఆ తర్వాత కాఫర్ డ్యామ్‌లు నిర్మించి నదీ ప్రవాహాన్ని స్పిల్ మీదుగా మళ్లిస్తారు. అప్పుడు ప్రధాన డ్యామ్ నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. తద్వారా వరదల్లోనూ పనులు కొనసాగించి ప్రధాన డ్యామ్ పనులను పూర్తి చేస్తారు. కానీ.. పోలవరం ప్రాజెక్టులో మాత్రం చంద్రబాబు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను పూర్తి చేసి చారిత్రక తప్పిదం చేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేయలేక చేతులెత్తేశారు. కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేశారు. వాటి గుండా గోదావరి కుచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో ఉధృతి పెరిగి డయాఫ్రమ్‌వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం చోటుచేసుకుంది. ఈ పాపం చంద్రబాబుదేనని సాగునీటిరంగ నిపుణులు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే స్పష్టం చేయగా తాజాగా అంతర్జాతీయ నిపుణుల కమిటీ కూడా అదే అంశాన్ని పునరుద్ఘాటించడం గమనార్హం.

- పోలవరం జలాశయం పనులను 2016 డిసెంబర్‌లో ప్రారంభించారు. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనుల కోసం కొండ తవ్వకం పనులకు సమాంతరంగా ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ పనులు ప్రారంభించారు. 2017 జూలైలో వరదలు ప్రారంభమయ్యే సమయానికి ఎడమ వైపు నుంచి 1,006 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. 2017 జూలై తర్వాత వచ్చిన వరద డయాఫ్రమ్‌వాల్ మీదుగానే ప్రవహించింది. 2017 డిసెంబర్ నుంచి 2018 జూన్ నాటికి మిగిలిన 390.6 మీటర్ల పొడవున గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్‌ను పూర్తి చేశారు. 2018లోనూ వరద ప్రవాహం డయాఫ్రమ్‌వాల్ మీదుగానే ప్రవహించింది. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల

ప్రణాళికారాహిత్యం వల్లే..

2018 నాటికే డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది.

- 2017లో వరద ప్రవాహం ముగిశాక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాది జెట్ గ్రౌటింగ్ వాల్‌లను 2018 జూన్ నాటికి పూర్తి చేశారు. కానీ ప్రవాహ ప్రభావం పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో 2018లో గోదావరి వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్ జెట్ గ్రౌటింగ్ వాల్ 200 నుంచి 260 మీటర్ల మధ్య దెబ్బతింది. 20 మీటర్ల లోతుతో నిర్మించిన జెట్ గ్రౌటింగ్ వాల్ పటిష్టంగా ఉందో లేదో తెలుసుకోకుండానే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను 2018 డిసెంబర్‌లో ప్రారంభించి.. 2019 మార్చి నాటికి పూర్తి చేయలేక ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేశారు.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఖాళీ ప్రదేశాలను వదిలేయడం వల్ల గోదావరి కుచించుకుపోయి వాటి మధ్య ప్రవహించాల్సి ఉంటుంది. దీనివల్ల వరద ఉధృతి పెరుగుతుంది. ఆ ప్రభావం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంపై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. దాంతో 2019లో గోదావరి ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో 30 మీటర్ల లోతు వరకూ ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం చోటు చేసుకుంది. డయాఫ్రమ్‌వాల్ పూర్తిగా దెబ్బతింది. దిగువ కాఫర్ డ్యామ్ కూడా కోతకు గురైంది.

ఒకే సీజన్‌లో.. కొత్త డయాఫ్రమ్‌వాల్

- 2024 నవంబర్ 1 నుంచి 2025 జూలై 31లోగా పూర్తి చేయాలి
- కేంద్ర జలసంఘానికి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

సాక్షి, అమరావతి: పోలవరం పనుల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడంపై కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)కి అంతర్జాతీయ నిపుణుల కమిటీ కీలక సిఫార్సులు చేసింది. ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌కి ఎగువన కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని ప్రతిపాదించింది. డయాఫ్రమ్ వాల్ పనులను వరదలు తగ్గాక అంటే 2024 నవంబర్ 1న ప్రారంభించి 2025 జూలై 31లోగా పూర్తి చేసేలా నిరంతరాయంగా చేయాలని స్పష్టం చేసింది. ఒకే సీజన్‌లో డయాఫ్రమ్‌వాల్‌ను పూర్తి చేయాలని తేల్చి చెప్పింది.

నిపుణుల కమిటీ కీలక సిఫార్సులివీ...

- గోదావరి వరదల ఉధృతికి గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బతింది. మరమ్మతులు చేసినా అది పూర్తి సామర్థ్యం మేరకు పని చేస్తుందో లేదో చెప్పలేం. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా కొత్త డయాఫ్రమ్‌వాల్‌ని నిర్మించడమే శ్రేయస్కరం.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పటిష్టంగా ఉన్నాయి. పునాది జెట్ గ్రౌటింగ్ వాల్‌లో లోపాల వల్లే ఎగువ కాఫర్ డ్యామ్‌లో సీపేజీ అధికంగా ఉంది. దీన్ని అరికట్టడానికి ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువన నది మధ్యలో ఫిల్టర్లు ఏర్పాటు చేయాలి.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్యన సీపేజీ నీటి మట్టం సముద్ర మట్టానికి 3 మీటర్ల లోపే ఉండాలి. ఆ మేరకు దిగువ కాఫర్ డ్యామ్‌లో ఏర్పాటు చేసిన గ్రావిటీ స్లూయిజ్‌ల ద్వారా సీపేజీ నీటిని బయటకు పంపాలి. గ్రావిటీ ద్వారా పంపడానికి సాధ్యం కాని నీటిని ఎత్తిపోయాలి. ఈ పనులను తక్షణమే ప్రారంభించాలి.
- నవంబర్ 1 నుంచి డయాఫ్రమ్ వాల్ పనులు ప్రారంభించడానికి వీలుగా ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో కోతకు గురైన ఇసుక తిన్నెలను యథాస్థితికి తెచ్చేలా వైబ్రో కాంపాక్షన్ పనులను పూర్తి చేయాలి. సముద్ర మట్టానికి 3 మీటర్ల ఎత్తు వరకూ ఈ పనులను అక్టోబర్‌లోగా పూర్తి చేయాలి.
- కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం.. గ్యాప్–1, గ్యాప్–2లలో ప్రధాన డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లు, పనులు చేపట్టడంపై వర్క్ షాప్ నిర్వహించాలి.
- 2024లో వరదలు తగ్గి పనులు ప్రారంభించడానికి ముందే పోలవరం ప్రాజెక్టు వద్ద ఈ వర్క్ షాప్ నిర్వహించాలి. సీడబ్ల్యూసీ, పీపీఏ, జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొనే ఈ వర్క్ షాప్‌నకు అంతర్జాతీయ నిపుణులు కూడా హాజరవుతారు.

పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వండి

- కేంద్ర జల శక్తి మంత్రికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణంపై చర్చ
- 2022లో ముందుకొచ్చిన ఏజెన్సీకే అప్పగించాలని నిర్ణయం



కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మొదటి దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతోపాటు డయా ఫ్రం వాల్ నిర్మాణానికి మళ్లీ నిధులు ఇవ్వాలని కోరారు. సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలన్నారు. పునరావాసం.. పరిహారం తదితర అంశాలపైనా చర్చించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు శుక్రవారం రాత్రి కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, ఇతరత్రా అంశాలపై సుమారు 45 నిమిషాలు చర్చించారు. ఈ భేటీలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రులు చంద్రశేఖర్, వర్మ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, సీడబ్ల్యూసీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తయి ఉండేదని అభిప్రాయపడ్డారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అధికారుల బదిలీతోపాటు 2020 వరదల వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతిందన్నారు. ఇది గత ప్రభుత్వ తప్పిదమే అని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఇప్పటికే రెండుసార్లు జలశక్తి మంత్రితో భేటీ అయ్యారన్నారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణంపై చర్చ జరిగిందని, నిర్మాణ బాధ్యతను 2022లో ముందుకొచ్చిన ఏజెన్సీకే అప్పగించాలని నిర్ణయించామని తెలిపారు. స్పిల్‌వేకు రక్షణగా ఉండే గైడ్ బండ్ కూడా కుంగిపోయిందని చెప్పారు. సీడబ్ల్యూసీ డిజైన్ల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

నేడు ప్రధానితో బాబు భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. పోలవరం నిధులతో పాటు రాష్ట్రానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరనున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోం మంత్రి అమిత్ షా లతోనూ భేటీ కానున్నారు.

1.83 కోట్ల మంది ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిందే!



20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు

సాక్షి, అమరావతి: ఇప్పటికే ఆధార్ కార్డు ఉన్నప్పటికీ.. కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్రంలో 1,83,74,720 మంది తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఇండియా తేల్చింది. చిన్న వయసులో ఆధార్ కార్డు పొందిన వారు అప్పట్లో నమోదు చేసుకున్న వేలిముద్రలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో అలాంటి వారు 18 ఏళ్ల వయసు దాటిన అనంతరం మరోసారి కొత్తగా తమ వేలిముద్రలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. అలాంటి వారు 48,63,137 మంది ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. దీనికి తోడు.. ఎవరైనా ఆధార్‌కార్డు పొందిన తర్వాత పదేళ్ల కాలంలో కనీసం ఒక్కసారైనా ఆధార్‌లో అంతకు ముందు పేర్కొన్న అడ్రస్‌తో పాటు ఫొటోలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉండగా.. ఆ కేటగిరిలో 1,35,07,583 మంది వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది.

ఐదు రోజులపాటు ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ఇటీవల జన్మించిన వారికి తొలిసారి ఆధార్‌కార్డుల జారీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఆధార్ కార్డులు తీసుకుని నిబంధనల ప్రకారం తమ వివరాలను మరోసారి తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాల్సిన 1.83 కోట్ల మంది కోసం ఈ నెల 20 నుంచి ఐదు రోజుల పాటు ప్రభుత్వం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా ఆధార్ జారీచేసే యూఐడీఏఐ సంస్థ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా ప్రతినెలా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తుంది. ఆగస్టులో ఆధార్ ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైనచోట కాలేజీలు, పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని.. తగిన ప్రచారం కల్పించడానికి కలెక్టర్లు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక



బొత్స సత్యనారాయణకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్వో మయూర్ అశోక్

మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొత్సకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కె.రవిబాబు, సురేష్‌బాబు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్పర్సన్ జె.సుభద్ర, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, యూవీ రమణమూర్తిరాజు, కంబాల జోగులు, అదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మందుల్లేక నులిపురుగుల దినోత్సవం వాయిదా

సాక్షి, అమరావతి: అల్బెండజోల్ మాత్రలు అందుబాటులో లేక ఈ నెల 20 నుంచి నిర్వహించాల్సిన జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని సెప్టెంబర్ 17వ తేదీకి వైద్య శాఖ వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా పిల్లలందరికీ సరఫరా చేయడానికి సరిపడా మాత్రలు లేనందున కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 25న మాప్ అప్ నిర్వహిస్తామన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని 1–19 ఏళ్ల 1.14 కోట్ల మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాల్సి ఉంది.

ముంబై–విజయవాడ విమాన సర్వీస్ ప్రారంభం



గన్నవరం: ముంబై–విజయవాడ మధ్య ఇండిగో విమాన సంస్థ శుక్రవారం నుంచి సర్వీస్‌లను ప్రారంభించింది. ముంబై నుంచి 80 మంది ప్రయాణికులతో తొలి విమాన సర్వీస్ రాత్రి 8.35 గంటలకు ఇక్కడికి చేరుకుంది. నూతన సర్వీస్ ప్రారంభోత్సవం సందర్భంగా ఇండిగో సంస్థ టెర్మినల్ భవనంలో వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని కట్ చేశారు. అనంతరం ముంబాయి వెళ్లే ప్రయాణికులకు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి ఎంపీలు బోర్డింగ్ పాస్‌ను అందజేశారు. బాలశౌరి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సింగపూర్, శ్రీలంక, థాయ్‌లాండ్‌కు సర్వీస్‌లు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా కోల్‌కతా, అహ్మదాబాద్, పుణేకు కూడా సర్వీస్‌లు నడపాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కోరినట్లు ఎంపీ చిన్ని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంత్‌రెడ్డి, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు. తిరిగి ఈ విమానం రాత్రి 9 గంటలకు 105 మంది ప్రయాణికులతో ముంబైకి బయలుదేరి వెళ్లింది.

హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తాం..

- ఎమ్మెల్యే బాలకృష్ణ



హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లా పేరు అలాగే ఉంచి పరిపాలన కేంద్రంగా హిందూపురాన్ని పరిగణిస్తూ అన్నివిధాలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలో రెండురోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలో రెండు అన్నా క్యాంటీన్లు ప్రారంభించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నివిధాలుగా అభివృద్ధి చెందిన హిందూపురాన్ని జిల్లా పరిపాలన కేంద్రంగా ఏర్పాటు చేయాలని సీఎంను కోరామని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. హిందూపురంపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి పరిశ్రమలు వస్తాయని చెప్పారు. కలెక్టర్ చేతన్, సబ్–కలెక్టర్ అపూర్వభరత్, తదితరులు పాల్గొన్నారు.

సోమ–శుక్రవారాల మధ్యే వినతుల స్వీకరణ: జనసేన

సాక్షి, అమరావతి: ప్రజల నుంచి జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు వినతులు స్వీకరించే కార్యక్రమం ఇకపై సోమవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనసేన పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపేందుకు సమయం అవసరమైన దృష్ట్యా ఈ మార్పులు చేసినట్లు వివరించారు. కాగా, ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్‌వీ డి–3 ప్రయోగం విజయవంతం కావడం సంతోషకరమని, శాస్త్రవేత్తలకు మన స్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నానని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వారాంతాల్లో ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్–సికింద్రాబాద్ (07175/07176) ప్రత్యేక రైలు ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు నర్సాపూర్‌కు చేరుకుంటుంది. కాకినాడ–సికింద్రాబాద్ (07177/07178) ఈనెల 17, 19 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయల్దేరి 18, 20 తేదీల్లో ఉదయం 9.05కి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 18, 20 తేదీల్లో సాయంత్రం 6.20కి బయల్దేరి 19, 21 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.



వాతావరణం

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పులు మానవ జీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. కట్టుబట్టలతో ఆవాసాలను వదులుకుని వలసలు పట్టాల్సిన దుస్థితిలోకి నెట్టేస్తున్నాయి. భారతదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు గ్లోబల్ వార్మింగ్ దుష్ప్రభావాల బారిన పడుతున్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు,, అనావృష్టి, సముద్ర మట్టం పెరుగుదల, వరదలు, ఇతర కాలుష్యాల విపత్తుల కారణంగా ఉన్న ప్రాంతాలను వదులుకుని వలస దారులు వెతుక్కుంటున్నారు. 2019లో దాదాపు 50 లక్షల మంది దేశంలో వివిధ ప్రదేశాల్లో తలదాచుకున్నట్టు గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ నివేదిక పేర్కొంది. 2050 నాటికి 4.50 కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులయ్యే అవకాశం ఉందని క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ – దక్షిణాసియా నివేదిక తాజాగా ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. 2021 – 22 నుంచి దేశంలో గ్లోబల్ వార్మింగ్ 11 శాతం పెరిగిందని అమెరికాలోని కొలరాడోకు చెందిన యేల్ ప్రోగ్రామ్ ఆన్ క్లైమేట్ కమ్యూనికేషన్ రిసెర్చ్ సంస్థ ప్రకటించింది.

గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే నష్టాలు ఇవి..



- విపరీతమైన వేడి, కరువు, సముద్ర మట్టం పెరుగుదల, వరదలు వంటి వాతావరణ మార్పుల కారణంగా వలసలు పెరుగుతాయి.
- వ్యవసాయం దెబ్బతినడంతో దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు వేరే ప్రాంతాలకు వలస పోతారు.
- మొక్కలు, జంతు జాతులకు ముప్పు వాటిల్లుతుంది.
- తీవ్రమైన వేడి తరంగాలు వంటి పర్యావరణ ప్రమాదాలు తలెత్తుతాయి.

ముఖ్యంగా ప్రజల జీవనానికి కరువు, నీటి కొరత, తీవ్రమైన వాయు కాలుష్యం, తీవ్రమైన తుపానులు, వరదలు ఆటంకం కలిగిస్తాయి.



- వాతావరణ విపత్తులతో వలసల ప్రభావం మహిళలపై తీవ్రంగా పడుతోంది. కుటుంబంలోని పురుషుడు వలస వెళ్ళినప్పుడు స్త్రీలు వ్యవసాయం, కుటుంబ సభ్యుల సంరక్షణ బాధ్యతలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు.
- కుటుంబాలతో సహా వలస వెళ్లిన వారు సొంత భూమితో సంబంధాన్ని కోల్పోతున్నారు.

భారత్ సహా దక్షిణాసియాకు ప్రమాద ఘంటికలు



వాతావరణ ప్రేరిత వలసలు దక్షిణాసియాను కుదిపేస్తున్నాయి. ప్రజల కష్టాలను పెంచి వలసలకు దారితీస్తున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. బంగ్లాదేశ్‌లో నదులు కోతకు గురవుతున్నాయి. పాకిస్తాన్, భారతదేశంలో వరదలు పోటెత్తుతున్నాయి. నేపాల్‌లో హిమానీ నదాలు కరుగుతున్నాయి. ఫలితంగా భారత్, బంగ్లాదేశ్‌లలో సముద్ర మట్టాలు పెరిగి తీర ప్రాంత ప్రజలు ఆవాసాలు కోల్పోవాల్సి వస్తోంది. శ్రీలంకలోని వరి, టీ ఎస్టేట్‌లపై సాధారణంకంటే భారీ వర్షాలు, తుఫానులు విరుచుకుపడటంతో ప్రజల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రత



భారత్‌లోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతోంది. మానవుల వల్ల కలిగే గ్లోబల్ వార్మింగ్ దశాబ్దానికి 0.26 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. గత దశాబ్దంలో ఉష్ణోగ్రత 1.14 డిగ్రీల నుంచి 1.19 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. గత ఏడేళ్లలో భారత తలసరి బొగ్గు ఉద్గారాలు 29% పెరిగాయి. వాతావరణంలో వస్తున్న ఈ మార్పులు ప్రజల జీవన విధానాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

రాష్ట్రంలో పది మంది ఐపీఎస్ అధికారుల బదిలీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదిమంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన అధికారుల వివరాలు ఇవీ...

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సత్య ఏసుబాబు	ఎస్పీ, ఇంటెలిజెన్స్	డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి
గరుడ్ సుమిత్ సునీల్	వెయిటింగ్‌లో ఉన్నారు	ఎస్పీ, గ్రేహౌండ్స్
పి.జగదీశ్	వెయిటింగ్‌లో ఉన్నారు	ఎస్పీ, అనంతపురం జిల్లా
కేవీ మురళీకృష్ణ	ఎస్పీ, అనంతపురం జిల్లా	కమాండెంట్, 16వ బెటాలియన్, విశాఖపట్నం
కేఎం మహేశ్వర రాజు	ఎస్పీ, సెబ్	డీసీపీ, విజయవాడ
సునీల్ షెరాన్	ఎస్‌డీపీవో, పార్వతీపురం	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
రాహుల్ మీనా	అదనపు ఎస్పీ, చింతూరు	ఎస్ఆర్‌పీ, గుంతకల్
ఎస్.నచికేత్ విశ్వనాథ్	అదనపు ఎస్పీ, గుంటూరు	ఎస్పీ, ఇంటెలిజెన్స్
పంకజ్ కుమార్ మీనా	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	అదనపు ఎస్పీ, చింతూరు
సురాన అంకిత మహావీర్	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఎస్‌డీపీవో, పార్వతీపురం

పేరు మారిన 'ఫార్మేటివ్ అసెస్మెంట్'



సాక్షి, అమరావతి: పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే పరీక్షల పేరు మార్చారు. ఇప్పటి వరకు యూనిట్ టెస్టులను ఫార్మేటివ్ అసెస్మెంట్‌గా పిలుస్తున్నారు. ఇకపై సెల్ఫ్ అసెస్మెంట్‌గా మార్పు చేస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 27 నుంచి జరిగే పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇవి కూడా రోజుకు రెండు కాకుండా ఒక పరీక్ష చొప్పున ఆరు రోజులు జరపాలని టైం టేబుల్ విడుదల చేశారు. గతంలో మూడు రోజుల్లో యూనిట్ పరీక్షలు పూర్తయ్యేవి. వీటికి సంబంధించిన ప్రశ్న పత్రాలు జిల్లా పరీక్ష మండలి నుంచి పంపుతారని తెలుస్తోంది.

12 మంది నాన్ క్యాడర్ ఎస్పీల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 12 మంది నాన్ క్యాడర్ ఎస్పీలు, 49 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేశారు. ఈ మేరకు హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

- రాష్ట్రంపై ప్రభావం అంతంతమాత్రమే
- రెండు రోజుల పాటు కోస్తా, రాయలసీమలో ఓ మోస్తరు వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతాల మీద అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 4.5 కిమీ ఎత్తు వరకు విస్తరించి ఉత్తర వాయవ్య దిశగా కదులుతోంది. ఈ అల్పపీడనం రానున్న రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా మారి.. తదుపరి రెండు రోజుల్లో వాయుగుండంగా బలపడనుంది. అనంతరం.. బెంగాల్, జార్ఖండ్ పరిసర ప్రాంతాల మీదుగా ప్రయాణించే అవకాశాలున్నాయి. ఈ వాయుగుండం ప్రభావం బెంగాల్, ఒడిశా, బంగ్లాదేశ్‌పై ఎక్కువగా ఉంటుంది. ఏపీపై ఎలాంటి ప్రభావం చూపదని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు.. ఆగ్నేయ అరేబియా సముద్రం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కేరళ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిమీ ఎత్తులో విస్తరించి ఉంది. అదేవిధంగా.. ఉపరితల ద్రోణి కర్ణాటక, కొమొరిన్ ప్రాంతాల మీదుగా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాయలసీమలో నేడు ఒకట్రెండు చోట్ల భారీ వర్షం కురిసే సూచనలున్నాయని అధికారులు తెలిపారు. రాబోయే రెండు రోజులు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయని వెల్లడించారు. అయితే.. వాయుగుండం తేమగాలుల్ని తీసుకుపోవడం వల్ల మరో మూడు రోజుల పాటు ఉక్కపోత కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు

- రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనే సాగుతోంది
- వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని చూస్తే సాధ్యం కాదు
- మాజీ మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి/మంగళగిరి: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తన మీద, తన కుమారుడు రాజీవ్ మీద అక్రమ కేసులు బనాయించారని మాజీ మంత్రి జోగి రమేష్ చెప్పారు. చంద్రబాబు ఇంటిపై దాడి కేసు విచారణలో భాగంగా శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ స్టేషన్‌కు చేరుకున్న జోగి రమేష్‌ను డీఎస్పీ రవికాంత్.. న్యాయవాది సమక్షంలో విచారించారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దుర్భాషలాడారని, రాయలేని భాష, నోటితో ఉచ్చరించలేని బూతులతో అయ్యన్న పాత్రుడు జగన్‌ను అవమానించారని.. దీంతో నిరసన తెలిపేందుకే తాను చంద్రబాబు ఇంటికి వెళ్లినట్టు తెలిపారు. కనీసం చంద్రబాబు అయినా అయ్యన్న పాత్రుడికి బుద్ధి చెబుతారనే తాను నిరసన తెలిపేందుకు వెళ్లగా.. తనపైనే దాడి చేసి కారు అద్దాలు పగలగొట్టారని చెప్పారు. సీఐడీ జప్తు చేయని అగ్రిగోల్డ్ స్థలాన్ని తన కుమారుడు చట్టబద్ధంగా కొనుగోలు చేశాడని, అందులో తప్పేంటని ప్రశ్నించారు. పోలీసుల విచారణలో ఎలాంటి దాపరికం ఉండదని, దాచుకోవాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ విచారణకు రమ్మంటే వస్తానని, వారడిగే అన్ని ప్రశ్నలకూ సమాధానం చెబుతానన్నారు. 'ఇప్పుడు మీరు పరుష పదజాలం వాడితే రేపు మీ పరిస్థితి ఏంటో తెలుసుకోండి' అని చెప్పారు. వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, అది వారికి సాధ్యం కాదని తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. రాష్ట్రంలో గవర్నెన్స్ అనేది పూర్తిగా తుడిచిపెట్టుకపోయిందని, కేవలం రెడ్‌బుక్ పాలనే సాగుతోందన్నారు. అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఏపీలో చరిత్ర మళ్లీ పునరావృతమవుతుందని స్పష్టం చేశారు. కాలమనే దైవం చంద్రబాబును వదలదని, తానైతే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటానని జోగి రమేష్ స్పష్టం చేశారు.

కౌంటర్ దాఖలు చేయని ఏసీబీ

విజయవాడ స్పోర్ట్స్: అగ్రి గోల్డ్ భూముల వివాదంలో అరెస్ట్ అయి జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న జోగి రాజీవ్ బెయిల్ పిటీషన్‌పై, రాజీవ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలన్న ఏసీబీ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో శుక్రవారం వాదనలు కొనసాగాయి. ఇన్‌చార్జ్ న్యాయమూర్తి భాస్కరరావు ఎదుట ముందుగా బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్‌లు ఏడేళ్ల లోపు శిక్షలు ఉన్న కేసులు మాత్రమే కావడంతో బెయిల్ మంజూరు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోరారు. అయితే కోర్టు సమయం ముగిసే వరకు రాజీవ్ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కౌంటర్ దాఖలు చేయకపోవడంతో 20వ తేదీకి వాయిదా వేశారు. కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు రాజీవ్ సిద్ధపడగా, ఏసీబీ అధికారులే తమ పిటిషన్‌లో తప్పులున్నాయని, సరి చేసేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పైనా 20న విచారణ జరిగే అవకాశం ఉంది.

'శ్రీశైలం ఆశ్రమ పాఠశాలను మార్చండి'

సాక్షి, అమరావతి: శ్రీశైలంలో బాలికల ఆశ్రమ పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరిందని, దాని వల్ల విద్యార్థినులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, వెంటనే కొత్త భవనంలోకి మార్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబును కలిసిన శంకర్ నాయక్, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దు నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఇస్లావత్ హనుమంతు నాయక్‌లతో కలసి గిరిజన సమస్యలపై వినతిపత్రం అందించారు. శిథిల పాఠశాల గురించి మంత్రులు, కలెక్టర్‌కు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. ఏ క్షణంలోనైనా ఆ పాఠశాలలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వివరించారు. తక్షణం నూతన భవనం మంజూరు కావాలంటే ఆలస్యం అవుతుందని, కనీసం పక్కనే ఉన్న సున్నిపెంటలో కొత్త భవనాన్ని రిపేర్ చేయించి ప్రస్తుతానికి అక్కడ తరగతులు నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు సున్నిపెంటలో కొత్త భవనాన్ని పరిశీలించి అక్కడే పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సీ)ని ఆదేశించారు.

పారిశ్రామికాభివృద్ధికి టాస్క్‌ఫోర్స్

- టాటా గ్రూపు చైర్మన్ చంద్రశేఖరన్ కో చైర్మన్‌గా పారిశ్రామికవేత్తలు, నిపుణులతో ఏర్పాటు
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని టాటా గ్రూపు చైర్మన్‌ను కోరిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: వికసిత్ ఏపీలో భాగంగా 2047 నాటికి రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్ రూపకల్పన కోసం ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పలు రంగాల నిపుణులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. టాటా గ్రూపు చంద్రశేఖరన్ కో చైర్మన్‌గా ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయంలో శుక్రవారం టాటాగ్రూపు చైర్మన్.. సీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీన్లో భాగంగా పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఐటీ, విమానయానం, సోలార్, టెలీకమ్యూనికేషన్స్, ఫుడ్‌ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్న అపార అవకాశాలను వివరించిన సీఎం.. పెట్టుబడులు పెట్టాలని చంద్రశేఖరన్‌ను కోరారు. విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో విస్తార, ఎయిర్ ఇండియా విమాన సర్వీసుల సంఖ్యలను పెంచే అంశంపై చర్చించారు. అమరావతిలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్‌లో టాటా గ్రూపు భాగస్వామ్యం కావాలన్న సీఎం కోరికను చంద్రశేఖరన్ స్వాగతించారు. అనంతరం చంద్రశేఖరన్ మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు.

సీఐఐ ప్రతినిధుల బృందంతో భేటీ

సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. అమరావతిలో స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణ అవకాశాలపై ఆ బృందంతో చర్చించినట్లు చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు.



సీఎం చంద్రబాబుతో టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్

అమరావతిలో అంతర్జాతీయ లా వర్సిటీ

అమరావతిలో అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ముందుకొచ్చింది. ఈ మేరకు బీసీఐ చైర్మన్, సీనియర్ న్యాయవాది మన్నన్ కుమార్‌మిశ్రా నేతృత్వంలోని బృందం శుక్రవారం సీఎంను కలిసింది. సీఆర్‌డీఏ పరిధిలో ఈ యూనివర్సిటీ ఏర్పాటునకు అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్‌ను సీఎం ఆదేశించారు. బీసీఐ బృందంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు, బీసీఐ ట్రస్ట్–పెరల్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి తదితరులున్నారు.

తెలంగాణ

డ్రగ్స్ దందాలో రాజస్తాన్ వ్యాపారులు

- రూ.4.34 కోట్ల విలువైన హెరాయిన్ పేస్ట్ స్వాధీనం
- ముగ్గురు పెడ్లర్స్, ఐదుగురు వినియోగదారుల అరెస్ట్

గచ్చిబౌలి: హైదరాబాద్‌లో స్థిరపడిన రాజస్తాన్‌కు చెందిన కొందరు వ్యాపారుల ద్వారా డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నారని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. దినేష్‌చౌదరి, మంగళారంచౌదరిలు హెరాయిన్ పేస్ట్ కోసం రాజస్తాన్‌కు చెందిన సవర్ ఝుట్‌కు రూ.48 వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. ఈ నెల 7న రాజస్తాన్ నుంచి హెరాయిన్ పేస్ట్ తెచ్చారు. ఓ హోటల్లో మంగరామ్, దినేష్, గణేష్‌లు రమేష్‌చంద్, సురేష్‌చంద్‌లను కలిశారు. హెరాయిన్ ఎలా విక్రయించాలో వివరించారు. ఆ తర్వాత మరో కారులో గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని ప్రకాష్ లైట్‌హౌస్‌లో హెరాయిన్ పేస్ట్‌ను దాచేందుకు తీసుకొచ్చారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు 14న రాత్రి లైట్‌హౌస్‌పై దాడి చేశారు. హెరాయిన్ పేస్ట్‌తోపాటు పెడ్లర్స్ మంగళారంచౌదరి, దినేష్‌చౌదరి, గణేష్ చౌదరిలతోపాటు ఐదుగురు వినియోగదారులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు సవర్‌ఝుట్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.4.34 కోట్ల విలువైన హెరాయిన్ పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

> ఈ సమస్త విశ్వమూ దేనిలోనైతే విహితమై వుంటుందో ఆ పరమ తేజోమయ బ్రహ్మధామాన్ని విశుద్ధ అంతఃకరణం గల వ్యక్తి తెలుసుకోగలుగుతాడు.
> – ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 17 ఆగస్టు 2024

ఎట్టకేలకు కశ్మీర్‌ ఎన్నికలు

పదేళ్లుగా అసెంబ్లీ ఎన్నికలూ...దాదాపు ఆరేళ్లనుంచి ప్రజా ప్రభుత్వం జాడా లేని జమ్మూ–కశ్మీర్‌లో ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. వచ్చే నెల 18, 25, అక్టోబర్‌ 1 తేదీల్లో మూడు దఫాలుగా ఈ ఎన్నికలుంటాయని ఎన్నికల సంఘం(ఈసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ సెప్టెంబర్‌ 30లోగా అక్కడ ఎన్నికలు నిర్వహించి తీరాలని సుప్రీంకోర్టు నిరుడు డిసెంబర్‌లో ఇచ్చిన ఆదేశాల పర్యవసానంగా ఈ ప్రకటన తప్పలేదు. జమ్మూ–కశ్మీర్‌ ఆఖరి దశ ఎన్నికలతోపాటే... అంటే అక్టోబర్‌ 1న హరియాణా అసెంబ్లీకి కూడా ఎన్నికలుంటాయి. రెండుచోట్లా ఎన్నికల ఫలితాలు అక్టోబర్‌ 4న వెల్లడవుతాయి. హరియాణాతోపాటే నవంబర్‌ నెలాఖరుకు గడువు ముగుస్తున్న మహారాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికలుంటాయని అందరూ భావించారు. జార్ఖండ్‌ అసెంబ్లీ పదవీ కాలం వచ్చే జనవరితో పూర్తవుతుంది. కానీ మహారాష్ట్రలో గణేశ్‌ చతుర్థి, దీపావళి కారణంగా ఆ ఎన్నికలు విడిగా నిర్వహిస్తామని ఈసీ చెబుతోంది. కశ్మీర్‌లో ఎన్నికల ప్రకటనకు కొన్ని గంటలముందు భారీ స్థాయిలో పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు జరగటం యాదృచ్ఛికం కాదు.

విపక్షంలో ఉండగా కశ్మీర్‌ పరిణామాలపై ఒంటికాలిపై లేచిన బీజేపీకి అధికారం వచ్చిన తొలినాళ్లనుంచీ అదొక అంతుచిక్కని పజిల్‌గా మారిందన్నది వాస్తవం. గవర్నర్‌ పాలన వచ్చినా, ఆ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తినిచ్చే 370 అధికరణను రద్దుచేసి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు– జమ్మూ–కశ్మీర్, లద్దాఖ్‌లుగా విభజించి లెఫ్టినెంట్‌ గవర్నర్‌ను నియమించినా ఆశించిన స్థాయిలో ప్రశాంతత ఏర్పడలేదు. కశ్మీర్‌ లోయ ఎంతో కొంత నయం. అంతక్రితం పెద్దగా ఉగ్రవాద ఘటనల జాడలేని జమ్మూ ప్రాంతంలో ఆ ఉదంతాలు పెరిగాయి. 21 మంది జవాన్లు ఉగ్రవాదుల తుపాకి గుళ్లకు బలయ్యారు. నిరుడు ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకొచ్చాక ఇంతవరకూ 17 సార్లు భద్రతా బలగాలపై ఉగ్రవాద దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో 18మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈమధ్య ఆ రాష్ట్రానికి వెళ్లినప్పుడు జనం మార్పు కోరుకోవటంతోపాటు ఆ మార్పులో భాగస్వాములయ్యేందుకు ఉవ్విళ్లూరుతున్న వైనం కళ్లబడిందని ప్రధాన ఎన్నికల కమిషనర్‌ రాజీవ్‌ కుమార్‌ అన్నారు. వారు బుల్లెట్లకన్నా బ్యాలెట్లే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఎక్కడి ప్రజలైనా బుల్లెట్లు కోరుకోరు. తమ జీవనం సజావుగా సాగాలనీ, కనీస అవసరాలు తీరాలనీ కాంక్షిస్తారు. అది అసాధ్యమైనప్పుడే ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. దాన్ని ఏ శక్తులు ఎలా ఉపయోగించుకుంటాయన్నది వేరే విషయం. ఆయనన్నట్టు మొన్న లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూ–కశ్మీర్, లద్దాఖ్‌లలో జనం బారులు తీరిన మాట వాస్తవం. కానీ అంతక్రితం కూడా ఇదే పరిస్థితి. అది రాష్ట్రంగా ఉన్నప్పుడు 2014 నవంబర్, డిసెంబర్‌ నెలల్లో చివరిగా ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికలప్పుడు సైతం ఉగ్రవాదుల బెదిరింపులు, వేర్పాటువాదుల ఎన్నికల బహిష్కరణ పిలుపు బేఖాతరు చేసి వోటర్లంతా పోలింగ్‌ కేంద్రాల ముందు క్యూ కట్టారు. కానీ వారికి దక్కిందేమిటి? ఎవరికీ మెజారిటీ రాని స్థితిలో మూడు నెలల పాటు గవర్నర్‌ పాలన తప్పలేదు. ఆ తర్వాత ఊహించని రీతిలో పీడీపీ–బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనా అది ముచ్చటగా మూడేళ్లు కూడా నడవలేదు.

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జమ్మూ–కశ్మీర్‌ అసెంబ్లీలో స్థానాల సంఖ్య 83 నుంచి 90కి పెరిగింది. జమ్మూ ప్రాంతానికి ఆరు, కశ్మీర్‌కు ఒకటి అదనంగా వచ్చాయి. దీనికితోడు పాక్‌ ఆక్రమిత కశ్మీర్‌ ప్రాంతానికి 24 స్థానాలున్నాయి. మొత్తంగా అసెంబ్లీ స్థానాలు 107 నుంచి 114కు పెరిగాయి. ఈమధ్య జరిగిన లోక్‌సభ ఎన్నికల సరళి గమనిస్తే 24.36 శాతం ఓట్లతో బీజేపీ ముందంజలో ఉండగా, 22.3 శాతంతో నేషనల్‌ కాన్ఫరెన్స్‌ రెండోస్థానంలో ఉంది. కాంగ్రెస్‌కు 19.38 శాతం, పీడీపీకి 8.48 శాతం ఓట్లు లభించాయి. బీజేపీ, నేషనల్‌ కాన్ఫరెన్స్‌లు చెరో రెండు సీట్లూ గెల్చుకున్నాయి. యూఏపీఏ కింద అరెస్టయిన పాత్రికేయుడు ఇంజనీర్‌ రషీద్‌ జైల్లోవుంటూ బారాముల్లా స్థానంనుంచి ఇండిపెండెంట్‌గా గెలిచారు. మొత్తానికి ప్రస్తుతం తనకు అనుకూల వాతావరణం ఉన్నదని బీజేపీ విశ్వసిస్తోంది. తాజా ఎన్నికల ప్రకటనకు అది కూడా కారణం కావొచ్చు.

హరియాణాలో ఈసారి ఒంటరి పోరుకు సిద్ధపడుతున్న బీజేపీకి పరిస్థితి ఆశాజనకంగా లేదు. 2014లో 90 స్థానాలున్న అసెంబ్లీలో 47 స్థానాలు గెల్చుకుని సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ... 2019లో 40తో సరిపెట్టుకుంది. ఆ ఎన్నికల్లో పది సీట్లు గెల్చుకున్న దుష్యంత్‌ చౌతాలాతో కూటమి కట్టి పాలించింది. అయితే ఆ పార్టీ మూణ్ణెల్లక్రితం మద్దతు ఉపసంహరించుకోగా దినదినగండంగా నెట్టుకొస్తోంది. ఈసారి స్పష్టమైన మెజారిటీతో అధికారం ఖాయమని కాంగ్రెస్‌ అనుకుంటున్నా అదంత సులభం కాదని విశ్లేషకుల అంచనా. అంతర్గత పోరును అదుపు చేసుకుని, విపక్షాలతో కలిస్తేనే బీజేపీని నిలువరించటం వీలవుతుందని వారంటున్నారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలెలా ఉంటాయన్న సంగతి పక్కనబెడితే... ముందు ఎన్నికలకు విశ్వసనీయత తీసుకురాటం ఎలాగన్నది ఈసీ పరిశీలించాలి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 140 స్థానాల్లో పోలైన వోట్లకన్నా లెక్కించిన ఓట్లు అయిదు కోట్లు అధికమని వోట్‌ ఫర్‌ డెమాక్రసీ (వీఎఫ్‌డీ) బయటపెట్టింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఈ అధిక వోట్లు 47 లక్షలు. పర్యవసానంగా ఇతర రాష్ట్రాల మాటెలావున్నా ఏపీలో కూటమి సర్కారుకు ఈవీఎం ప్రభుత్వమన్న ముద్రపడింది. పైగా కొన్నిచోట్ల సీల్‌ చేసిన ఈవీఎంల బ్యాటరీ చార్జింగ్‌ పెరిగిన వైనం కూడా వెల్లడైంది. ఇంత అస్తవ్యస్తంగా నిర్వహణ ఉంటే ఇలాంటి ఎన్నికలను ఎవరైనా విశ్వసించగలరా? ఎన్నికల సంఘం ఆలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి: శు.త్రయోదశి రా.4.08 వరకు తదుపరి చతుర్దశి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.10.20 వరకు తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.6.12 నుండి 7.44 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.42 నుండి 7.24 వరకు, అమృతఘడియలు: రా.3.36 నుండి 5.10 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అన్నిటికీ... విదేశీ హస్తమేనా?

విశ్లేషణ



సంజయ బారు

ఇందిరా గాంధీ పొలిటికల్‌ టూల్‌ కిట్‌ నుండి నరేంద్ర మోదీ చాలావరకు అరువు తెచ్చుకున్నారని పలువురు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సొంత రాజకీయ సమస్యలకు విదేశీ హస్తాన్ని నిందించడం అటువంటి అరువు ఆలోచనే. ప్రభుత్వాధినేతలు తెరవెనుక శక్తులతో కొట్టుమిట్టాడే యుగంలో ఇందిర పనిచేయవలసి వచ్చిందనేది మనం గమనించాలి. భారతదేశం బలహీనంగా, వెనుకబడి, అభివృద్ధి చెందకుండా ఉండాలని ఎవరూ కోరుకోవడం లేదు. అభివృద్ధి చెందిన, ఆత్మవిశ్వాసంతో కూడిన భారతదేశం తమ ప్రయోజనాలకు సరిపోతుందని పాశ్చాత్య శక్తులు కూడా గుర్తించాయి. కాబట్టి, దేశీయ వైఫల్యాలను సమర్థించుకోవడానికి ఒక సాకు వెతకడం కన్నా, పారదర్శక పాలనపై దృష్టి పెట్టడం మేలు.

హిండెన్‌బర్గ్, జార్జ్‌ సోరోస్‌ నుండి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల నుండి వేగులు, గూఢచారుల వరకు, వివిధ రూపాల్లో విదేశీ హస్తం భారతదేశంలోకి తిరిగి జొరబడిందని ఆరోపణలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌ మాజీ ప్రధాని షేఖ్‌ హసీనాను దేశం వీడేలా చేయడానికి యువకులు పెద్దఎత్తున నిరసనలు జరిపినప్పటికీ, ఆమె బహిష్కరణ వెనుక విదేశీ హస్తం ఉందని ఆరోపణలు వినబడుతున్నాయి.

కచ్చితంగా చెప్పాలంటే, మునుపటి ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో జరిగినట్లుగానే, కొత్త ప్రచ్ఛన్న యుద్ధంలో దక్షిణాసియా ఒక ఆట స్థలం కావచ్చు. పెద్ద, చిన్న అనేక దేశాలు ఈ ప్రాంతంలో వాటాను పొందివున్నాయి. కాబట్టి, పాలనలో మార్పు వంటి విపత్తు సంఘటనలు సంభవించినప్పుడు, తెరవెనుక శక్తులు పనిచేస్తున్నాయని అనుకోవాల్సి వస్తుంది. అయితే, చాలా తరచుగా, దక్షిణాసియా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల మూలాలకు స్వదేశంలోని పరిస్థితులే కారణమవుతున్నాయి.

అప్పటినుంచే మొదలు...

అప్పుడప్పుడూ, భారతీయ రాజకీయ చర్చల్లో విదేశీ హస్తం ప్రత్యక్షమవుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు, సాక్షాత్తూ ప్రధానమంత్రే భారతదేశ అంతర్గత స్థిరత్వం, పురోగతి అంశాలపై ఉన్న ప్రపంచ ముప్పు గురించి మాట్లాడారు. అదేసమయంలో అఖండమైన పార్లమెంటరీ మెజారిటీతో 'బలమైన, స్థిరమైన' ప్రభుత్వ ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ఈ సందర్భంలో, ఓటర్లు ఆ ముప్పును సీరియస్‌గా తీసుకోలేదు. మోదీకి అంతంత అనుకూల ఫలితాన్ని మాత్రమే అందించారు.

ఇందిరా గాంధీ పొలిటికల్‌ టూల్‌ కిట్‌ నుండి నరేంద్ర మోదీ చాలావరకు అరువు తెచ్చుకున్నారని పలువురు రాజకీయ విశ్లేషకులు తరచుగా వ్యాఖ్యానిస్తున్నారు. తన రాజకీయ సమస్యలకు విదేశీ హస్తాన్ని నిందించడం అటువంటి అరువు తెచ్చుకున్న ఆలోచనే. ప్రభుత్వాధినేతలు తెరవెనుక శక్తులతో కొట్టుమిట్టాడే యుగంలో ఇందిర పనిచేయవలసి వచ్చిందనేది మనం గమనించాలి. చిలీకి చెందిన సాల్వడార్‌ అలెండే 1973లో హత్యకు గురైన తర్వాత, విదేశీ హస్తం తదుపరి లక్ష్యం తానేనన్న భయంతో ఆమె 1974లో ఎమర్జెన్సీ పాలన విధించి ఉండవచ్చని ఆమె మీడియా సలహాదారు, దివంగత హెచ్‌వై శారదా ప్రసాద్‌ రాశారు. ఫిడెల్‌ క్యాస్ట్రో(క్యూబా), లియోనిడ్‌ బ్రెజ్నేవ్‌ (రష్యా) ఇద్దరూ ఆమెను తీవ్రంగా హెచ్చరించారని ఆయన తన నోట్స్‌లో పేర్కొన్నారు.

1960లు, 1970లు ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రంగా కొనసాగిన కాలం. నిజానికి అది విదేశీ హస్త యుగం. అమెరికా, సోవియట్‌ యూనియన్‌ రెండూ తమ సొంత శక్తిని పెంపొందించుకోవడానికి మిత్రులను, తోలుబొమ్మలను వెతుకుతూ ఉండేవి. భారతదేశం



అప్పట్లో పాశ్చాత్య శక్తులకు అభిముఖంగా ఉండేది. నేడు భారతదేశం తనను తాను అమెరికాకు 'వ్యూహాత్మక భాగస్వామి'గానూ 'నాటోయేతర మిత్రదేశం' గానూ భావిస్తోంది. అయినప్పటికీ, విదేశీ హస్తం చుట్టూ ఉన్న రాజకీయాల్లో అమెరికాను కూడా అనుమానించవలసి రావడాన్ని తోసిపుచ్చలేం.

ప్రచ్ఛన్న యుద్ధం ముగియడంతో, విదేశీ హస్తం గురించి చర్చ తగ్గుముఖం పట్టింది కానీ, అది పూర్తిగా అదృశ్యం కాలేదు. సోవియట్‌ యూనియన్‌ రద్దు కావడంతో అమెరికాకు భారతదేశం చేరువ కావడం; పశ్చిమం వైపు వెళ్లే భారతీయుల సంఖ్య పెరగడం; ఆంగ్లం మాట్లాడే దేశాల పౌరసత్వాన్ని కోరుకోవడం పెరగడంతో, బహిరంగ చర్చల నుండి విదేశీ హస్తం ప్రస్తావన వెనక్కి తగ్గింది. కానీ, తమిళనాడులోని కుడంకుళం వద్ద రష్యా సహాయంతో ఏర్పాటుచేస్తున్న అణు కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకుని నిరసనలు జరగడం వెనుక విదేశీ హస్తం ఉందని 2012లో అప్పటి ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ వంటి వివేకం కలిగిన నాయకుడు కూడా భావించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

అన్నింటికీ అదేనా?

ఈ నేపథ్యంలో మోదీ లాంటి నాయకుడి హయాంలో బీజేపీ లాంటి రాజకీయ పార్టీకి ప్రతి సమస్య, సవాలు వెనుక విదేశీ హస్తం కనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఒక దశాబ్ద కాలంగా దేశంలోని వివిధ ఏజెన్సీలు, ఫోర్డ్‌ ఫౌండేషన్‌ నుండి సెంటర్‌ ఫర్‌ పాలసీ రీసెర్చ్‌ వరకు అన్ని రకాల సంస్థలను విదేశీ హస్తాలు పన్నిన కుట్రదారులుగా బీజేపీ ఆరోపిస్తోంది. కాబట్టి, భారతదేశంలోని అధికార యంత్రాంగంలోని చాలామంది షేఖ్‌ హసీనాను తొలగించడం వెనుక మాత్రమే కాకుండా, హిండెన్‌బర్గ్‌ చేసిన స్టాక్‌ మార్కెట్‌ విశ్లేషణ పరిశోధన వెనుక కూడా విదేశీ హస్తం ఉందని భావించడంలో ఆశ్చర్యం లేదు.

విదేశాలలో 'భారతీయ హస్తం' పని చేస్తున్నట్లే, భారతదేశంలో చాలా విదేశీ హస్తాలు పనిచేస్తూ ఉండవచ్చు. భారతీయ ఏజెంట్లు విదేశాల్లో హత్యాకాండకు పాల్పడుతున్నారనే ఆరోపణలను ప్రపంచ వ్యాప్తంగా తీవ్రంగా పరిగణిస్తున్నారు. భారతీయ హస్తం పదును దేరుతోందని ఇది సూచిస్తోంది. ఒక దేశం వెలుపల ఉన్న శక్తులు ఒకరిపై కుట్ర పన్నుతుంటే గనక, అటువంటి దేశంలోని ఏ ప్రభుత్వమైనా సరే విస్తృతంగా పరిశీలించి, విదేశీ హస్తాలు ఆటాడేందుకు సహాయపడే స్థానిక శక్తులపై ఎలాంటి చర్యలనైనా తీసుకోవచ్చు అనేది ఇక్కడ గ్రహించాల్సిన ప్రాథమికాంశం.

ఇంటిని దిద్దుకోవాలి!

అనిశ్చితమైన, వేగంగా మారుతున్న ప్రపంచంలో, భారతదేశం వంటి ప్రధాన శక్తి అంతర్గత భద్రత, పాలనపై దృష్టి పెట్టాలి. తద్వారా 'విదేశీ హస్తం' ఆడుకోవడానికి స్థలాన్ని తెరిచే పరిస్థితులను సృష్టించకూడదు. జరిగే ప్రతి తప్పిదానికీ 'విదేశీ హస్తం' బాధ్యత వహించాలని ఆరోపించడం ద్వారా దేశీయంగా ఉన్న అసమర్థ పాలన నుండి జనాల దృష్టిని మళ్లించడం సులభం. నిజానికి హసీనా తన బహిష్కరణకు తానే పునాది వేసుకున్నారు. వాస్తవం ఏమిటంటే, భారతదేశంలోని దర్యాప్తు సంస్థల నుండి నియంత్రణ సంస్థల వరకు వివిధ సంస్థల ఏకపక్ష చర్యలు... సందేహాస్పద నిర్ణయాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ప్రచ్ఛన్న యుద్ధ యుగం దేశాన్ని అస్థిరపరిచే శత్రుపూర్వక విదేశీ హస్తం జ్ఞాపకాన్ని మిగిల్చిందనడాన్ని తోసిపుచ్చలేము. వలసవాద అనంతర సమాజంలో ఈస్టిండియా కంపెనీ బ్రిటిష్‌ రాజ్యంగా మారిన జ్ఞాపకాన్నీ విస్మరించలేము. కాబట్టి 'విదేశీ హస్తం' అనేది కేవలం వేగులు, పంచమాంగదళం లాంటి అనుమానిత చర్యలలో మాత్రమే కాకుండా కార్పొరేట్, ఆర్థిక ప్రపంచంలోని వారి చర్యలలో కూడా కనిపిస్తుంది.

అయితే, భారతదేశం మునుముందుకే నడిచింది. చాలా తక్కువ దేశాలు మినహాయిస్తే, భారతదేశం బలహీనంగా, వెనుకబడి, అభివృద్ధి చెందకుండా ఉండాలని ఎవరూ కోరుకోవడం లేదు. అభివృద్ధి చెందిన, ఆత్మవిశ్వాసంతో కూడిన భారతదేశం తమ ప్రయోజనాలకు సరిపోతుందని పాశ్చాత్య శక్తులు గుర్తించాయి. ఆఖరికి మన విదేశాంగ విధానం కూడా దేశ ఆర్థికాభివృద్ధికి అనుకూలమైన బాహ్య వాతావరణాన్ని కోరుకుంటోంది. కాబట్టి, దేశీయ వైఫల్యాలు, దుష్పరిపాలనను సమర్థించుకోవడానికి ఒక సాకు కోసం వెతకడం కన్నా, స్వదేశంలో మంచి, పారదర్శక పాలనపై దృష్టి పెట్టడం మేలు.

వ్యాసకర్త మాజీ పత్రికా సంపాదకుడు, ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ మీడియా సలహాదారు

('ద ట్రిబ్యూన్‌' సౌజన్యంతో)

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అయితే రావొచ్చు!



మీకు ఏ ఆశలు, లక్ష్యాలు, కలలు లేకపోతే గనక ప్రపంచంలో మీరు నివసించడానికి అత్యుత్తమమైన ప్రదేశం ఇటలీ.

– ఆంటోనియో ట్రోపియానో, డేటా ఫ్రీలాన్సర్‌

వెనక్కి పోము!



ఎవరు వినాలో వాళ్లకు: 'భద్రత' అనే కారణంగా తిరిగి భారతీయ మహిళలం గేట్లలోకీ, ఇళ్లలోకీ వెనక్కి వెళ్లం. ఈ దేశంలోని బహిరంగ స్థలాల్లో ప్రతి అంగుళాన్నీ మేము తిరిగి పొందుతాం. మాకు సాయం చేయండి లేదా పక్కకు తప్పుకోండి.

– నరయు పానీ, రచయిత్రి

మారిన పరిస్థితి



షేఖ్‌ ముజీబుర్‌ రహమాన్‌ను 1975 ఆగస్ట్‌ 15న హత్య చేశారు. అది జాతీయ సెలవు దినం. కానీ మధ్యంతర ప్రభుత్వం అది ఎంతమాత్రమూ సెలవు దినం కాదంటోంది. ఆఖరికి జనాల్ని షేఖ్‌ ముజీబ్‌ కోసం బాధపడనివ్వడం లేదు. బంగ్లాదేశ్‌లో భావ స్వేచ్ఛ లేదు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

మా కాలపు గొప్పలు



నలభై ఏళ్లు దాటినవాళ్లకు 'మా కాలంలో ఇలామారియా' అనే తీవ్రమైన జబ్బు వస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. దీని లక్షణాలు ఏమంటే, 'మా కాలంలో' సంగీతం, సినిమాలు, సమాజం, రాజకీయాలు బాగుండేవనే నిర్హేతుక నమ్మకం.

– పర్మిందర్‌ సింగ్, వ్యాపారవేత్త

తెలివైన సీఎం



ఒక ముఖ్యమంత్రిగానూ, ప్రతిపక్ష నేతగానూ ఏకకాలంలో వ్యవహరించే అసాధారణ నేర్పు మమతా బెనర్జీకి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం నుంచి మమతా బెనర్జీ న్యాయాన్ని కోరుతున్నారు. తన ప్రత్యర్థులు రాజకీయ కథనాన్ని హైజాక్‌ చేయడానికి ఆమె అంగీకరించడం లేదు.

– గౌహర్‌ గిలానీ, కాలమిస్ట్‌

అడగాల్సిందే!



పశ్చిమ బెంగాల్‌కు ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య కార్యదర్శి, హోమ్‌ కార్యదర్శి ఉన్నారు. హత్యాచార దారుణం మీద వాళ్లు ఏం చెబుతారు? ఈ అధికారులు తమ ప్రకటనలను నేరుగా 'సీల్డ్‌ కవర్‌'లో ఇవ్వాలని గౌరవనీయ హైకోర్టు వారు అడగాలని అభ్యర్థిస్తున్నా.

– కిరణ్‌ బేడీ, మాజీ గవర్నర్‌

జరగాల్సిన విచారణ




మనమందరం ఇండో–అమెరికా సంబంధాలు బాగుండాలనే కోరుకుంటాం. కానీ బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వంపై జరిగిన కుట్ర మీద పారదర్శక విచారణ జరగాలి. 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అరుపులు ఎందుకు లేవు? బంగ్లాదేశ్‌ హిందువులపై జరుగుతున్న మారణకాండ మీద ఐక్యరాజ్యసమితి, అమెరికా కాంగ్రెస్, భారత పార్లమెంట్‌లో ఎందుకు చర్చ జరగడం లేదు?

– రాజీవ్‌ మల్హోత్రా, పరిశోధకుడు

పేదలకు దోచిపెట్టిన వీరుడు

బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన గొప్ప సామాజిక విప్లవకారుడు సర్దార్‌ సర్వాయి పాపన్న. ఆధిపత్య కులాల పాలకులు బహుజనులను అణగదొక్కుతున్న 17వ శతాబ్దంలోనే... స్వీయ సైన్యంతో దాడిచేసి దక్కన్‌లో తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు.

పాపన్న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్‌ (1650–1709)లో నాసగోని ధర్మన్న, సర్వమ్మలకు జన్మించాడు. తండ్రి చిన్నతనంలోనే చనిపోతే అన్నీ తానై పెంచింది తల్లి. పాపన్న గౌడ కులస్థుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ పరమ భక్తుడు. తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు. పూజలు చేసే సంప్రదాయాలను యుక్త వయసు వచ్చే నాటికి క్రమక్రమంగా వ్యతిరేకించాడు. బానిసత్వం నుండి ప్రజలకు విముక్తి కల్పిస్తాననీ, కులవృత్తి చేయననీ తల్లి దగ్గర ప్రతిజ్ఞ చేశాడు. పాపన్న ఎక్కువగా ఇతర బహుజన కులాల వారితో కలిసి తిరిగేవాడు. వీరిలో చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్‌ మీరు సాహెబ్‌ ముఖ్యులు.



సర్దార్‌ సర్వాయి పాపన్న

పాపన్నకు ఎలాంటి వారసత్వ నాయకత్వం కాని, ధనంకాని లేవు. గిరిజనులను చేరదీసి వారికి యుద్ధ విద్యలను నేర్పాడు. పాపన్న ముందుగా తన చుట్టుపక్కల ఉన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు, కోటలు నిర్మించాడు. 1678 నాటికి తాటికొండ, వేములకొండలను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. చివరకు గోల్కొండ కోటను స్వాధీనపర్చుకొని 7 నెలలపాటు అధికారం చలాయించాడు. అయితే మొఘల్‌ సేనలు వచ్చి అతడిని అతి కష్టం మీద పట్టుకొని ఉరితీశాయి.

పాపన్న ఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చినవాడు కనుక అతనికి ప్రజల కష్టనష్టాలన్నీ తెలుసు. అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఖజానా కొరకు జమీందార్, సుబేదార్లపై తన గెరిల్లా సైన్యంతో దాడి చేయించేవాడు. వారి వద్ద నుంచి దోచుకున్న సొమ్మును ప్రజలకు పంచిపెట్టాడు. వారి భూములను కూడా ప్రజలకు పంచాడు. పాపన్న అనేక ప్రజామోదయోగ్యమైన పనులు చేశాడు. అతని రాజ్యంలో సామాజిక న్యాయం పాటించేవాడు. తాటికొండలో చెక్‌డ్యామ్‌ నిర్మించాడు. అతను ఎల్లమ్మకు భక్తుడు కావున హుజురాబాద్‌లో ఎల్లమ్మ గుడి కట్టించాడు. అది రూపం మారినా నేటికీ అలాగే ఉంది.

పిచ్చుక కుంట్లవారు, దాసరి కాండ్రవారు, వీరముష్టి వారు పాపన్న చరిత్రను వీరగాథలుగా ఊరూరా తిరిగి చెప్పేవారు. అలా జానపద కళా రూపాల ద్వారానే పాపన్న చరిత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించాయి. అయితే ఆంగ్లేయ కవి జే.యే. బోయాల్‌ ఇండియన్‌ యెంటిక్వెరి పత్రికలో 1874 లోనే రాశారు.


పాపన్న వీరత్వానికి గుర్తుగా లండన్‌ మ్యూజియంలో విగ్రహాన్ని పొందుపరిచారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్‌బుక్‌లో పాపన్న గురించి రాశారు. జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో 17వ శతాబ్దంలో పాపన్న నిర్మించిన చారిత్రక కోట ఇప్పటికీ నిలిచి ఉంది. దాన్ని పరిరక్షించడానికి తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– పాకాల శంకర్‌ గౌడ్‌ । టీచర్, సిరిసిల్ల

(నేడు సర్దార్‌ సర్వాయి పాపన్న జయంతి)

'ఓట్‌ బ్యాంక్‌' నుంచి 'ఓట్‌ ట్రాన్స్‌ఫర్‌' వరకూ...

అభిప్రాయం



జాన్‌సన్‌ చోరగుడి

తాజాగా ముగిసిన 2024 ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో కొన్ని మౌలిక అంశాలు అనివార్యంగా చర్చకు వస్తున్నాయి. ఈ సందర్భంలో ఇటీవల యునైటెడ్‌ నేషన్స్‌ పాపులేషన్‌ ఫండ్‌ మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్‌ జనరల్‌ ఎస్‌ రామారావు రాసిన వ్యాసాన్ని ఇక్కడ ప్రస్తావించడం ఎంతైనా అవసరం. ''మనదేశంలో 2011 జనగణన తర్వాత మళ్ళీ పదేళ్ళకు 2021లో అది జరగాల్సి ఉంది. కానీ అది వాయిదా పడడంతో, మన అన్ని అవసరాలకు పాత జనాభా లెక్కల మీద ఆధారపడాల్సి వస్తున్నది. అందువల్ల సంక్షేమ పథకాలు పలువురు అర్హులకు అందకుండా పోతున్నాయి'' అంటున్నారు. గతంలో వీరు 'సెన్సెస్‌ అండ్‌ ట్యాబ్యులేషన్‌' విభాగంలో ఉన్నత స్థాయిలో పనిచేశారు. ఇంకా ఆయన– ''ఇటీవల బడ్జెట్‌లో ఇందుకు కేటాయించిన నిధులను చూసినప్పుడు, ఇవి ఎప్పుడు జరుగుతాయో అనే అనుమానాలనే కలిగిస్తున్నాయి. ఏదేమైనా ఈ విషయంలో ఇంకా జాప్యం అంటే మాత్రం, అది ప్రమాదం అవుతుంది'' అంటున్నారు.

తాజా గణాంకాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు పలువురు అర్హులకు అందకుండా పోతున్నాయి, అనే ఆవేదనలో మరో మాటకు తావులేదు, అది నిజం. అయితే, 2019–2024 మధ్య రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీన్ని అధిగమించి మరీ సంక్షేమ పథకాలను అమలుపరచి రికార్డు సృష్టించింది. ఎలా అంటే అది– 'సంతృప్త స్థాయి'ని ప్రాతిపదిక చేసుకుని అటువంటి అరుదైన రికార్డును నెలకొల్పింది. ఇందులో మళ్ళీ లబ్ధిదారుల ఎంపిక అనేది లేకుండా, అర్హులైన అందరికీ... అనేది ప్రాతిపదిక కావడంతో, ఏ స్థాయిలోనూ 'మేనేజ్‌' చేయడం అనే అవసరం పంచాయతీ నుంచి పార్లమెంట్‌ నియోజకవర్గం వరకూ ఎక్కడా రాలేదు.

పథకం ఏదైనా అర్హత ఉంటే చాలు అని అందరికీ ఇచ్చారు. అయితే, కాంగ్రెస్‌ వంటి రాజకీయ పార్టీలు మళ్ళీ పాత పద్ధతిలో గతంలో మాదిరిగా– 'ఎస్సీ కార్పొరేషన్‌' లను ప్రారంభించాలి, అంటూ తిరుపతిలో ఆందోళన చేసినట్టుగా జులై చివరిలో వార్తలు వచ్చాయి. ఈ కార్పొరేషన్లు లేకపోవడం వల్లనే ఎస్సీలకు సంక్షేమ పథకాలు అందడం లేదు, అనే వాదనను ఆ పార్టీ తెరపైకి తెస్తున్నది. రాష్ట్రాల్లో 'ఈ– గవర్నెన్స్‌' నడుస్తున్న



కాలంలో దేశానికి 'కంప్యూటర్లను' పరిచయం చేసిన పార్టీ 2024లో చెయ్యాల్సిన డిమాండ్‌ ఎంతమాత్రం కాదిది.

అయినా సంక్షేమ పథకాల రూపకల్పన, అమలు విషయంలో దేశానికి ఒక కొత్త– 'సిలబస్‌' ఇచ్చిన వైఎస్సార్‌సీపీ నమూనా దేశమంతా ఏదో ఒక రూపంలో చలామణిలోకి వచ్చాక, మళ్ళీ దాన్ని వెనక్కి తీసుకువెళ్ళడం గురించి ఎవరు మాట్లాడినా అది పేలవంగా తేలిపోతుంది. దాన్ని కొనసాగించలేక, ఆ విషయం నేరుగా ప్రకటించలేక, ఏపీలో ఎన్డీఏ కూటమి పడుతున్న ఆపసోపాలు బహిరంగమైన పరిస్థితుల్లో, కాంగ్రెస్‌ వంటి పార్టీల ఉనికి పోరాటానికి– 'ఎస్సీ కార్పొరేషన్లు కావాలి...' వంటి దేశవాళీ 'డిమాండ్లు' ఆ పార్టీలకు రాజకీయంగా పనికిరావొచ్చు. అయితే, ఈ సందర్భంగానే– 2024 ఎన్నికల్లో 'దళిత్‌ వోట్‌'పై 'లోక్‌ నీతి'–'సీఎస్‌డీఎస్‌' కో డైరెక్టర్‌ ప్రొ॥ సంజయ్‌ కుమార్‌ బృందం చేసిన విశ్లేషణను గమనించడం ఎంతైనా అవసరం. ఎన్నికలు అనేసరికి ఒకప్పుడు 'ఓటు బ్యాంక్‌' అనే స్థిమిత స్థితి ఉండడం మనకు తెలుసు. అయితే, ఇప్పుడు ఆ స్థానంలోకి 'ఓటు ట్రాన్స్‌ఫర్‌' అనే అనిశ్చిత స్థితి రావడంతో– 'లిక్విడ్‌ పాలిటిక్స్‌' (ద్రవ రాజకీయాలు) అనే సరికొత్త రూపాన్ని మన రాజకీయాలు తీసుకుంటున్నాయి. చంద్రబాబు ఒకేసారి రెండు భిన్నమైన రాజకీయ కూటములతో మైత్రి కొనసాగిస్తూ ఈ తరహా 'ద్రవ రాజకీయాలకు' దేశంలోనే ఎత్తైన ప్రతినిధిగా నిలుస్తారు.

ఇప్పుడు క్రమంగా ప్రజలు కూడా కొందరు నాయకులు అనుసరిస్తున్న ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ప్రొ॥ సంజయ్‌ కుమార్‌ బృందం చేసిన విశ్లేషణలో మనకు కనిపిస్తున్నది అదే. ఆంధ్రప్రదేశ్‌లో దళిత్‌ ఓటు వైఎస్సార్‌సీపీ–తెలుగు దేశం పార్టీ మధ్య సమానంగా చీలిందంటారాయన. ఇక్కడ 48 శాతం టీడీపీకి పడితే, 50 శాతం వైఎస్సార్‌సీపీకి, కేవలం 2 శాతం కాంగ్రెస్‌కు వచ్చాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌ పార్టీకి ఓటు బ్యాంకుగా ఉన్న ఆ వర్గాలు 2014 తర్వాత అక్కణ్ణించి పూర్తిగా జగన్‌ మోహన్‌ రెడ్డి పార్టీ వైపుకు బదిలీ అయితే, 2024లో తిరిగి కొంతమేర అవి టీడీపీకి బదిలీ అయ్యి చివరికి అది గెలిచింది. రాబోయే ఐదేళ్ళు వైఎస్సార్‌సీపీ చేయబోయే రాజకీయాలకు దానికి మిగిలిన నైతిక బలం దానికొచ్చిన 40 శాతం ఓట్లు అయితే, అందులోని 50 శాతం 'దళిత్‌ ఓటు' అయింది. టీడీపీకి బదిలీ అయిన 48 శాతం దళిత్‌ ఓటు, ఎన్నికల హామీల అమలు వైఫల్యంతో ఎంత వేగంగా మళ్ళీ వెనక్కి వైఎస్సార్‌సీపీ వద్దకు వస్తుంది అనేదాన్నిబట్టి ఇకముందు జరగబోయే రాజకీయాలు ఉంటాయి.

వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

క్లుప్తంగా...

గోడ కూలి ఇద్దరు చిన్నారులు దుర్మరణం


సాత్విక్ (ఫైల్)


సిద్ధార్థ (ఫైల్)

పెదకాకాని: ఆటలాడుతున్న చిన్నారులపై ప్రహరీగోడ కూలి పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గుంటూరుజిల్లా పెదకాకానిలో శుక్రవారం చోటు చేసుకుంది. పెదకాకాని లూథర్‌గిరి కాలనీకి చెందిన కోలాటపు పెద దిబ్బయ్య, రత్నకుమారి దంపతులకు ఒక పాప, ఒక బాబు. వారి కుమారుడు సాత్విక్ 6వ తరగతి చదువుతున్నాడు. వారి ఇంటి సమీపంలో బంగారు రాజు, జ్యోతి దంపతులు ఉంటున్నారు. వారికి ఒక పాప, ఒక బాబు. వారి కుమారుడు బంగారు సిద్ధార్థ 7వ తరగతి చదువుతున్నాడు. బంగారపు సిద్ధార్థ, కోలాటపు సాత్విక్ స్నేహితులు. ఇద్దరూ కలసి శుక్రవారం సాత్విక్ ఇంటి ముందు ఆడుకుంటున్నారు. అప్పటికే ఇంటి ముందు ఉన్న ప్రహరీగోడ కదలడంతో కింద పడకుండా సపోర్ట్‌గా చెక్క కమ్మి ఉంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దెబ్బతిన్న ఆ గోడ ఒక్కసారిగా కూలి పక్కనే ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై పడడంతో చిన్నారులు ఊపిరి ఆడక, అపస్మారకస్థితికి చేరుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చిన్నారులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సాత్విక్ (12), బంగారు సిద్ధార్థ (13) మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను సైతం కంటతడి పెట్టించింది.

'డెంగీ'తో మహిళ మృతి


రత్నమ్మ (ఫైల్)

రాజంపేట రూరల్: డెంగీ వ్యాధి సోకి మోడపోతుల రత్నమ్మ (38) అనే మహిళ శుక్రవారం వేకువ జామున మృతి చెందినట్లు బంధువులు తెలియజేశారు. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా హస్తవరం గ్రామానికి చెందిన రత్నమ్మ భర్త మోడపోతుల నరసింహులు గత డిసెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి రత్నమ్మ తన కుమార్తెతో కలిసి హస్తవరంలోనూ, వల్లూరుపల్లిలోనూ జీవనం సాగించేది. ఈ నెల 13వ తేదీ జ్వరం ఎక్కువ కావడంతో 15వ తేదీ రాజంపేటలోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లింది. అక్కడి వైద్యులు ఎన్ఎస్1 ఆంటిజెన్ టెస్టు చేశారు. టెస్టులో పాజిటివ్ రావడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యం పొందుతూ డెంగీతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హాథీరాం బావాజీ భూముల లెక్కలు తీస్తా

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్



తిరుపతి రూరల్: గిరిజనుల ఆరాధ్య దైవం హాథీరాం బావాజీ మఠానికి చెందిన భూముల లెక్కలను తీస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ స్పష్టం చేశారు. తిరుపతి విద్యుత్ నగర్‌లోని ప్రపంచంలోనే ప్రప్రథమ హాథీరాం బావాజీ ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. రూ.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. వేల కోట్ల హాథీరాం బావాజీ ఆస్తులను అగ్రకులాలకు చెందిన వారు స్వాహా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి హోదాలో మఠం అధికారులు, జిల్లా కలెక్టర్, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించి, భూముల లెక్క తీస్తామని స్పష్టం చేశారు.


తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు


శ్రీశైలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


దాచేపల్లిలో కరెన్సీ అలంకరణలో వాసవీ మాత

వరలక్ష్మీదేవి నమోస్తుతే..

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/తిరుచానూరు(చంద్రగిరి)/శ్రీశైలం టెంపుల్/దాచేపల్లి: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. వివిధ రకాల పిండి వంటలు చేసి నైవేద్యంగా సమర్పించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో పోటెత్తారు. కుంకుమార్చన జరిపి.. ముత్తైదువులు పసుపు, కుంకుమను ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. కాగా, ఇంద్రకీలాద్రిపై ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శ్రీవరలక్ష్మి వ్రతం వైభవంగా జరిగింది. అమ్మవారు బంగారు చీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీపద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేశారు. అలాగే శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు విశేషంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై వ్రతాలను ఆచరించారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సుమారు రూ.2లక్షల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు.

'సుప్రీం' తీర్పులకు ఈసీ వక్రభాష్యం

ఈవీఎంల వెరిఫికేషన్‌కు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు

- అందుకు విరుద్ధంగా స్వీయ ఎస్‌వోపీ రూపొందించిన ఈసీ
- వెరిఫికేషన్ స్థానంలో మాక్ పోలింగ్ నిర్వహణకు ఆదేశాలు
- మాక్ పోలింగ్‌తో ఈవీఎంల ట్యాంపరింగ్ తేల్చడం అసాధ్యం
- ఈవీఎంలలో నమోదైన ఓట్లు, వీవీ ప్యాట్ స్లిప్పులను సరి పోల్చితేనే లొసుగులు బహిర్గతం
- ఎన్నికల కమిషన్ తీరుపై హైకోర్టులో బాలినేని పిటిషన్
- ఎన్నికల సంఘం ఆదేశాలను రద్దు చేయాలని అభ్యర్థన

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ల పనితీరుపై దేశవ్యాప్తంగా అనుమానాలు, సందేహాలు పెరిగిపోతున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. సుప్రీంకోర్టు తీర్పునకు వక్రభాష్యం చెబుతూ ఎన్నికల సంఘం రూపొందించిన టెక్నికల్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (టీ–ఎస్‌వోపీ)పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సంఘం తీరుపై ప్రజల్లో, పోటీ చేసిన అభ్యర్థుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తనిఖీ, పరిశీలనకు అవకాశం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు ఎన్నికల సంఘం తిలోదకాలిచ్చింది. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తనిఖీ, పరిశీలన చేయకుండా మాక్ పోలింగ్ నిర్వహించి చేతులు దులిపేసుకునే దిశగా ఎన్నికల సంఘం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. మాక్ పోలింగ్ నిర్వహించడం ద్వారా ఈవీఎంల ట్యాంపరింగ్ బయట పడే అవకాశమే లేదన్నది నిపుణుల మాట. ఈవీఎంలలో నమోదైన ఓట్లు, వీవీ ప్యాట్ స్లిప్పులను సరిపోల్చి పరిశీలిస్తే కానీ ఈవీఎంల ట్యాంపరింగ్ వెలుగుచూసే అవకాశం ఉండదని వారు చెబుతున్నారు. మాక్ పోలింగ్ కేవలం ఆయా మిషన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్న విషయాన్ని మాత్రమే రూఢీ చేస్తుందని, అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయదని స్పష్టంగా చెబుతున్నారు.



సుప్రీంకోర్టు చెప్పింది ఇదీ...

ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఈవీఎంల ట్యాంపరింగ్, మార్పులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలైన ఓట్లను వీవీ ప్యాట్ల స్లిప్పులతో సరిపోల్చి చూడాలని ఎన్నికల్లో పోటీ చేసి ఓట్లపరంగా రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు రాతపూర్వకంగా కోరవచ్చు. అలాంటప్పుడు ఒక్కో అసెంబ్లీ లేదా పార్లమెంట్ నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్‌లలో 5 శాతం ఈవీఎంలను, వీవీ ప్యాట్ల స్లిప్పులను ఈవీఎంల తయారీ సంస్థల ఇంజనీర్లు తనిఖీ చేసి పరిశీలన చేసి తీరాలి. పోలింగ్ స్టేషన్లను లేదా సీరియల్ నంబర్లను అభ్యర్థులే ఎంపిక చేసుకోవచ్చు. ఈవీఎంల పరిశీలన కోరిన అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పరిశీలన సమయంలో ఉండొచ్చు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన వారం లోపు అభ్యర్థులు ఈవీఎంల పరిశీలన కోరవచ్చు. ఇంజనీర్లతో సంప్రదించిన తరువాత ఈవీఎంల తాలూకు మైక్రో కంట్రోలర్ల ప్రామాణికతను ఎన్నికల అధికారి ధృవీకరించాలి. ఈవీఎం ట్యాంపరింగ్ అయిందని తేలితే పరిశీలన నిమిత్తం ఆ అభ్యర్థి చెల్లించిన మొత్తాన్ని వాపసు చేయాలి.

ఎన్నికల సంఘం చేస్తున్నది ఇదీ...

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లకు, ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లకు పొంతనే లేదు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికులకు అసాధారణ మెజారిటీలు వచ్చాయి. ఇవన్నీ ఈవీఎంల పనితీరుపై సందేహాలు, అనుమానాలు రేకెత్తించాయి. దీంతో ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పరిశీలనకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఫీజు సైతం చెల్లించారు. అయితే ఇటీవల ఎన్నికల అధికారులు ఈ ఫీజును వాపసు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలపై ఒత్తిడి తేవడం మొదలుపెట్టారు. అయితే ఈ ఒత్తిళ్లకు వారు లొంగలేదు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తనిఖీ, పరిశీలన చేస్తే ఈవీఎంల ట్యాంపరింగ్ బయటపడుతుందన్న ఆందోళనతోనే ఎన్నికల అధికారులు ఇలా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తనిఖీ, పరిశీలన స్థానంలో మాక్ పోలింగ్‌ను తెరపైకి తెచ్చారు.

ఏమిటీ మాక్ పోలింగ్..?

మాక్ పోలింగ్ అనేది ఎన్నికల సంఘం రొటీన్‌గా నిర్వహించే ఓ ప్రక్రియ. పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, సింబల్ లోడింగ్ యూనిట్లు తదితరాలను తనిఖీ చేస్తారు. ఈవీఎంల తయారీ సంస్థల ఇంజనీర్ల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు, పరిశీలనలు ఉంటాయి. పోలింగ్ రోజు ఎలాగైతే ఆయా మిషన్లను ఓటింగ్ కోసం ఉపయోగిస్తారో అదే రీతిలో మాక్ పోలింగ్ సందర్భంగా వాటిని వినియోగిస్తారు. ఒక్కో బటను నొక్కి సక్రమంగా పనిచేస్తుందా? లేదా? అనేది పరిశీలిస్తారు. ఒక్కో అభ్యర్థి పేరు పక్కన ఉన్న బటన్‌ను నొక్కి పని తీరును పరిశీలిస్తారు. అలాగే వీవీ ప్యాట్ల స్లిప్పులు సక్రమంగా వస్తున్నాయా? లేదా? చూస్తారు. అన్ని యూనిట్లు సక్రమంగా కనెక్ట్ అయ్యాయా? లేదా? అన్న విషయాన్ని కూడా పరిశీలిస్తారు. అన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయా? లేదా? అనేది తనిఖీ చేస్తారు.

ఎన్నికల సంఘం తీరుపై బాలినేని న్యాయ పోరాటం..

తన నియోజకవర్గంలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందన్న అనుమానాలతో ఓటింగ్ యంత్రాల పరిశీలన, తనిఖీ కోసం దరఖాస్తు చేసుకున్న ఒంగోలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి తాజాగా ఎన్నికల సంఘం జారీ చేసిన మాక్ పోలింగ్ ఆదేశాలపై న్యాయ పోరాటానికి దిగారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు ఆయన న్యాయవాది వివేకానంద తెలిపారు. ఈ నెల 16న జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోర్టును కోరినట్లు చెప్పారు. మాక్ పోలింగ్ ద్వారా ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తనిఖీ, పరిశీలనను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని అభ్యర్థించామన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తేనే తనకు న్యాయం జరుగుతుందని, అత్యున్నత న్యాయస్థానం తీర్పును అమలు చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరామన్నారు.



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ పి.రాజశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని జస్టిస్ చీమలపాటి రవి దర్శించుకున్నారు. - తిరుమల/తిరుచానూరు



విశాఖ జిల్లా సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు. - సింహాచలం (విశాఖ జిల్లా)



శ్రీశైలం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి బేలా మాధుర్య త్రివేది కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మల్లికార్జున స్వామికి జస్టిస్ బేలా మాధుర్య త్రివేది రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన చేశారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. - శ్రీశైలం టెంపుల్



ఇంద్రకీలాద్రిపై వరలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. - ఇంద్రకీలాద్రి



ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ పంచహారతుల సేవలో హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు శుక్రవారం పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ అధికారులు ఎన్.రమేష్‌బాబు, బలరామ్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. - ఇంద్రకీలాద్రి

ఉక్కులో నిండుకున్న ముడి పదార్థాలు

మూడు రోజులకే బొగ్గు నిల్వలు

- అడుగంటిన ఇనుప ఖనిజం
- ఇదే కొనసాగితే నిలిచిపోనున్న ఉక్కు ఉత్పత్తి
- ముడిపదార్థాల సరఫరాలపై అమలు కాని కేంద్ర మంత్రి హామీ



ఉక్కునగరం (విశాఖ జిల్లా): విశాఖ స్టీల్ ప్లాంట్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్లాంట్‌లో ముడి పదార్థాల నిల్వలు అత్యంత కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. యుద్ధ ప్రాతిపదికన సహాయం అందకపోతే స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోతుంది. సీఎం చంద్రబాబు కల్పించుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు.

స్టీల్‌ప్లాంట్ గత కొన్ని నెలలుగా ముడి పదార్థాల కొరతతో సతమతమవుతోంది. మూడు బ్లాస్ట్‌ఫర్నేసుల్లో ఒకదానిని నిలిపివేసి అంతంత మాత్రం హాట్ మెటల్ ఉత్పత్తి చేస్తున్నారు. గత నెలలో స్టీల్ ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్లాంట్‌కు అవసరమైన ముడి పదార్థాలు సెయిల్, ఎన్ఎండీసీ ద్వారా సమకూరుస్తామని భరోసా ఇచ్చారు. ఈ హామీ ఇచ్చి నెల దాటినా ఇంతవరకు ముడి పదార్థాలు రాలేదు. ముఖ్యంగా బొగ్గు నిల్వలు తరిగిపోయాయి. ప్రస్తుతం సాధారణ ఉష్ణోగ్రతలు మెయింటైన్ చేయడానికి కూడా అవకాశం లేని విధంగా నిల్వలు చేరుకున్నాయి. ఇంపోర్టెడ్ కోకింగ్ కోల్ (ఐసీసీ) మూడు రోజులకు మాత్రమే సరిపోయేలా ఉంది. దీంతో కోక్ ఓవెన్స్ బ్యాటరీల పుషింగ్స్ 300 నుంచి 200కు తగ్గించారు. విశాఖ ఉక్కు కొనుగోలు చేసిన ఇంపోర్టెడ్ కోకింగ్ కోల్ గంగవరం పోర్టులో 1.40 లక్షల టన్నులు ఉంది. దానిపై కోర్టు అటాచ్‌మెంట్ ఆర్డర్ ఉండటంతో పోర్టులోనే నిలిచిపోయింది. ఉక్కు మంత్రి పర్యటనలో మూడు షిప్‌మెంట్ల కోల్ ఇవ్వాలని ఆదేశించినప్పటికీ, ఇప్పటివరకు మూడు రేక్‌లు మాత్రమే సెయిల్ నుంచి అందాయి. అవి దాదాపు వినియోగించారు. మరోవైపు ఐరన్ ఓర్ లంప్స్ నిల్వలు పూర్తిగా అడుగంటాయి. సైజ్డ్ ఓర్, ఐరన్ ఓర్ ఫైన్స్ నిల్వలు ఐదు రోజులకు మాత్రమే ఉన్నాయి. అదే విధంగా బాయిలర్ కోల్ నిల్వలు కూడా జీరో స్థాయికు చేరుకున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ప్లాంట్ ఉత్పత్తి నిలిచిపోతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హామీని విస్మరించిన కూటమి నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా నేతలంతా ఆ హామీలను పూర్తిగా విస్మరించారు. తక్షణం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఉక్కు ఉద్యోగ కార్మిక నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు శనివారం ప్రధానితో భేటీ కానున్నారు. ఈ భేటీలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశంపై స్పష్టమైన హామీను కోరాలని, ప్లాంట్‌కు కావాల్సిన ముడి పదార్థాలు, ఆర్థిక ప్యాకేజీలపై చర్చించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం సెక్రటేరియట్‌కు మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు తెలిపారు.



అంగన్‌వాడీ నిర్వాహకురాలితోమాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వాగులు దాటి.. కాలినడకన చేరి

కన్నాయిగూడెం: ఆమె అదనపు కలెక్టర్. గ్రామ సమస్యలు తెలుసుకునేందుకు కాలినడకన వాగులు దాటారు. పన్నెండు కిలోమీటర్లు బైక్‌పై, మధ్యమధ్యలో కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. ఆదివాసీలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ గ్రామానికి బయల్దేరారు. మండలంలోని సర్వాయి వరకు వాహనంలో వెళ్లారు. అనంతరం అక్కడినుంచి ఐలాపూర్ వరకు 12 కిలోమీటర్ల మేర మధ్యలోని దట్టమైన అడవి.. అక్కడక్కడ ఉన్న వాగులు దాటారు. ఆదివాసీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


సుద్దవాగు దాటుతూ...

తిరుమలలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ


పవిత్రాలను తీసుకు వస్తున్న వేదపండితులు, అధికారులు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు జరిపారు. సంపంగి ప్రాకారంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీవారి మూలవర్లు, ఉత్సవ మూర్తులు, జయవిజయులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి, వకుళమాత, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులు, యోగనరసింహస్వామి, భాష్యకారులు, పోటు తాయారు, ధ్వజస్తంభం, బలిపీఠం, శ్రీభూవరాహస్వామి, శ్రీబేడి ఆంజనేయస్వామికి పవిత్ర మాలలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కారణంగా శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు దంపతులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

నారాయణగిరిలో వేడుకగా ఛత్రస్థాపనోత్సవం

తిరుమల నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద శుక్రవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించారు. ముందుగా శ్రీవారి పాదాలకు తిరుమంజనం జరిపారు. అనంతరం అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు.



రాయిమానువాగులో ఇద్దరు ఉపాధ్యాయుల గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం, మరొకరి కోసం గాలింపు
- పార్వతీపురం మన్యం జిల్లాలో ఘటన


ఆర్తి (ఫైల్)


మహేష్ (ఫైల్)

పాచిపెంట: వృత్తి రీత్యా రాష్ట్రాలు దాటి వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులు వాగులో కొట్టుకుపోయారు. వీరిలో ఒకరు మృతిచెందగా, మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో శుక్రవారం జరిగిన ఘటనకు సంబంధించి ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సరాయివలస ఏకలవ్య మోడల్ స్కూల్‌లో వార్డెన్‌గా మహేష్, సోషల్ టీచర్‌గా ఆర్తి పనిచేస్తున్నారు. వీరిది హరియాణ రాష్ట్రం. ఎప్పటివలే శుక్రవారం విధులు ముగించుకుని స్థానికంగా గురివినాయుడుపేట గ్రామంలో తమ నివాసాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ద్విచక్రవాహనంపై మహేష్, ఆర్తి ఇద్దరూ సాయంత్రం 4 గంటల సమయంలో గురివినాయుడుపేట వైపు వస్తుండగా, మార్గమధ్యంలోని రాయిమానువాగు దాటే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇద్దరూ కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్తి మృతదేహం లభ్యం కాగా.. మహేష్ ఆచూకీ దొరకలేదు. మహేష్ వాగులోని చెట్టు కొమ్మ సాయంతో బయటపడి వాగు అంచును పట్టుకొన్నప్పటికీ.. ఆ అంచు జారిపోవడంతో మళ్లీ వాగులో పడి కొట్టుకుపోయాడని స్థానికులు చెబుతున్నారు.

మరో మహమ్మారి..!

ఇప్పటికే ఆఫ్రికా దేశాలను చుట్టేసిన ప్రమాదకర మంకీపాక్స్ వైరస్

దశాబ్దాల నిర్లక్ష్యం నేడు ప్రాణాంతకంగా మారిన వైనం





నిన్న స్వీడన్‌కు
నేడు పాకిస్తాన్‌కు పాకిన వైరస్
అప్రమత్తంగా ఉండాలంటూ
ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

కోవిడ్ మహమ్మారి సృష్టించిన మహావిలయం నుంచి ప్రపంచం పూర్తిగా తేరుకోకముందే ఎంపాక్స్ రూపంలో మరో వైరస్ భూతం భూమండలాన్ని చుట్టేస్తోంది. తొలుత ఆఫ్రికా దేశాలకే పరిమితమైన ఈ వైరస్ తాజాగా రూపాంతరాలు చెంది ప్రాణాంతకంగా పరిణమించింది. ఆఫ్రికాలో ఇన్నేళ్లలో వందలాది మంది మరణాలతో ప్రపంచదేశాలు ఇన్నాళ్లకు అప్రమత్తమయ్యాయి. నిర్లక్ష్యం వహిస్తే మరో మహమ్మారిని స్వయంగా ఆహ్వానించిన వారమవుతామని దేశాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా హెచ్చరికలు జారీచేసింది. ఈ మేరకు బుధవారం ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించింది. ఆఫ్రికా ఖండాన్ని దాటి వేరే ఖండాల దేశాల్లోనూ వేగంగా వ్యాపిస్తుండటంతో 2022 ఏడాది తర్వాత తొలిసారిగా డబ్ల్యూహెచ్‌ఓ 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ'ని ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే ఆఫ్రికాలో ఈ 7 నెలల్లో 15,600 కేసులు నమోదయ్యాయి. 537 మంది ఎంపాక్స్ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. తాజాగా స్వీడన్, పాకిస్తాన్‌లకూ వైరస్ పాకింది. ఈ నేపథ్యంలో వైరస్ వ్యాప్తి, కట్టడి, నివారణ చర్యలుసహా వ్యాధి పుట్టుపూర్వోత్తరాలను ఒకసారి తెల్సుకుందాం.

ఏమిటీ ఎంపాక్స్ వైరస్?

1958లో తొలిసారిగా కోతుల్లో ఈ వైరస్‌ను కనుగొన్నారు. అందుకే ఈ వైరస్‌కు మంకీపాక్స్ పేరు స్థిరపడిపోయింది. అప్పట్లో పరిశోధన కోసం డెన్మార్క్‌కు తరలించిన కోతుల్లో కొత్త రకం వ్యాధి లక్షణాలు కనిపించడంతో ల్యాబ్ పరీక్షలు జరిపి ఈ వైరస్ ఉనికి కనిపెట్టారు. 1970లో కాంగో దేశంలో తొమ్మిదేళ్ల బాలుడికి ఈ వైరస్ సోకడంతో తొలిసారిగా మనుషుల్లో ఈ వైరస్‌ను గుర్తించారు. మనుషులు, చిట్టెలుకలకూ వైరస్ సోకడంతో 'మంకీ'పాక్స్‌కు బదులు ఎంపాక్స్ అనే పొట్టిపేరును ఖరారుచేశారు. ఆర్థోపాక్స్ వైరస్ రకానికి చెందిన ఎంపాక్స్ సోకితే చర్మం ఎర్రగా మారి పొక్కులు వస్తాయి. సొన చేరి పొక్కులు ఇబ్బంది పెడతాయి. దశాబ్దాల క్రితం లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న మశూచి వ్యాధికి కారణమైన వైరస్, ఎంపాక్స్ ఒకే జాతికి చెందినవి. గోవులకు సోకే గోమశూచి, వసీనియా వంటి వ్యాధులను కల్గించే వైరస్ కూడా ఈ రకానిదే.

వైరస్ ఎలా సోకుతుంది?

- అప్పటికే వైరస్ సోకిన మనుషులు లేదా జంతువులను తాకినా, వారితో దగ్గరగా గడిపినా వైరస్ సోకుతుంది.
- కుక్క లేదా ఇతరత్రా పెంపుడు జంతువులకు వైరస్ సోకితే అవి మనుషులను కరిచినా, తాకినా, వాటి లాలాజలం, రక్తం, ఇతర స్రావాలు అంటుకున్నా వైరస్ సోకుతుంది.
- చర్మంపై గాయాలు, శరీర స్రావాలు, తుమ్మినపుడు పడే తుంపర్లు, నోటి లాలాజలం ఇలా వైరస్‌కు ఆవాసయోగ్యమైన ప్రతి తడి ప్రాంతం నుంచి వైరస్ సోకుతుంది
- ఎక్కువసేపు ముఖాన్ని ముఖంతో తాకినా, ముద్దుపెట్టుకున్నా సోకొచ్చు
- రోగి వాడిన దుస్తులు, వస్తువులను ముట్టుకున్నా, వాడినా వైరస్ సోకే అవకాశాన్ని కొట్టిపారేయలేం

లక్షణాలు ఏమిటీ?

- చర్మంపై దద్దుర్లతోపాటు జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాల నొప్పి, వెన్ను నొప్పి వస్తాయి. ఒళ్లంతా నీరసంగా ఉంటుంది. గొంతు ఎండిపోతుంది.
- మధ్యస్థాయి పొక్కులు పైకి తేలి ఇబ్బంది కల్గిస్తాయి.
- మనుషుల్లో ఒకరి నుంచి మరొకరికి, వణ్యప్రాణుల నుంచి సోకుతుంది. 90 శాతం కేసుల్లో ముఖంపైనా, 75 శాతం కేసుల్లో అరచేతులు, పాదాల మీద, 30 శాతం కేసుల్లో జననాంగాల మీద పొక్కులు వస్తాయి. నీటి బొడిపెలుగా చిన్నగా మొదలై పెద్దవై తర్వాత సొన చేరి ఎర్రగా, నల్లగా మారి పగులుతాయి.

వ్యాక్సిన్ ఉందా?

అత్యల్ప లక్షణాలు కనిపిస్తే వ్యాధి దానంతట అదే తగ్గిపోతుంది. ప్రస్తుతానికి ఎంపాక్స్ సోకిన వారికి నిర్దష్టమైన చికిత్స విధానంగానీ వ్యాక్సిన్‌గానీ లేవు. మశూచి చికిత్సలో వాడే యాంటీ వైరల్ ఔషధమైన టికోవిరమాట్(టీపీఓఎక్స్ ఎక్స్)ను ఎంపాక్స్ రోగులకు ప్రయోగాత్మకంగా వాడుతున్నారు. అమెరికాలో మశూచికి వాడే జెనియోస్ డ్రగ్స్‌నే 18 ఏళ్లు, ఆపైబడిన వయసు రోగులకు ఇస్తున్నారు. కోవిడ్ దెబ్బకు సంపన్న, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యాధులు ప్రబలేలోపే నివారణ చర్యలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్యపరంగా నిఘా కార్యక్రమాలు కొనసాగుతున్నాయిగానీ వెనుకబడిన ఆఫ్రికా దేశాల్లో అవేం లేవు. దీంతో వైరస్ వ్యాప్తి ఆగట్లేదు.

వేటి ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది?

రోగి వినియోగించిన దుస్తులు, మంచం, టవల్స్, పాత్రలు సాధారణ వ్యక్తి వాడితే అతనికీ వైరస్ వస్తుంది. లాలాజలం తగిలినా, కరచాలనం చేసినా సోకుతుంది. తల్లి నుంచి బిడ్డకు వైరస్ సంక్రమించవచ్చు.

కొత్తగా ఏఏ దేశాల్లో విస్తరించింది

కొత్తగా 13 ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తోందని గత వారం గణాంకాల్లో వెల్లడైంది. క్రితంతో పోలిస్తే ఇక్కడ కేసులు 160 శాతం, మరణాలు 19 శాతం పెరగడం గమనార్హం. కొత్త కేసుల్లో 96 శాతం కేసులు ఒక్క కాంగోలోనే గుర్తించారు. ఎంపాక్స్ కొత్త వేరియంట్ రోగుల్లో మరింతగా వ్యాధిని ముదిరేలా చేసి జననాంగాల వద్ద చర్మగాయాలకు కారణమవుతోంది. దీంతో తమకు ఈ వైరస్ సోకిందన్న విషయం కూడా తెలీక చాలా మంది కొత్త వారికి వైరస్‌ను అంటిస్తున్నారు. 2022 ఏడాదిలో ఎంపాక్స్ క్లాడ్2 రకం వేరియంట్ విజృంభిస్తే ఈసారి క్లాడ్1 వేరియంట్ వేగంగా సంక్రమిస్తోంది. ఈ వేరియంట్ అత్యంత ప్రమాదకరం.

- సాక్షి, నేషనల్ డెస్క్

హరియాణా బలాబలాలు

పార్టీ	ఎమ్మెల్యేల సంఖ్య
బీజేపీ	40
కాంగ్రెస్	31
జననాయక్ జనతా పార్టీ	10
ఇండియన్ నేషనల్ లోక్‌దళ్	1
హరియాణా లోకహిత పార్టీ	1
స్వతంత్రులు	7

జమ్మూకశ్మీర్ (2014 ఫలితాలు)

పార్టీ	ఎమ్మెల్యేల సంఖ్య
పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ	28
బీజేపీ	25
నేషనల్ కాన్ఫరెన్స్	15
కాంగ్రెస్ పార్టీ	12
జమ్మూకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్	2
సీపీఎం	1
పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్	1
స్వతంత్రులు	3



జమ్మూకశ్మీర్ ఎన్నికలు (మొత్తం సీట్లు 90)

దశ	తేదీ	సీట్లు
1	సెప్టెంబర్18	24
2	సెప్టెంబర్25	26
3	అక్టోబర్ 1	40

హరియాణా ఎన్నికలు (మొత్తం సీట్లు 90)

దశ	తేదీ	సీట్లు
1	అక్టోబర్ 1	90

మోగింది ఎన్నికల భేరీ

జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం

- జమ్మూకశ్మీర్‌లో మూడు దశల్లో, హరియాణాలో ఒక దశలో పోలింగ్
- అక్టోబర్ 4న ఓట్ల లెక్కింపు: సీఈసీ రాజీవ్ కుమార్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా ఎన్నికల సందడి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో దశాబ్ద కాలం తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన అనంతరం తొలిసారిగా ఎన్నికల సందడి ప్రారంభం కాబోతోంది. జమ్మూకశ్మీర్‌తోపాటు హరియాణా శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. 90 స్థానాలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు దశల్లో, 90 స్థానాలున్న హరియాణా అసెంబ్లీకి ఒక దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న, హరియాణాలో అక్టోబర్ 1న ఎన్నికలు జరుగుతాయని, రెండు రాష్ట్రాల్లో అక్టోబర్ 4న ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలియజేశారు. జమ్మూకశ్మీర్‌లో మొదటి దశలో 24 సీట్లకు, రెండో దశలో 26 సీట్లకు, మూడో దశలో 40 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. ఇక్కడ చివరిసారిగా 2014 నవంబర్–డిసెంబర్‌లో ఐదు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను సాధారణంగా ఐదు దశల్లో నిర్వహిస్తుంటారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరిగాయి. దీనిపై విమర్శలు వచ్చాయి. అందుకే జమ్మూకశ్మీర్‌లో తక్కువ సమయంలోనే ఎన్నికలు నిర్వహిస్తామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని రాజీవ్ కుమార్ చెప్పారు. ఈసారి కేవలం మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తి చేయబోతున్నామని తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో భద్రతా అవసరాల వల్లే..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మరి కొన్ని రోజుల్లో ప్రకటిస్తామని రాజీవ్ కుమార్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్‌ను వాయిదా వేసినట్లు వివరించారు. 2019లో హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దాదాపు ఒకే సమయంలో జరిగాయి. ఈ ఏడాది, వచ్చే ఏడాది ఆరంభంలో మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సైతం జరగాల్సి ఉందని, వీటిలో రెండు రాష్ట్రాలకు కలిపి ఒకసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో పోలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన రాష్ట్రాల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. మీడియా సమావేశంలో రాజీవ్ కుమార్‌తోపాటు ఎన్నికల సంఘం కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూ పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీలోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది.

ముగ్గురు జెంటిల్‌మెన్ మళ్లీ వచ్చేశారు

ముగ్గురు పెద్దమనుషులు(జెంటిల్‌మెన్) మళ్లీ వచ్చేశారని మీడియా సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్ చమత్కరించారు. తన సహచర కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూను విలేకరులకు పరిచయం చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో 'లాపతా జెంటిల్‌మెన్' అంటూ ట్రోలింగ్ నడిచింది. 'లాపతా లేడీస్' చిత్రాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులు కనిపించకుండాపోయారని, లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, రాజకీయ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని నెటిజన్లు విమర్శలు గుప్పించారు. జూన్ 3న విలేకరుల సమావేశంలో రాజీవ్ కుమార్ మాట్లాడుతూ... లాపతా జెంటిల్‌మన్లు త్వరలో తిరిగివస్తారని చెప్పారు. తాము ఎక్కడికీ వెళ్లలేదని, ఇక్కడే ఉంటున్నామని పేర్కొన్నారు.

సహచరులే కీచకులా?

- వైద్యురాలిపై ఘాతుకంలో కొందరు డాక్టర్ల ప్రమేయం
- అనుమానం వ్యక్తం చేసిన బాధితురాలి తల్లిదండ్రులు
- సీబీఐ దర్యాప్తులో కొన్ని పేర్లు బయటపెట్టిన వైనం

కోల్‌కతా: ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో యువ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బాధితురాలి తల్లిదండ్రులను ప్రశ్నించారు. తమ కుమార్తెపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో అదే ఆసుపత్రిలో పని చేస్తున్న కొందరు జూనియర్ వైద్యులు, ఇతర సీనియర్ వైద్యుల ప్రమేయం ఉందని అనుమానిస్తున్నామంటూ తల్లిదండ్రులు చెప్పినట్లు సీబీఐ అధికారులు శుక్రవారం వెల్లడించారు. కొన్ని పేర్లను సైతం బయటపెట్టారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో బాధితురాలితోపాటు కలిసి పనిచేసిన వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని తల్లిదండ్రులు తెలిపినట్లు స్పష్టంచేశారు. 30 మందిని పిలిపించి, విచారించాలని నిర్ణయించామని అధికారులు వివరించారు. ఆసుపత్రి వైద్యులను, పోలీసు అధికారులను ప్రశ్నించబోతున్నామని చెప్పారు. బాధితురాలు హత్యకు గురైన రోజు ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి సమన్లు జారీ చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా, ట్రైనీ డాక్టర్ హత్యకు గురైన గదిలో సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం జరిగిందని జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఏర్పాటైన విచారణ కమిటీ ఆరోపించింది. హత్య సంగతి బయటపడగానే ఆ గదిని పరిరక్షించాల్సి ఉండగా, కొందరు లోపలికి వెళ్లి శుభ్రం చేశారని పేర్కొంది. కోల్‌కతాలోని డాక్టర్ హత్యాకాండను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో వైద్యులు శుక్రవారం భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా డాక్టర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

విధ్వంసం కేసులో 25 మంది అరెస్టు

ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో విధ్వంసం కేసులో ఇప్పటిదాకా 25 మందిని అరెస్టు చేసినట్లు కోల్‌కతా పోలీసులు చెప్పారు. వారిని కోర్టుకు తరలించామని తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం న్యాయస్థానం వారిని ఈ నెల 22 దాకా పోలీసు కస్టడీకి అప్పగించిందని వెల్లడించారు.

మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్

ట్రైనీ డాక్టర్ హత్యకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పశ్చిమబెంగాల్‌లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లపై బైఠాయించారు. బీజేపీ నేతలకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. కోల్‌కతాలో ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. నిరసన కార్యక్రమాల్లో సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) సైతం పాల్గొంది.

విధ్వంసం వెనుక సీపీఎం, బీజేపీ : మమత

జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన రాక్షసులకు ఉరిశిక్ష విధించాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమత డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని సీబీఐని కోరారు. ఆస్పత్రి విధ్వంసం వెనుక ప్రతిపక్ష సీపీఎం, బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు. సాక్ష్యాధారాలను మాయం చేయడానికే ఈ విధ్వంసం జరిగిందని అన్నారు. జూనియర్ డాక్టర్ హత్యపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. డాక్టర్ కుటుంబానికి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన భారీ ర్యాలీలో మమతా బెనర్జీ పాల్గొన్నారు. సీపీఎం, బీజేపీ మధ్య బంధం త్వరలో బయటపడుతుందని చెప్పారు.



నేడు నాన్-ఎమర్జెన్సీ వైద్య సేవల నిలిపివేత

యువ డాక్టర్ హత్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా 24 గంటలపాటు నాన్-ఎమర్జెన్సీ వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రకటించింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల దాకా ఆసుపత్రుల్లో ఈ సేవలను అందించబోమని వెల్లడించింది.

అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే విధ్వంసం

ఆర్‌జీ కార్ ఆసుపత్రి ఘటనపై కలకత్తా హైకోర్టు ఆగ్రహం

కోల్‌కతా: ఆర్‌జీ కార్ ప్రభుత్వ ఆసుపత్రిలో దుండగులు సృష్టించిన విధ్వంసకాండపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వ అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే ఈ దారుణం జరిగిందని ఆక్షేపించింది. ఆసుపత్రిలో దాడి ఘటనపై వివరణ ఇవ్వాలని, వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని పోలీసులు, ఆసుపత్రి వర్గాలను ఆదేశించింది. ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్. శివాజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. విధ్వంసాన్ని పోలీసు నిఘా వర్గాలు ఎందుకు పసిగట్టలేకపోయాయని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత అసలేం జరిగిందో చెప్పాలని అధికారులను ఆదేశించారు. వైద్యురాలి మృతదేహం కనిపించిన గదిని శుభ్రం చేసి, రంగులు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఆసుపత్రిని మూసివేయాలని ఆదేశాలు ఇవ్వగలమని స్పష్టం చేశారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో విచారణ పురోగతిని వివరించాలని, మధ్యంతర నివేదిక సమర్పించాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేశారు.

6 గంటల్లోపు కేసు పెట్టండి

- ఆస్పత్రి సిబ్బందిపై దాడి చేస్తే తక్షణం స్పందించండి
- ఆరోగ్య శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: జూనియర్ వైద్యురాలి మృతితో దుండగులు కోల్‌కతాలో ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో బీభత్సం సృష్టించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధ్వంసం, సిబ్బందిపై దాడుల ఘటనల్లో యాజమాన్యం 6 గంటల్లోపు పోలీసులకు ఫిర్యాదు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలు జారీచేసింది. ఆలస్యమైతే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఆసుపత్రులను సేఫ్‌జోన్లుగా ప్రకటించండి

ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్.వి.అశోకన్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని, అప్పుడే డాక్టర్లు ఎలాంటి భయాలు లేకుండా పనిచేసుకోగలుగుతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) చీఫ్ డాక్టర్ ఆర్.వి.అశోకన్ డిమాండ్ చేశారు. విమానాశ్రయాల్లాగే ఆసుపత్రులను కూడా సేఫ్‌జోన్లు ప్రకటించాలన్నారు. కోల్‌కతా వైద్యురాలి రేప్, హత్య, ఆర్.జి.కార్ ఆసుపత్రిపై దుండగుల దాడికి నిరసనగా ఐఎంఏ శనివారం డాక్టర్ల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. 'విమానాశ్రయాల్లో మూడంచెల భద్రత ఉంటుంది. కనీసం ప్రధాన ఆసుపత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలి. అప్పుడు భద్రత తప్పనిసరి అవుతుంది' అని అశోకన్ కోరారు. ఐఎంఏ ప్రభుత్వం ముందుంచిన ఐదు ప్రధాన డిమాండ్లలో ఇది ఒకటన్నారు. వైద్య సిబ్బందిపై దాడలను అరికట్టడానికి కేంద్ర చట్టం ఉండాలన్నారు. 25 రాష్ట్రాల్లో డాక్టర్లు, ఆసుపత్రులపై దాడులను నిరోధించేందుకు చట్టాలు ఉన్నాయని, అయితే ఇప్పటిదాకా వీటి కింద శిక్షలు పడలేదన్నారు. రాష్ట్ర చట్టాలు వైద్య సిబ్బందిపై దాడులను నిరోధించలేకపోతున్నాయన్నారు.

జమ్మూకశ్మీర్‌లో భారీగా బదిలీలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడం కంటే ముందే పెద్ద ఎత్తున అధికారుల బదిలీలు జరిగాయి. 89 మందిని బదిలీ చేస్తూ, పోస్టింగ్‌లు ఇస్తూ జమ్మూకశ్మీర్ సాధారణ పరిపాలనా విభాగం గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో వివిధ శాఖల సెక్రెటరీలు, కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు డైరెక్టర్ జనరల్స్, మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు ఉన్నారు. పూంచ్, బందీపురా జిల్లాల డిప్యూటీ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులను వారి సొంత జిల్లాలు/ప్రాంతాల నుంచి బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 31న ఆదేశాలు జారీ చేసింది.

బదిలీల గుట్టు ఏమిటో తేల్చండి

కేంద్ర ఎన్నికల సంఘానికి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తి



శ్రీనగర్/న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల కోసం ప్రజలు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని, వారి నిరీక్షణ ఫలించి ఎట్టకేలకు షెడ్యూల్ వచ్చిందని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అసలు ఎన్నికల జరగకపోవడం కంటే ఆలస్యంగా జరగడం మేలేనని వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని, త్వరలో ప్రచారం ప్రారంభిస్తామని చెప్పారు. కేవలం మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించడం మంచి పరిణామమేనని అన్నారు. పార్టీలకు ఇదొక కొత్త ప్రయోగం అవుతుందని అభిప్రాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లో గత 24 గంటల వ్యవధిలో పెద్ద ఎత్తున అధికారులను బదిలీ చేశారని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఈ బదిలీల వ్యవహారంపై దృష్టి పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

రక్షణ కార్యదర్శిగా రాజేష్ సింగ్



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉన్నతస్థాయిలో పలువురు సీనియర్ బ్యూరోకాట్లను బదిలీ చేసి కొత్త స్థానాల్లో నియమించింది. రాజేష్ సింగ్ రక్షణశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం పరిశ్రమలు, వాణిజ్య అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న రాజేష్ తొలుత రక్షణ మంత్రిత్వ శాఖలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా చేరతారు. ప్రస్తుత రక్షణశాఖ కార్యదర్శి అరమానే గిరిధర్ అక్టోబరు 31న పదవీ విరమణ చేయనున్నారు. అప్పుడు గిరిధర్ స్థానంలో రాజేష్ బాధ్యతలు స్వీకరిస్తారు. పున్యా సలీలా శ్రీవాస్తవ ఆరోగ్యశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. పస్తుతం మైనారిటీ వ్యవహారాల కార్యదర్శిగా ఉన్న కటికిథల శ్రీనివాస్.. హౌసింగ్, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. సీనియర్ బ్యూరోకాట్ దీప్తి ఉమాశంకర్‌ను రాష్ట్రపతి కార్యదర్శిగా నియమించారు. నాగరాజు మద్దిరాల ఆర్థిక సేవల కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం నాగరాజు బొగ్గుశాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్నారు.

పుణె, థానే, బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో పుణే, థానే, కర్ణాటక రాజధాని బెంగళూరులో మెట్రో రైలు ప్రాజెక్టుల పొడగింపునకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ప్రధాని నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్–3లో రెండు కొత్త కారిడార్ల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 44.65 కిలోమీటర్ల పొడవైన ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లలో మొత్తం 31 స్టేషన్లు ఉంటాయని ప్రభుత్వం వెల్లడించింది. జేపీ నగర్– కెంపపురా, హోసహళ్లి– కడబగెరే కారిడార్ల నిర్మాణానికి రూ.15,611 కోట్ల ఖర్చు కానుంది. బెంగళూరు పశ్చిమ ప్రాంతాన్ని ఈ మెట్రో రైలు ప్రాజెక్టు మెరుగ్గా అనుసంధానిస్తుందని కేంద్రం పేర్కొంది. పుణె మెట్రో ఫేజ్–1లో స్వరగేట్– కాట్రాజ్ భూగర్భ రైల్వే లైన్ పొడిగింపునకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. పుణే శివార్లలో కనెక్టివిటీని పెంచే ఈ లైన్–1బి పొడిగింపు ప్రాజెక్టు వ్యయం రూ.2,954 కోట్లని, కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చును సమంగా భరిస్తాయని తెలిపింది. థానే పశ్చిమ ప్రాంతాన్ని కలుపుతూ వెళ్లే.. థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైల్ ప్రాజెక్టు కారిడార్‌కు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కారిడార్‌లో 22 స్టేషన్లు ఉంటాయి. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 12,200 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా భరిస్తాయని వెల్లడించింది.

రెండు విమానాశ్రయాల విస్తరణ


మౌలిక సదుపాయాల అభివృద్ధిని కొనసాగిస్తూ కేంద్ర కేబినెట్ శుక్రవారం రెండు విమానాశ్రయ విస్తరణ ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేసింది. పశ్చిమబెంగాల్‌లోని బగ్డోగ్రా విమానాశ్రయంలో రూ. 1,549 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టనున్నారు. బిహార్‌లోని బిహ్టా విమానాశ్రయాన్ని రూ. 1,413 కోట్లతో విస్తరించనున్నారు.

థాయిలాండ్ ప్రధాని పీఠంపై పేటోంగ్‌టార్న్!

పార్లమెంటరీ ఓటింగ్‌లో మెజారిటీ సాధించిన యువ నాయకురాలు

బ్యాంకాక్: థాయిలాండ్ రాజకీయాల్లో షినవత్రల మరో కుటుంబ వారసురాలు ప్రధాని పీఠాన్ని అధిష్టించడానికి రంగం సిద్ధమైంది. నూతన ప్రధాని ఎన్నిక కోసం పార్లమెంటరీ ఓటింగ్‌లో అధికార ఫ్యూ థాయ్ పార్టీ తరఫున అభ్యర్థిగా నిలబడిన నాయకురాలు పేటోంగ్‌టార్న్ షినవత్ర ఓటింగ్‌లో సాధారణ మెజారిటీకి కావాల్సిన 247 ఓట్లను దాటేశారు. దీంతో పేటోంగ్‌టార్న్ నూతన ప్రధానిగా పగ్గాలు చేపట్టడం ఖాయమైంది. దీంతో షినవత్ర కుటుంబం నుంచి ప్రధానమంత్రి అవుతున్న మూడో వ్యక్తిగా పేటోంగ్‌టార్న్ పేరు చరిత్రలో నిలిచిపోనుంది. గతంలో పేటోంగ్‌టార్న్ తండ్రి తక్షిన్ షినవత్ర, మేనత్త ఇంగ్లక్ షినవత్ర ప్రధానమంత్రులుగా చేశారు. 37 ఏళ్లకే ప్రధాని పదవి చేపడుతున్న నేపథ్యంలో థాయిలాండ్‌లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అతి పిన్న వయస్కురాలిగా, రెండో మహిళగా రికార్డ్‌నెలకొల్పనున్నారు. నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రధాని స్రెట్టా థావిసిన్‌ను ఆ పదవి నుంచి బుధవారం థాయిలాండ్‌లోని రాజ్యాంగ ధర్మాసనం తప్పించిన విషయం విదితమే.

హిందువులకు రక్షణ కల్పిస్తాం: యూనుస్



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనారిటీలకు భద్రత కల్పిస్తామని, దాడుల నుంచి రక్షణ కల్పిస్తామని తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనుస్ భారత ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. యూనుస్ శుక్రవారం మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాతి పరిణామాల్లో మోదీ, యూనుస్‌లు మాట్లాడుకోవడం ఇదే తొలిసారి. 'ప్రజాస్వామ్యయుత, సుస్థిర, శాంతికాముక, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పునరుద్ఘాటించాను' అని మోదీ ఎక్స్‌లో వెల్లడించారు. 'ప్రొఫెసర్ యూనుస్ కాల్ చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై మాట్లాడుకున్నాం. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలకు రక్షణ కల్పిస్తామని, సురక్షితంగా చూసుకుంటామని హామీ ఇచ్చారు' అని మోదీ తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల్లో బంగ్లాదేశ్ ప్రజలకు సహాయపడటానికి కట్టుబడి ఉన్నామని యూనుస్‌కు తెలిపారు. అదే సమయంలో బంగ్లాదేశ్‌లోని హిందువులకు భద్రత కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితి అదుపులోకి వచ్చిందని, సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని మోదీకి స్పష్టంచేసినట్లు యూనుస్ 'ఎక్స్'లో తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 17 : ఆగస్టు : 2024

కూలిన చెట్టు

శుక్రవారం సాయంత్రం వర్షాలకు బెంగళూరు గోవింద రాజనగరలో కూలిన ఓ చెట్టు. ఆటోపై పడడంతో ఆటో ధ్వంసమైంది. ఎవరికీ గాయాలు కాలేదు



న్యూస్‌రీల్

ప్రైవేటు బస్సు పల్టీ



ప్రమాదానికి గురైన బస్సు

దొడ్డబళ్లాపురం: డ్రైవర్ అదుపుతప్పిన బస్సు ఒకటి బోల్తా పడిన సంఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ సమీపంలోని పరంగిపేట వద్ద జరిగింది. బెంగళూరు నుంచి మంగళూరుకు వెళ్తున్న ప్రైవేటు బస్సు పరంగిపేట వద్ద 10వ మైలు వద్ద అదుపుతప్పి బోల్తాకొట్టింది. బస్సులో ఉన్న 10మంది ప్రయాణికులు గాయపడగా వారిని మంగళూరు ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన టెక్కీ దొరికాడు

- ఇంట్లో మనశ్శాంతి కరువై వెళ్లిపోయాడట



దొడ్డబళ్లాపురం: బెంగళూరులో గత 12 రోజులుగా కనబడకుండా పోయిన టెక్కీ విపిన్ గుప్తా ఢిల్లీ వద్ద నోయిడాలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కొడిగేహళ్లి పోలీసులు నోయిడాకు వెళ్లి అతనిని తీసుకువచ్చారు. మాన్యతా టెక్‌పార్క్ కంపెనీలో ఐటీ ఇంజినీర్‌గా పనిచేస్తున్న విపిన్ గుప్తా, భార్య పిల్లలతో కలిసి స్థానికంగా నివసిస్తున్నాడు. 4వ తేదీన కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో చెప్పకుండా తన కవాసకి బైక్‌లో వెళ్లిపోయాడు. గంట తరువాత బ్యాంకు ఖాతా నుంచి రూ.1.80 లక్షలు డ్రా అయ్యాయి. ఫోన్ కూడా స్విచాఫ్ చేసుకున్నాడు. రెండు రోజుల తరువాత భార్య కొడిగేహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్తను వెతికిపెట్టాలని సోషల్ మీడియా ద్వారా పోలీసు శాఖకు వేడుకుంది. డబ్బుల కోసం తన భర్తను ఎవరో కిడ్నాప్ చేసారని వాపోయింది. విషయం రచ్చ కావడంతో పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి గుప్త కోసం వేట ప్రారంభించగా నోయిడాలో ఉన్నట్టు గుర్తించి తీసుకువచ్చారు. కుటుంబ కలహాల కారణంగా మనశ్శాంతి కోసం ఇల్లు వదిలి వెళ్లిపోయినట్లు అతడు చెబుతున్నాడు. భార్యాభర్తల కలహం పోలీసులను పరుగులు పెట్టించింది.

మలెనాడులో మళ్లీ వర్షాలు

- జలాశయాలకు నీరు



శివమొగ్గ: మలెనాడులో గత కొన్ని రోజులుగా తగ్గిన వర్షాలు మళ్లీ ఊపందుకున్నాయి. జిల్లాలోని పశ్చిమ కనుమలతో పాటు పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయానికి రాష్ట్రంలోని ప్రముఖ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం లింగనమక్కి డ్యాంకు 7643 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 7504 క్యూసెక్కుల నీరు బయటకు వదులుతున్నారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 1819 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1816.85 అడుగులుగా ఉంది. తుంగా జలాశయానికి ఇన్‌ఫ్లో 10,969 క్యూసెక్కులు ఉండగా ఇప్పటికూ డ్యాం గరిష్టస్థాయి నీటిమట్టానికి చేరినందున వచ్చిన నీటిని అలాగే వదులుతున్నారు. ఇక భద్రా జలాశయానికి కూడా ఇన్‌ఫ్లో 8419 క్యూసెక్కులు ఉండగా, 7841 క్యూసెక్కులను ఔట్‌ఫ్లో రూపంలో బయటకు వదులుతున్నారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 186 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 180 అడుగులుగా ఉందని అధికారులు తెలిపారు. శివమొగ్గ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు చోట్లవర్షాలు పడ్డాయి. మరికొన్ని రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

విరిగిన కొండచరియలు



రైలు పట్టాలపై పడ్డ మట్టిదిబ్బలు

దొడ్డబళ్లాపురం: హాసన్ జిల్లాలో సకలేశపుర వద్ద మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. సకలేశపుర తాలూకా ఆచంగి–దొడ్డసాగర వద్ద రైలు పట్టాలపై భారీ మొత్తంలో మట్టి రాళ్లు పడిపోయాయి. దీంతో బెంగళూరు– మంగళూరు మధ్య సంచరించే రైళ్లను రద్దు చేశారు. వారం రోజుల క్రితం కూడా ఇక్కడే రైలుపట్టాలపై కొండచరియలు పడడంతో రైళ్లు బంద్ అయ్యాయి. రైల్వే సిబ్బంది, పోలీసులు చేరుకుని శిథిలాలను తొలగించే పనిలో పడ్డారు

చిత్రం.. జయకేతనం

- కేజీఎఫ్–2, కాంతార మెరుపులు
- జాతీయ చలనచిత్ర అవార్డుల పంట
- ఉత్తమ నటునిగా రిషబ్‌శెట్టి సంచలనం
- సినీ ప్రియుల్లో హర్షం






కాంతార సినిమాతో కన్నడ చిత్రరంగం మరో మెట్టు పైకి



కేజీఎఫ్ హీరో యశ్



జాతీయ సినీ అవార్డుల మెమెంటో

బొమ్మనహళ్లి: వర మహాలక్ష్మి పండగ రోజున రాష్ట్రంలో సినీ అభిమానులకు శుభవార్త వినిపించింది. సినీ ప్రియులు, కళాకారుల్లో ఆనందం మిన్నంటింది. కేంద్ర సమాచార ప్రసార శాఖ జాతీయ చలన చిత్ర అవార్డులను ప్రకటించగా అందులో సంచలన హిట్ సినిమా కేజీఎఫ్–2 రెండు అవార్డులను సొంతం చేసుకుంది. యశ్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ సినిమా ప్రేక్షకులను ఉర్రూతలూపి భారీ కలెక్షన్లు రాబట్టడం తెలిసిందే. ఉత్తమ ప్రాదేశిక సినిమాతో పాటు ఉత్తమ స్టంట్ కొరియోగ్రఫీ విభాగంలో అవార్డులను సొంతం చేసుకుంది. 2022 ఏప్రిల్ 14న ఈ సినిమా విడుదలై బాక్సాఫీసు రికార్డులను సృష్టించింది. ఈ సినిమాలో యశ్, సంజయ్‌దత్, రవీనా టాండన్, శ్రీనిధి శెట్టి, ప్రకాశ్‌రాజ్, అచ్యుత్‌కుమార్ తదితర ప్రముఖ నటులు నటించారు.

పునీత్‌కు, తారగణానిక అంకితం: రిషబ్‌శెట్టి

భూత కోల కథ ఆధారంగా మరో బృహత్ విజయం అందుకున్న కాంతారకు అవార్డు వచ్చింది. ఆ చిత్ర హీరో రిషబ్ శెట్టికి ఉత్తమ నటుడు అవార్డును ప్రకటించారు. ఈ విషయం తెలియగానే రిషబ్ శెట్టి అమిత సంతోషం వ్యక్తం చేశారు. కాంతార సినిమాతో వచ్చిన ఈ జాతీయ అవార్డును అప్పు పునీత్ రాజ్‌కుమార్‌తో పాటు కాంతారలో దైవ నృత్యం చేసిన నృత్యకారులకు అంకితమని తెలిపారు. నటీనటులు, సాంకేతిక సిబ్బంది, సినిమాని నిర్మించిన హొంబాళె సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. మార్పు అనేది ప్రపంచంలో ఉన్న ఒక చట్టమని, మనం మన ప్రయత్నాలను ఎప్పుడూ కూడా ఆపకూడదని ఆయన అన్నారు. ప్రతి శుక్రవారం విడుదల అయ్యే సినిమాలు అనేక మార్పులు తీసుకొని వస్తాయి. కొన్ని ఫలితాలు ఇవ్వకపోవచ్చు, మరికొన్ని ఎంతో ప్రభావం చూపిస్తాయి అని చెప్పారు. పని చేస్తూ ముందుకు సాగిపోతుండాలి, అది మన విజయానికి దారి తీస్తుందని అన్నారు. టీవీలో అవార్డుల గురించి విని చాలా సంతోషించానని, ఇప్పుడు కన్నడ సినిమా చాలా ఎదుగుతోందని చెప్పారు. కాగా, కన్నడ సినిమాలకు గుర్తింపు దక్కడంపై ఆ రంగ ప్రముఖులు, ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వందలాదిగా శుభాకాంక్షల పోస్టులు పెట్టారు.

బైక్ వీలింగ్‌పై ఉక్కుపాదం

- 44 మంది పోకిరీల నిర్బంధం



వీలింగ్ చేస్తున్న యువకులు

దొడ్డబళ్లాపురం: బెంగళూరులో స్కూటర్లు, బైక్‌లతో వీలింగ్ చేస్తూ అమాయకులను ప్రమాదాలకు గురిచేస్తున్న పోకిరీలు పెద్ద సమస్యగా మారారు. నెలమంగల, దొడ్డబళ్లాపురం, ఎయిర్‌పోర్టు రోడ్డు, నందికొండ రోడ్లలో వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. బెంగళూరు నుంచి గుంపులుగా వచ్చే యువకులు బైక్‌లపై వీలింగ్ చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. దీంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో శనివారంనాడు ఉదయాన్నే పోలీసులు కార్యాచరణ చేపట్టారు. ఎయిర్‌పోర్టు రోడ్డులో వీలింగ్ చేస్తున్న 44మంది యువకులను అదుపులోకి తీసుకుని 33 కేసులు నమోదు చేశారు. దేవనహళ్లిలో 9, యలహంకలో 6, హెబ్బాళ పోలీసులు 18 కేసులు నమోదు చేశారు. బైక్‌లను స్వాధీనం చేసుకుని ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని పోలీసులు తెలిపారు.

బంధించి దోచేశారు!

- ఎస్ఐ భార్య కట్టుకథ



బనశంకరి: ఇంట్లో దోపిడీ జరిగిందని అబద్ధపు ఫిర్యాదు చేసిన ఎస్ఐ భార్య, ఆమె సోదరిపై కోరమంగల పోలీసులు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇంట్లో రూ.12 లక్షల నగదు, బంగారు నగలు లూటీ అయినట్లు అశోక్‌నగర ఎస్ఐ పుట్టస్వామి భార్య కోరమంగళ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కోరమంగల ఠాణాకు కూతవేటు దూరంలో ఉన్న ఇంట్లోకి జూలై 11న దొంగలు చొరబడి తన చేతులు కాళ్లు కట్టి వేసి నోటిలో బట్టలు కుక్కి విలువైన సొత్తు దోచుకున్నారని ఆమె ఫిర్యాదు చేసింది. అనేక కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు ఇదంతా కట్టుకథ అని తేల్చారని పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. నిజానికి ఆమె నగలు, డబ్బును పుట్టింటివారు ఇబ్బందుల్లో ఉంటే ఇచ్చారు. భర్తను నమ్మించడానికి దోపిడీ కథ అల్లారని చెప్పారు. దీంతో ఆమెతో పాటు భర్తపైనా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

మము బ్రోవుమా.. వర మహాలక్ష్మీ



తుమకూరులో ఓ ఇంట్లో వరమహాలక్ష్మి అమ్మవారికి పూజలు



బెంగళూరు మహాలక్ష్మీపురలో ప్రసన్న వీరాంజనేయ ఆలయంలో లక్ష్మీదేవికి అభిషేకం

తుమకూరు: జీవితంలో సుఖ సంతోషాలతో పాటు సంపదలను ప్రసాదించాలని ప్రజలు శుక్రవారం వర మహాలక్ష్మి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ముఖ్యంగా ముత్తైదు మహిళలు, యువతులు, పిల్లలు మహాలక్ష్మిదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. ఉదయం నుంచే బీహెచ్ రోడ్డు, టీజీఎంసీ బ్యాంక్ ఆవరణలోని ఆలయంతో పాటు వివిధ కాలనీల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు. పూలు, పండ్ల ధరలు ఆకాశాన్ని అంటినా స్తోమత కొద్దీ వ్రత ఆచరణ గావించారు.



తుమకూరులో అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

3 అసెంబ్లీ సీట్లకు త్వరలో షెడ్యూల్!

బొమ్మనహళ్లి: రాష్ట్రంలో త్వరలో మూడు శాసనసభ స్థానాలకు ఎన్నికలకు జరగనున్నాయి. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ మేరకు తెలిపింది. గత లోక్‌సభ ఎన్నికల్లో ముగ్గురు ఎమ్మెల్యేలు పోటీ చేసి ఎంపీలుగా ఎన్నికయ్యారు. దీంతో హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్, రామనగర), బసవరాజు బొమ్మై (బీజేపీ, శిగ్గావ్), ఈ.తుకారాం (కాంగ్రెస్, సండూరు) రాజీనామ చేశారు. వీరందరూ తలా ఒక పార్టీకి చెందినవారు. త్వరలో బైపోలింగ్ తేదీలను ప్రకటించి ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికలతో అధికార కాంగ్రెస్‌కు పరీక్ష ఎదురుకాబోతోంది. మూడింట కనీసం రెండయినా గెలుచుకోవాలి, లేదంటే ప్రతిపక్షాల విమర్శలను ఎదుర్కోవడం కష్టమవుతుంది. మరోవైపు విపక్షాలు కూడా సిద్ధమయ్యాయి.

భారీ సైబర్ ముఠాకు సంకెళ్లు

- కొడగువాసికి రూ.2.21 కోట్లు టోపీ
- వంచకుల నుంచి 1.70 కోట్లు, బెంజ్ కారు సీజ్



పోలీసులకు పట్టుబడిన సైబర్ వంచక ముఠా

బనశంకరి: కొడగు జిల్లాలో విశ్రాంత ఇంజనీర్‌ను బెదిరించి డిజిటల్ అరెస్ట్‌చేసి రూ.2.21 కోట్లు కాజేసిన వంచక ముఠా చిక్కింది. శుక్రవారం సీఐడీ, సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రూ.1.70 కోట్ల నగదు, 7700 అమెరికన్ డాలర్లు, బెంజ్ కారును స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరుకు చెందిన మహమ్మద్ షబీబ్, మహమ్మద్ అయాన్, అహసాన్ అన్సారీ, సాల్మన్‌రాజ, దుబాయ్ వాసి యూసఫ్ సేట్ పట్టుబడిన వంచకులు.

కొరియర్‌లో డ్రగ్స్ పేరుతో

వివరాలు.. కొడగుకు చెందిన రిటైర్డు ఇంజినీరుకు నిందితులు కాల్ చేసి మీ పేరుతో ఫెడెక్స్ కొరియర్ వచ్చింది, అందులో డ్రగ్స్ ఉండడంతో సీజ్‌చేశాం అని చెప్పారు. ఆ తరువాత మరో వ్యక్తి కాల్ చేసి తాను పోలీసు అధికారినని, మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నామని, ఇంటిలో నుంచి బయటకు వెళ్లరాదని హెచ్చరించారు. బాధితున్ని తీవ్రంగా బెదిరించి పలు ఖాతాల్లోకి రూ.2.21 కోట్ల నగదును ఆర్‌టీజీఎస్ ద్వారా బదిలీ చేసుకున్నారు. ఆపై మళ్లీ డబ్బు పంపాలని ఒత్తిడి చేయసాగారు. వారి హింస తట్టుకోలేక బాధితుడు కొడగు సైబర్ క్రైం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసును సవాల్‌గా తీసుకుని లోతుగా విచారించిన సీఐడీ, సైబర్ క్రైం పోలీసులు వంచకుల ముఠా ఆచూకీ కనిపెట్టి పట్టుకున్నారు. 26 బ్యాంకు అకౌంట్లుకు నగదు బదిలీ చేయించుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు జరుగుతోంది.

ప్రాణదాతలపైనే అఘాయిత్యాలా?

- వైద్య విద్యార్థుల ఆందోళన



వైద్య విద్యార్థుల ఆందోళన

శివాజీనగర: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై దారుణ అత్యాచారం, హత్యను ఖండిస్తూ శుక్రవారం నగరంలోని ఫ్రీడం పార్కులో వైద్య విద్యార్థులు ధర్నా చేశారు. ఇది సమాజమంతా తలదించుకునే ఘోరమని మండిపడ్డారు. వైద్యులు దాడులకు గురవుతున్నారు. దీనివల్ల వైద్య విద్యలోకి వచ్చే మహిళల సంఖ్య తగ్గిపోయింది. ఇది సమాజంపై దుష్పరిమాణం చూపుతోంది. అందుచేత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలో అన్ని వర్గాల మహిళల భద్రతకు కొరత ఉందన్నారు. ప్రాణాన్ని కాపాడే వైద్యుల స్థితి ఇలాగుంటే సామాన్య ప్రజల గతేమిటని వారు ప్రశ్నించారు.

సమ్మె చేస్తే ప్రత్యామ్నాయ చర్యలు

ఆస్పత్రుల్లో వైద్యులు సమ్మె చేస్తే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలను తీసుకున్నట్లు ఆరోగ్య మంత్రి దినేశ్ గుండురావు తెలిపారు. ఓపీ రోగులకు చికిత్స అందేలా చూస్తామన్నారు. సమ్మెకు తాము అభ్యంతరం చెప్పబోమని, రోగులకు కూడా సేవలు అందాలని అన్నారు.

వంతెన కూలి.. బతుకు ఖాళీ

- కాళీ నదిలో మత్స్యకారులకు ఆటంకాలు



వంతెన శిథిలాలు




కాళీ నదిలో చేపల వేట

బొమ్మనహళ్లి: కార్వార నగరాన్ని ఆనుకుని కాళీ నదిపైనున్న జంట వంతెనల్లో పాత వారధి ఇటీవల కూలిపోవడంతో గోవాకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలను మరో వంతెనపై పరిమితంగా అనుమతిస్తున్నారు. దీంతో చాలా మంది వాహనదారులు 50 కిలోమీటర్లు చుట్టూ తిరిగి గోవాకు వెళ్తున్నారు. సుమారు యాభై ఏళ్ల కింద కట్టిన వంతెన ఈ నెల 7వ తేదీన రాత్రి కుప్పకూలడం తెలిసిందే. అది శిథిలావస్థకు చేరడంతో పాటు తీవ్రమైన వర్షాలకు కుప్పకూలింది. కర్ణాటక – గోవా మధ్య రవాణాకు ఈ వంతెన చాలా ప్రధానంగా ఉండేది.

జాలర్లపై తీవ్ర ఆంక్షలు

మరోవైపు స్థానిక జాలర్లకు కూడా చిక్కొచ్చి పడింది. నదిలో పడవలేసుకుని అటు ఇటూ తిరుగుతూ చేపల వేటను సాగించే జాలర్లు ఇప్పుడు ఒకవైపు వేట సాగించాలి. అవతలికి వెళ్లాలంటే కూలిన వంతెన అడ్డుగా ఉందని తెలిపారు. అలాగే వంతెన పై నుంచి నదిలోకి వల వేసి చేపలు పట్టడానికి కూడా సమస్యగా మారిందని చెప్పారు. ఆశ్వెవాడ, గబితవాడ, తరివాడ, నడివాడ, కోడిబ్గా తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది మత్స్యకారులు ఉపాధి పోయిందని బాధపడుతున్నారు. కూలిన వంతెనలో 200 మీటర్ల భాగం ఇంకా మిగిలి ఉంది, అది ఎప్పుడైనా పడిపోవచ్చని చెబుతున్నారు. ఈ కారణంతో వంతెన సమీపంలో చేపలు పట్టడాన్ని నిషేధించారు. వేటకు అనువుగా ఉన్న చోట నిషేధం విధిస్తారా? అని జాలరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలెవాడ ప్రాంతంలోని మత్స్యకారులు కాళీ నది, అరేబియా సంగమ ప్రాంతం వద్ద చేపలు పట్టలేరు. నిషేధం వల్ల దూరంగా నందనగడ్‌కు వెళ్లాలి. కానీ కూలిన వంతెన అడ్డుగా ఉండడంతో వెళ్లలేకపోతున్నట్లు తెలిపారు.



కొలిక్కి వచ్చిన గేటు మరమ్మతు పనులు



సంద్రం పాలయ్యే నీటికి ఇక బ్రేక్ పడుతుంది

గేటు కూర్చుంది.. చాలు

- టీబీ డ్యాంపై నిపుణుల తీవ్ర ప్రయత్నాలు

హొసపేటె: తుంగభద్ర జలాశయంలో ఊడిపోయిన గేటు స్థానంలో కొత్త గేటును అమర్చే పనులు రెండు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. డ్యాం ఇంజినీర్లు, నిపుణులు, కార్మికులు పగలూ రాత్రి శ్రమిన్నారు గేటు అమర్చడం అంత సులభంగా కుదరలేదు. చివరికి శుక్రవారం రాత్రి అందరి కృషి ఫలించి స్టాప్ లాగ్ గేటును యథాస్థానంలో ఉంచడంతో సంతోషం వెల్లివిరిసింది. స్థానిక జిందాల్‌తో సహా మరికొన్ని సంస్థలు గేట్లను తయారు చేసిచ్చాయి. మొత్తం 5 పీసెస్ గేట్లను సిద్ధం చేశారు. 55 టన్నులు, 25 టన్నుల సామర్థ్యం గల క్రేన్‌లను డ్యాంపైకి రప్పించారు. డ్యామ్‌లో తాత్కాలిక గేట్‌ను కూర్చోబెట్టే పని రాత్రి పొద్దుపోయాక కొలిక్కి వచ్చింది. స్టాప్ లాగ్‌ని కూర్చోపెట్టడానికి క్రేన్ సహాయంతో కిందకు దించారు. కానీ ఈ గేట్‌కు కొద్దిగా గోడ అడ్డురావడంతో సైడ్ గోడను కట్‌చేసి సజావుగా బిగించారు. ఇక మిగతా పీసుల జోడింపును సత్వరమే చేపట్టనున్నారు.

క్లుప్తంగా

మలబార్ మెగా ఆఫర్లు



బొమ్మనహళ్లి: ప్రపంచంలో అతి పెద్ద జ్యూవెలరి గ్రూప్‌లలో ఒకటిగా పేరు పొందిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జెమ్‌స్టోన్ ఆభరణ వేడుకలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కొనుగోలుదారులకు ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. గ్రాహకులకు బంగారంతో సిద్ధం చేసిన,అమూల్య మైన రత్నాలు, రాళ్ళు పొదిగిన అన్‌కట్ వజ్రాలు, పోల్కిగలి ఆభరణాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ పండుగల సీజన్‌లో అన్‌కట్ ఆభరణాలపైన మేకింగ్ పన్నును సుమారు 25 శాతం తగ్గింపు, పోల్కి ఆభరణాల స్టోన్‌ల విలువ పైన సుమారు 25 శాతం ఫ్లాట్ తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఆఫర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

పలు జిల్లాల్లో భారీ వర్ష సూచన

శివాజీనగర: గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన వర్షాలు తిరిగి పుంజుకోనున్నాయి. దీంతో ఈ వారాంతంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మలెనాడు, కరావళి, ఉత్తర ఒళనాడు భాగంలో పలు జిల్లాల్లో 16, 17న ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. శనివారం కూడా భారీ వర్షం కురిసే అవకాశముండటంతో హాసన, కొడుగు, మైసూరు, చిక్కబళ్లాపుర జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. బెంగళూరులో రానున్న రెండు రోజులు పగటి సమయంలో మేఘాలు కమ్ముకునే వాతావరణం ఉంటుందని, సాయంత్రం గాని రాత్రి సమయంలో భారీ వర్షం కురిసే అవకాశముంది.

దునియా విజయ్ స్టింగ్ ఆపరేషన్

శివాజీనగర: ఓ ఫార్మసీ దుకాణంలో నటుడు దునియా విజయ్ స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన ఘటన ఇప్పుడు వైరల్‌గా మారింది. బెంగళూరులోని వివిధ చోట్ల మెడికల్ దుకాణాల్లో నొప్పి నివారణ మాత్రలు, మాదక వస్తువుకు సంబంధించిన మాత్రలు విక్రయం చేస్తున్న ముఠాని వెలుగులోకి తీసుకొచ్చాడు. విజయ్ తన మిత్రులతో కలసి ఓ మెడికల్ దుకాణంలో తనతో ఉన్న డ్రైవర్‌ను పంపించి డ్రగ్స్‌కు సంబంధించిన (టైడల్) మాత్రను తీసుకురావాలని సూచించారు. అదే ప్రకారంగా మెడికల్ షాపులో ఉన్న ఓ మహిళ అతనికి ఓ మాత్రను ఇస్తారు. దీనిని మత్తుకు అలవాటుపడినవారు తీసుకొంటారని వీడియోలో దునియా విజయ్ వివరిస్తారు. రెండో మెడికల్ షాపుల్లో డైడల్ మాత్రను వైద్యుల సూచన లేకుండా ఇచ్చారు. ఈ వీడియో వైరల్‌గా మారింది.

పన్ను సేకరణలో లక్ష్యాన్ని సాధించాలి

శివాజీనగర: రాష్ట్రంలో పన్ను సేకరణలో నిరేర్ధేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలు, కేంద్రం నుండి రాష్ట్రానికి న్యాయసమ్మతంగా రావాల్సిన నిధులు, అదనపు నిధుల సాధనకు ఎలాంటి చర్యలను చేపట్టాలనే విషయాలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి నివాసం కృష్ణాలో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడారు. పన్ను సేకరణ లక్ష్యాన్ని అధిగమించాలని, వనరుల సేకరణపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. దీంతో పాటుగా కేంద్రంలో 16వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన వాటా పొందేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రి కృష్ణభైరేగౌడ, సీఎం ఆర్థిక సలహాదారు బసవరాజ రాయరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్.కే.అతీక్, కార్యదర్శి విశాల్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌మూర్తితో పాటుగా ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలి



పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం

గౌరిబిదనూరు: గ్రామీణ పాఠశాలలకు పూర్వ విద్యార్థుల నుంచి ప్రోత్సాహకాలు అవసరమని గ్రామ పెద్ద ధరణేంద్రయ్య తెలిపారు. తాలూకాలోని హంపసంద్ర గ్రామంలో ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రసంగించారు. గత 12 ఏళ్లుగా విలేజ్ బాయ్స్ ఆర్గనైజేషన్ వారిచే పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 7వ తరగతిలో ఉత్తమ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశ్,చిక్కేగౌడ,ఉషారవి,బ్రహ్మ ప్రకా పాల్గొన్నారు.

ఇంటింటా లక్ష్మీ శోభ

- రాష్ట్ర వ్యాప్తంగా వరమహాలక్ష్మీ పూజలు
- వరలక్ష్మీ కటాక్షానికి మహిళల వ్రతాలు
- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

లక్ష్మీదేవిని భక్తి శ్రద్ధలతో పూజించే పర్వదినం వరలక్ష్మీ వ్రతం. కోరిన వరాలిచ్చే లక్ష్మీదేవిని ఇంటిలో కొలువుదీర్చిన మహిళలు విశేషంగా అలంకరించారు. ముత్తైదువులను పిలిచి పసుపు కుంకుమ ఇచ్చారు.



చిక్కకురుగోడులో వరమహాలక్ష్మీ పల్లకీ ఉత్సవం



గొరవనహళ్లిలో బారులు తీరిన భక్తులు



గొరవనహళ్లిలో అమ్మవారికి విశేష అలంకరణ



బనశంకరీదేవికి కరెన్సీ నోట్ల అలంకరణ



మహలక్ష్మీలేఔట్‌లో అమ్మవారికి వంద నోట్లతో అలంకరణ



మండ్యలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



మాలూరు పట్టణంలో ఓ ఇంట్లో అమ్మవారు



బెంగళూరులో శాకంబరీ అమ్మవారి ముందు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేస్తున్న భక్తులు

బనశంకరి: బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు వరమహాలక్ష్మీ పండుగను అత్యంతభక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం వరమహాలక్ష్మీ పండుగను నిర్వహించడం అనవాయితీ. అష్టైశ్వరాలను ఇవ్వాలని భక్తులు లక్ష్మీదేవిని ఇళ్లల్లో కొలువుదీర్చి, ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ముత్తైవులను ఇళ్లకు పిలిచి పసుపు కుంకుమ అందజేశారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మీ ఆలయాలు భక్తులు కిటకిటలాడాయి. బెంగళూరు నగరంలోని మహాలక్ష్మీ లేఔట్ మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.

బనశంకరి: వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా బనశంకరీదేవి కరెన్సీనోట్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. శ్రావణమాసం రెండో శుక్రవారం వరమహాలక్ష్మీ పండుగ నేపథ్యంలో వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమోహన్, అర్చకులు బృందం బనశంకరీదేవి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకం చేపట్టి కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గౌరిబిదనూరు: నగరానికి సమీపంలోని చిక్కకురుగోడు జీపీ పరిధిలో వెలసి వున్న రాజలక్ష్మీ దేవాలయంలో 11వ వార్షిక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకులు భూమరాజు నరేంద్ర శర్మ నేతృత్వంలో శ్రావణ శుక్రవారం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి పల్లకీని మోశారు. ప్రాకారోత్సవం, బీజాక్షరీ మంత్ర హోమం, వరమహాలక్ష్మీ వ్రతం జరిగింది. పురాతన కాలం నాటి ఈ ఆలయం పాతికేళ్ల క్రితం కొత్త హంగులు పులుముకుందని పూజారి నరేంద్ర తెలిపారు.

గొరవనహళ్లికి పోటెత్తిన భక్తజనం

తుమకూరు: జిల్లాలోని కొరటగెరె తాలూకా గొరవనహళ్లిలో వెలసిన మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతపూజ పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గంటల తరబడి వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు.

మండ్య: వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా మహాలక్ష్మీతో పాటు ఇతర అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. పేటె వీధిలోని వరమహాలక్ష్మీ, శ్రీచక్రలక్ష్మీ ఆలయాల్లో ఉదయం పంచామృత అభిషేకం, వెండి అలంకారం, తోమాల సేవ, మధ్యాహ్నం మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగాలు జరిగాయి. వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా పూజలు

చిక్కబళ్లాపురం: మహిళలు వర మహాలక్ష్మీ పండుగను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఉదయం నుంచి వరలక్ష్మీ దేవి విగ్రహానికి అలంకరణలు చేశారు, ధూపదీపాలతో పూజలు చేసి మొక్కుకొన్నారు. ఒక్కొక్క ఇంటిలో ఒక్కొక్కరీతిగా తల్లికి అలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

కోలారు: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం పూలు, పండ్ల ధరలు మరింత అధికంగా ఉన్నా వ్రత ఆచరణలో మాత్రం మహిళల ఆసక్తి తగ్గ లేదు. మహిళలు తమ ఇళ్లలో లక్ష్మీ విగ్రహాన్ని కొలువుదీర్చి విశేషంగా అలంకరించి పూజలు చేశారు.

పురోహితులకు డిమాండ్ :

పండుగ నాడు వ్రతాన్ని నిర్వహించే పురోహితులకు డిమాండ్ అధికంగా నెలకొంది. కొంత మంది పురోహితులు తెల్లవారు జామునే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మరికొందరికి పూజారులు అందుబాటులో లేకపోవడంతో యూట్యూబ్ వీడియోలను అనుసరించి పూజలు చేశారు.

మాలూరులో వరలక్ష్మీ పూజలు

మాలూరు: మాలూరు పట్టణంతో పాటు తాలూకా వ్యాప్తంగా శుక్రవారం వర మహాలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. పలు వార్డులలోని ఇళ్లలో వరలక్ష్మీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి అలంకరణ చేసి పూజలు చేశారు. ఇరుగు, పొరుగు వారిని ఇళ్లకు ఆహ్వానించి పసుపు కుంకుమ అందించారు.



బెంగళూరు నగరంలో వరలక్ష్మీకి పూజలు



ఓ ఇంటిలో అమ్మవారి విగ్రహం



కోలారులో అమ్మవారికి పూజలు



కోలారులో...



రాజాజీనగరలో వరమహాలక్ష్మీకి మహిళల హారతి

జానపద బృందాలతో తిరంగా యాత్ర



తిరంగా యాత్రను ప్రారంభించిన స్వామీజీలు

తుమకూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరంగా యాత్ర సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నగరంలో ప్రముఖ జానపద కళాబృందాలతో ఆకర్షణీయంగా చేపట్టారు. బీజీఎస్ సర్కిల్‌లో సిద్దగంగా మఠం సిద్దలింగ స్వామీజీ, హిరేమఠం డాక్టర్ శివానంద శివాచార్యస్వామీజీ భారతమాత చిత్రపటానికి పూజలు చేసి తిరంగా యాత్రను ప్రారంభించారు. యాత్ర ఎంజీ రోడ్డు, రామప్ప సర్కిల్ గుండా సాగి స్వతంత్ర చౌక్‌కు చేరడంతో ముగిసింది. ఎమ్మెల్యే జీబీ జ్యోతిగణేష్, తిరంగా యాత్ర సమితి సంచాలకుడు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు హెచ్ఎస్ రవిశంకర్ హెబ్బాక, మాజీ సైనికుడు, జిల్లా బీజేపీ కోశాధికారి డాక్టర్ పరమేష్, ప్రముఖులు శివప్రసాద్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు



ఉపాధ్యాయ దంపతులను సన్మానించిన దృశ్యం

మండ్య: తాలూకాలోని కట్టెదొడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు టీ.రవిశంకర్‌కు గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రముఖ చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ శంకరేగౌడ మాట్లాడుతూ.. ఒకే పాఠశాలలో ఇన్నేళ్లపాటు సేవలందించడం చాలా అరుదు అన్నారు. ఉపాధ్యాయుడు రవి శంకర్ ఉత్తమ బోధన తీరుతో విద్యార్థులు, గ్రామస్తుల మనస్సు గెలుచుకున్నారన్నారు. సన్మాన గ్రహీత రవిశంకర్ మాట్లాడుతూ... గత 28 ఏళ్లుగా ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించడం తనకెంతో తృప్తి కలిగించిందన్నారు. ఇదే పాఠశాలలో తన వృత్తి జీవితం ప్రారంభమై, ఇక్కడే ముగియడం తన అదృష్టమన్నారు. అంతకు ముందు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఎడ్లబండిపై జానపద కళాబృందాలతో రవిశంకర్ దంపతులను ఊరేగింపుగా వేదిక వద్దకు పిలుచుకొచ్చారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామస్తులకు అన్నసంతర్పణ చేశారు.

మహనీయుల బాటలో నడవాలి



పంద్రాగస్టు వేడుకలో నాగరాజు తదితరులు

బనశంకరి: స్వాతంత్ర్యం కోసం పాటుపడిన జాతిపిత, జవహర్‌లాల్‌నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, లాల్‌బహద్దూర్‌శాస్త్రి అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు బీబీఎంపీ మాజీ పాలనావిభాగం నేత జయనగర నియోజకవర్గ గ్యారంటీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు ఎస్.నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జయనగర మూడోబ్లాక్ రాణి కిత్తూరు చెన్నమ్మ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య వేడుకలో నాగరాజు పాల్గొని గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించి జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, మహనీయుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సురేశ్, ఎంపవర్‌మెంట్ ట్రస్ట్ సభ్యులు, వివిధ పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న త్రివర్ణ పతాకం ఊరేగింపు



మువ్వన్నెల జెండాను ఊరేగిస్తున్న దృశ్యం

మండ్య: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండ్య యూత్ గ్రూప్ ఆధ్వర్యంలో 500 మీటర్ల పొడవైన జెండాను నగరంలో ప్రదర్శించారు. గ్రూప్ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ ఆనంద్ నేతృత్వంలో పదాధికారులు శ్వేతవస్త్రాలు ధరించి జెండా ఊరేగింపులో పాల్గొన్నారు. నగరంలోని ఆస్పత్రి రోడ్డులోని నిరాళ క్లినిక్ ముందు భాగంలో డాక్టర్ అనిల్ ఆనంద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. జెండా ఊరేగింపు జయరాం సర్కిల్, బెంగళూరు–మైసూరు రోడ్డు, మహావీర సర్కిల్, వీవీ రోడ్డు, హొసహళ్లి సర్కిల్ గుండా సాగి 100 అడుగుల రోడ్డుకు చేరడంతో ముగిసింది. ఊరేగింపులో కీలుబొమ్మలు, పూజా కుణిత, ఇతర కళాబృందాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపును నగర ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

కోలారు వార్తలు...

కోలారు జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

- కలెక్టర్ ఆదేశాలు

కోలారు: కోలారు జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తూ కలెక్టర్ అక్రం పాషా ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ ఎంత హానికరమో విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పర్యావరణ హిత వస్తువులను ఉపయోగించడంపై జాగృతి చేపట్టాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలకు కూడా ఆదేశాలు ఇవ్వాలని అన్నారు.

పశ్చిమ కనుమల్లో భూ పరివర్తనకు తాత్కాలిక బ్రేక్

బనశంకరి: జీవ వైవిధ్యానికి నిలయంగా ఉన్న పశ్చిమ కనుమలు సంరక్షించే దృష్టితో ఈ పరిధిలో భూ ఉపయోగం గురించి కొత్త నిబంధనలు రూపొందించే వరకు భూ పరివర్తన ప్రస్తావనను తాత్కాలికంగా నిలిపివేయాలని అటవీ శాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రే అధికారులకు సూచించారు. శుక్రవారం అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శికి పంపిన జీవోను ఇటీవల కేంద్ర ప్రభుత్వం మరోసారి ఆదేశాలు జారీ చేసిన కస్తూరిరంగన్ నివేదిక గురించి మంత్రి వర్గంలో చర్చిస్తామని తెలిపారు. కర్ణాటక, కేరళతో పాటు పశ్చిమ కనుమల్లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడటం, భూమి కుంగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి ఈశ్వర్‌ఖండ్రే కొడగు కొండచరియలు విరిగిపడిన అధ్యయనంలో అటవీభూములు ఆక్రమణ, మానవ అభివృద్ధి కార్యకలాపాలు ప్రాథమిక కారణమని తెలిసింది. పశ్చిమ కనుమల్లో తలెత్తే ప్రమాదాల నియంత్రణకు ముందుజాగ్రత్తచర్యగా ఈ ప్రాంత ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశ్చిమ కనుమలు పరిధిలోని నగర, గ్రామాంతర ప్రదేశాల పరిధిలో భూ ఉపయోగరీతి, భూ పరివర్తనతో పాటు కట్టడాల నిర్మాణానికి రెవెన్యూ, నగరాభివృద్ధి, నగర, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ సమన్వయంతో భూ ఉపయోగ స్వరూపం గురించి కొత్త ప్రాదేశిక నియంత్రణ రూపొందించే వరకు పశ్చిమకనుమల పరిధిలోకి చెందిన అన్ని భూ పరివర్తన ప్రస్తావనలను తాత్కాలికంగా అడ్డుకోవడం సరైందని తక్షణం చర్యలు తీసుకోవాలని అదనపు ప్రధాన కార్యదర్శికి సూచించారు.

రైతులకు రెండవ విడత భూ పరిహారం ఇవ్వండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: చెన్నై కారిడార్ రహదారి అభివృద్ధికి భూములు ఇచ్చిన రైతులకు రెండవ విడత పరిహారం మొత్తం అందించాలని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రైతు సమావేశంలో జిల్లా కలెక్టర్ అక్రం పాషా అధికారులకు సూచించారు. ముళబాగిలు సరిహద్దులోని చుక్కనహళ్లి, ఏతురహళ్లి రైతులకు రావలసిన రెండో కంతు పరిహారం ఇవ్వడానికి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు రాజణ్ణ, నటరాజ్‌లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి పట్ల రైతులు కలెక్టర్ సమక్షంలో తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేశారు. విశేష భూ స్వాధీన అధికారి మల్లికార్జున్ మాట్లాడుతూ చిత్తూరు పీడీ ఖాతాలో ఉన్న నిధులు విడుదల చేస్తే రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు ఎలాంటి షరతు లేకుండా జమ చేస్తామని కలెక్టర్‌కు తెలిపారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ... పరిహారమే లభించదని నిరాశతో ఉన్న రైతులకు రైతు సంఘం ఆందోళనల కారణంగా పరిహారం అందుతోందన్నారు. గత పదేళ్లుగా రైతులు రెండవ కంతు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. రైతులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పరిహారం అందేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. సమావేశంలో అటవీశాఖ అధికారి ఏడు కొండలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, జనార్ధన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై వైద్య విద్యార్థుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

కోలారు: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శుక్రవారం నగర సమీపంలోని దేవరాజ్ అరస్ మెడికల్ కళాశాల విద్యార్థులు కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు మాట్లాడుతూ...కోల్‌కతా మెడికల్ కళాశాలలో విద్యార్థినిపై హత్యాచారం జరగడం దారుణమన్నారు. వెంటనే నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో ఈ ఘటన జరగడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని మండిపడ్డారు. మెడికల్ కళాశాలల్లో విద్యార్థులకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళనలు దేశవ్యాప్తంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. ధర్నాలో దేవరాజ్ అరస్ మెడికల్ కళాశాల ఉపకులపతి డాక్టర్ వెంగమ్మ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె ప్రభాకర్, ముఖ్య పాలనాధికారి డీవీఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ ముని నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన దృశ్యం

కోలారు: ప్రతిభావంత విద్యార్థులను గుర్తించి వారిని తగిన విధంగా ప్రోత్సహించడం ద్వారా వారు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అన్ని విధాలా సహకారం అందించాలని బిడబ్ల్యుఎస్ఎస్‌బి అధ్యక్షుడు రామ ప్రసాద్ మనోహర్ తెలిపారు. శుక్రవారం క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాయణ్ణ 226వ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో ఆత్మస్థైర్యం, శక్తిని నింపే బాధ్యత తల్లులపై ఉంది. తల్లిదండ్రులు పిల్లల్లో గెలవాలనే పట్టుదలను పెంచాలని, వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలని కోరారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారు అభివృద్ధి చెందడానికి విద్య ఎంతో ముఖ్యం. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి జాయింట్ సెక్రెటరీ బి శివస్వామి, క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ నౌకరుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మునిరాజు, తహసీల్దార్ డాక్టర్ ఎస్ నయన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిటీ బస్సు సేవలకు శ్రీకారం

మైసూరు: జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప శుక్రవారం నగర శివార్లలోని ఔటర్ రింగ్ రోడ్డులో సిటీ బస్సుల రాకపోకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన బస్సులో కొంత దూరం ప్రయాణించారు. ఆయన వెంట ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్, అధికారులు ఉన్నారు. దీంతో రింగ్ రోడ్డు చుట్టుపక్కల గ్రామాలు, కాలనీల ప్రజల డిమాండ్‌పై ఆర్టీసీ స్పందించినట్లయింది. ఇక రింగ్ రోడ్డు వెంట బస్సులు సంచరించనున్నాయి. సిటీ బస్టాండ్ నుంచి మొత్తం నాలుగు మార్గాల్లో 14 బస్సులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

కారు దూసుకెళ్లి అంగడి ధ్వంసం


దుకాణంలోకి దూసుకుపోయిన కారు

దొడ్డబళ్లాపురం: అదుపుతప్పిన కారు ఒకటి దుకాణంలోకి దూసుకుపోయిన సంఘటన మంగళూరు వద్ద విట్ల– కాసరగోడు మార్గంలోని కాశిమఠ వద్ద చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఉక్కుడ వైపు నుండి వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డుపక్కన యోగేశ్ అనే వ్యక్తికి చెందిన చిల్లర అంగడిలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో దుకాణం మొత్తం ధ్వంసమైంది. డ్రైవర్ మద్యం తాగి కారు నడపడంతోనే ఇలా జరిగిందని స్థానికులు తెలిపారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రైతును బలిగొన్న పాము

తుమకూరు: పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురై ఓ రైతు మరణించిన ఘటన జిల్లాలోని రంగయ్యనపాళ్యలో జరిగింది. గ్రామానికి చెందిన చిక్కీరయ్య (65) అనే రైతు పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. అతనిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ రైతు మరణించాడు. భార్య, పిల్లలు, మనవళ్లతో సహా బంధువులను శోకసంద్రంలో మునిగిపోయారు.

19న పశుచికిత్స కేంద్రం ప్రారంభం

మండ్య: జిల్లాలోని కేఆర్‌పేటె తాలూకా సారంగి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో ఈనెల 19న నూతన పశుచికిత్స కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండ్య ఎంపీ, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కార్యక్రమంలో పాల్గొంటారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.చెలువరాయస్వామి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కేఆర్ పేటె ఎమ్మెల్యే హెచ్‌టీ మంజు అధ్యక్షత వహిస్తారు. ప్రత్యేక అతిథిగా పశుసంవర్ధక, పట్టు శాఖ మంత్రి కె.వెంకటేష్, ఎమ్మెల్సీలు మధు మాదేగౌడ, దినేష్ గూళిగౌడ, వివేకానంద తదితరులు పాల్గొంటారని తెలిపారు.

డెంగీపై పాఠశాలలకు మార్గదర్శకాలు

శివాజీనగర: రాష్ట్రంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా విద్యా సంస్థల్లో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డెంగీ నియంత్రణకు పాఠశాలల్లో అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. డీడీపీఐ, బీఈఓలు పాఠశాలల్లో మార్గదర్శకాలు పాలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గైడ్‌లైన్స్:
విద్యార్థులు కాళ్లు, చేతులు మూసి ఉంచేలా యూనిఫారమ్ ధరించాలి. పాఠశాలకు వచ్చే ముందుగా మాస్కిటో రిపెలెంట్‌లను కాళ్లు, చేతులకు పూసుకోవాలి. డెంగీ నియంత్రణ గురించి పాఠశాల గదుల్లో నోటీస్ బోర్డులు అతికించాలి. శుద్ధమైన నీటి సేకరణ పరికరాలను భద్రంగా మూతవేసి ఉంచాలి. తప్పకుండా వారానికి ఒకసారి శుభ్రం చేసి ఉంచాలి. డెంగీ జ్వరంపై సమాచారాన్ని ఉదయాన్నే ప్రార్థనా సమయంలో ప్రచారం చేయాలి.

భారీ వర్షం..రోడ్లు జలమయం


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

శివమొగ్గ: నగరంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. జైలు రోడ్డు, హొసమనె 5వ క్రాస్, కమలా నెహ్రూ కాలేజీ రోడ్డుతో పాటు పలు రోడ్లు వర్షం నీటితో నిండిపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అస్తవ్యస్తమైన డ్రెయినేజీ, రాజ కాలువలతో వర్షం నీరు సక్రమంగా ముందుకు సాగక రోడ్లపైకి చేరుతోందని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేజీఎఫ్ బడా దొంగల ముఠా అరెస్టు


స్వాధీనపరచుకున్న అమ్మవారి ముఖాకృతి కలిగిన బంగారు ఆభరణాలు


స్వాధీనపరచుకున్న చోరీ సొత్తు



- ఇంటిని చూసి అంచనా వేస్తారు
- రాత్రికి వచ్చి దోచేస్తారు
- మహదేవపుర పోలీసుల కార్యాచరణ

కృష్ణరాజపుర: వరమహాలక్ష్మి వ్రత పూజల కోసం ఇంట్లో భద్రపరిచిన బంగారు ఆభరణాలను చోరీ చేసిన కేజీఎఫ్‌కు చెందిన నలుగురు సభ్యుల దొంగల ముఠాను బెంగళూరు మహదేవపుర పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. వర మహాలక్ష్మి పూజల కోసం ఇంట్లో దాచి ఉంచిన అమ్మవారి ముఖాకృతి కలిగిన బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన జాన్‌ప్రకాష్, ప్రేమ్‌కుమార్, సంతోష్, శివకుమార్ అనే నలుగురిని పట్టుకుని వారి నుంచి సుమారు రూ.75 లక్షల విలువ చేసే 840 గ్రాముల బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. పండుగకు ముందే పోలీసుల చేతికి చిక్కడంతో పండుగ రోజున యజమాని చేతికి తిరిగి ఆభరణాలు దక్కాయి. ఈ ముఠా మహదేవపుర పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు.

చోరీలకు ఇలా ప్లాన్

వీరు ఇళ్ల ముందు చెప్పులు లేని ఇళ్లు, లైట్లు ఆఫ్ అయిన ఇల్లు, ఇళ్ల ముందు న్యూస్‌పేపర్లు పడిన వైనాన్ని బట్టి ఆ ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకునేవారు. ఆ ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయేవారు. దొంగతనాల్లో ఆరితేరిన వీరు గతంలో ఒకేసారి మహదేవపుర పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. నిందితుల అరెస్టుతో మొత్తం 18 దొంగతనాలు, దోపిడీ కేసులు పరిష్కారమైనట్లు పోలీసులు తెలిపారు. తాజా చోరీల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును సొంతదారుకు అప్పగించారు. దొంగతనం చేయగానే సొంతూరికి వెళ్లిపోయి మళ్లీ కొన్ని వారాల తరువాత వచ్చేవారు. సీసీ కెమెరాలలో వీరి కదలికలు రికార్డయ్యాయి. దీంతో దొంగలను పట్టుకోవడం సులువైంది.


పట్టుబడిన నిందితులు

ముగ్గురు దొంగలు అరెస్టు

దొడ్డబళ్లాపురం: తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను సౌత్ జోన్ పోలీసులు అరెస్టు చేసారు. గిరినగర్ పోలీసులు మోస్ట్ వాంటెడ్ రౌడీ షీటర్ నరసింహారెడ్డిని అరెస్టు చేసి అతడి నుండి రూ.81.25 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కుమారస్వామి లేఔట్ పోలీసులు కార్తీక్ అలియాస్ ఎస్కేప్ కార్తీక్, రఘు అలియాస్ పెప్సిని అరెస్టు చేసారు. ఇద్దరు నిందితుల నుండి రూ.31 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై పలు కేసులు నమోదై ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాలో దొంగ


ఫుటేజీలో దొంగ చిత్రం

గౌరిబిదనూరు: నగరంలోని తుమకూరు ఎంజీ రోడ్డులో గురువారం అర్ధరాత్రి లక్ష్మి ఎలక్ట్రిక్, హార్డ్‌వేర్ షాపులో దొంగ రూ. 10 వేల నగదును దోచుకెళ్ళాడు. యజమాని ప్రశాంత్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం షాపు తెరవడానికి రాగా, షట్టర్ వంచి ఉంది. లోపల నగదు పెట్టె పగులకొట్టడాన్ని గమనించి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక దొంగ లోపలికి చొరబడినట్లు నమోదైంది. దొరికిన నగదును ఎత్తుకెళ్లాడు. ఇనుప సామాన్లను తీసుకెళ్లడానికి సాధ్యపడి ఉండదని షాపు యజమాని తెలిపాడు.

బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి

క్రిష్ణగిరి: ముందు వెళుతున్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన క్రిష్ణగిరి తాలూకా పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు వేపనపల్లి సమీపంలోని బదిమడుగు గ్రామానికి చెందిన రూపేష్ (22), క్రిష్ణగిరి కాటినాయకనపల్లివాసి సూసైరాజ్ (27). మిత్రులైన వీరు హోసూరులోని ప్రైవేట్ కంపెలో కార్మికులు. గురువారం సాయంత్రం బైక్‌లో వెళుతూ క్రిష్ణగిరి– ధర్మపురి హైవేలో మనమాస్ పార్రై వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొన్నారు. బైక్ పల్టీలు కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడే చనిపోయారు. క్రిష్ణగిరి తాలూకా పోలీసులు చేరుకొని శవాలను ఆస్పత్రికి తరలించారు. ఎప్పుడూ కలిసే ఉండే వీరు మృత్యువులోనూ కలిసే వెళ్లారని బంధువులు విలపించారు.

ఫ్లవర్ షోలో తగ్గని జన రద్దీ

బనశంకరి: నగరంలో లాల్‌బాగ్ పార్కులో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ ఫ్లవర్ షో సందర్శకులతో కళకళలాడుతోంది. ఆగస్టు 15న ఒక్కరోజే 2.10 లక్షల మందికి పైగా సందర్శకులు ఫల పుష్ప ప్రదర్శనను వీక్షించారు. గురువారం టికెట్లు దొరకలేదు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్నప్పటికీ గ్లాజ్‌హౌస్‌లోకి వెళ్లడానికి రద్దీలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈ నెల 8 నుంచి ప్రారంభమైన ఫ్లవర్ షోలో 14వ తేదీ వరకు రూ.1.03 కోట్లు వసూలు కాగా, 15వ తేదీ ఒకే రోజు మరో రూ.92.50 లక్షలు టికెట్ల విక్రయం ద్వారా వసూలైంది. లాల్‌బాగ్ ఫ్లవర్ షోను ఇప్పటి వరకు 5.50 లక్షలమందికి పైగా వీక్షించగా టికెట్లు విక్రయం ద్వారా రూ.2.12 కోట్లు వసూలైందని ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగదీశ్ తెలిపారు. శుక్రవారం వర మహాలక్ష్మీ పండుగ సందర్భంగా సెలవు కావడంతో నగరవాసులు భారీగా వచ్చారు.



స్కూళ్ల అభివృద్ధికి చేయూతనివ్వాలి

- మంత్రి మధు బంగారప్ప పిలుపు


మాట్లాడుతున్న మంత్రి మధు బంగారప్ప

శివమొగ్గ: తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ప్రజలందరూ చేయి కలిపితే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రాథమికోన్నత విద్యా శాఖామంత్రి ఎస్. మధు బంగారప్ప పేర్కొన్నారు. ఆయన శుక్రవారం జిల్లాలోని సొరబ తాలూకా కుబటూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మన పాఠశాల–మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి కోసం తన వ్యక్తిగతంగా రూ.10 లక్షల విరాళం అందించే కార్యక్రమంలో భార్య అనితతో కలిసి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన సాధకులు, శ్రీమంతులు తలుచుకుంటే ఆ పాఠశాలల భవిష్యత్తు, రూపురేఖలను మార్చవచ్చని, దీనికి కుబటూరు గ్రామ ప్రభుత్వ పాఠశాల నాంది పలికిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి దివంగత ఎస్.బంగారప్ప నాడు ఇదే పాఠశాలలో చదువుకొని ఈ రాష్ట్రానికే ముఖ్యమంత్రి అయి ప్రజాదరణ పొందారని గుర్తు చేసుకున్నారు. పాఠశాలకు ఆయన రెండు టీవీలు, కంప్యూటర్, పిల్లలు కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లతో సహా రూ.10 లక్షల విలువ చేసే సామగ్రిని అందజేశారు. అంతకు ముందు ఆయన కుబటూరు చెరువుకు వాయనం సమర్పించారు. ఈసందర్భంగా డీడీపీఐ సీఆర్ పరమేశ్వరప్ప, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు మల్లేశప్ప, బీఈఓ పుష్ప, శేఖర్, దయానంద కల్లె, నాగరాజగౌడ, గణపతి, నాగరాజ, అరుణ్ కుమార్, రాజశేఖర్, మంజునాథ్, హుచ్చప్ప, ప్రకాష్, సహోపాధ్యాయిని సునీత తదితరులు పాల్గొన్నారు.

20న ధర్నా చేపడతాం


మాట్లాడుతున్న శ్రీనివాస్ భద్రణ్ణ

మండ్య: శరణుల వచన దర్శన అనే పుస్తకాన్ని ముద్రించి పంచడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 20న బెంగళూరులో బసవణ్ణ అనుయాయుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని కెచ్చెదెయ కన్నడిగర వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ భద్రణ్ణ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. వచన దర్శన పుస్తకం నాసిరకంగా ఉందని, బసవ తత్వాలను నాశనం చేసే కుట్రతో ఈ పుస్తకాన్ని పంచుతున్నారని, అందువల్ల నిరసనలో బసవణ్ణ అనుయాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మనవి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఓంకార్ చౌండి, ప్రముఖులు బెట్టళ్లి మంజునాథ్, ఎంఎస్ మంజునాథ్, శంభులింగప్ప, ప్రకాష్ హెబ్బళ్లి, బెళ్లప్ప, శివరుద్రస్వామి, కుమార్ పాల్గొన్నారు.

బాలుడి మృతి.. కుటుంబ సభ్యుల ధర్నా


బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

తుమకూరు: జిల్లాలోని శిరా తాలూకా హెచ్.కావల్ గ్రామానికి చెందిన బాలుడు ఆటలాడుతూ విద్యుత్ తీగ తగిలి మరణించిన ఘటనను బెస్కాం అధికారులు సహజ మరణంగా చిత్రీస్తున్నారని ఆరోపిస్తూ భోవి సమాజ సంఘం నేతృత్వంలో తల్లిదండ్రులు, బంధువులు శుక్రవారం నగరంలోని జిల్లా ఆస్పత్రి మార్చురీ ఎదుట ధర్నా చేశారు. బెస్కాం అధికారులు బాలుడు విద్యుదాఘాతంతో కాకుండా గుండెపోటుతో చనిపోయాడని వాదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన భోవి సమాజ పెద్దలు బెస్కాం అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం సంభవించిందని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాస్పత్రి మార్చురీకి చిక్కనాయకనహళ్లి ఎమ్మెల్యే, జేడీఎస్ ఎల్‌పీ నాయకుడు సీబీ సురేష్‌బాబు అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటనపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని జిల్లాధికారి, ఎస్పీకి అక్కడి నుంచే ఫోన్ చేశారు. ఒకవేళ ఉదాసీనత వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ బాలుడి పోస్ట్‌మార్టం నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిహారం ఇప్పించేందుకు ప్రయత్నిస్తానన్నారు. కాగా ఎమ్మెల్యే భరోసాతో ఆందోళనకారులు శాంతించి నిరసనను విరమించారు.

ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉపకార వేతనాలను అందిస్తున్న విద్యాశాఖాధికారి శ్రీనివాసమూర్తి

గౌరిబిదనూరు: విద్యార్థులు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని గురువారం నగరంలోని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో స్వసహాయ సంఘ సభ్యుల పిల్లలకు 49 మందికి స్కాలర్‌షిప్‌ల మంజూరు పత్రాలను వితరణ చేసి మాట్లాడారు. ధర్మస్థల సంస్థ జ్ఞానదీప పథకం కింద ఉపాధ్యాయులు లేని పాఠశాలలో గౌరవ వేతనాన్ని ఇచ్చి ఉపాధ్యాయులను నియమించడం, పాఠశాలల అవసరమైన వాటిని సమకూర్చడం వంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకర విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా జనజాగృతి వేదిక చంద్రశేఖర్, లక్ష్మి, డీఎస్‌ఎస్ నాయకులు గంగప్ప, నంజుండప్ప, జగన్నాథ్, ప్రదీప్, అశ్విని, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

18న అవార్డు ప్రదానోత్సవం


మాట్లాడుతున్న లోకేష్

మండ్య: కర్ణాటక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు నగరంలోని జానపద విద్వాంసుడు హెచ్‌కే రాజేగౌడ పేరిట మరణోత్తర ప్రశస్తి ప్రదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం కార్యదర్శి చందగాలు లోకేష్ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. నగరంలోని సంఘపు కేవీ శంకరగౌడ శతమానోత్సవ భవన సభాంగణంలో అవార్డును ప్రదానం చేస్తామన్నారు. మొదటి సంవత్సరపు ఈ కార్యక్రమంలో మైసూరు వర్సిటీ విశ్రాంత వీసీ షేక్ అలీకి మరణానంతరం అందిస్తున్న ఈ అవార్డును ఆయన కుమారుడు స్వీకరిస్తారని తెలిపారు. అవార్డు కింద రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారని తెలిపారు. ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం పీఠాధ్యక్షుడు నిర్మలానందనాథ స్వామీజీ, విశ్వమానవ క్షేత్ర కార్యదర్శి పురుషోత్తమానందనాథ స్వామీజీ సాన్నిధ్యం వహిస్తారని తెలిపారు. కర్ణాటక జలరవాణా మండలి సీఈఓ జయరాం రాయపుర అవార్డు ప్రదానం చేసి గంగసామ్రాజ్యం గురించి ఉపన్యసిస్తారని తెలిపారు. జానపద విద్వాంసుడు రాజేగౌడ కుమారుడు దినేష్ చంద్ర తదితరులు పాల్గొంటారని తెలిపారు.

హోసూరు వార్తలు..

తారు రోడ్డు ప్రారంభం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో 22వ వార్డు ప్రాంతంలో కొత్తగా నిర్మించిన తారురోడ్డును ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ.సత్య ప్రారంభించారు. అక్షయ గార్డెన్ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతూ ఉన్నారు. కార్పొరేటర్ ఎస్.ఎస్.మాదేశ్వరన్ చొరవతో రోడ్డు నిర్మాణానికి రూ. 88 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పూర్తి కావడంతో శుక్రవారం ప్రారంభించారు. ఉప మేయర్ ఆనందయ్య, చెన్నీరప్ప, శ్రీనివాసన్, సుమన్ పాల్గొన్నారు.

ఉద్యోగినికి అవార్డు

కెలమంగలం: గత పదేళ్లుగా కెలమంగలం సమితి అభివృద్ధికి కృషి చేస్తూ ఉత్తమ సేవలందజేసిన డిప్యూటీ బీడీవో లక్ష్మి గురువారం స్వాతంత్ర దినోత్సవంలో కలెక్టర్ శరయు నుంచి ఉత్తమ ఉద్యోగిగా అవార్డును అందుకొన్నారు. బీడీవో కార్యాలయంలో సిబ్బంది డెప్యూటీ బీడీవో లక్ష్మిని అభినందించారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


ఓ ఇంట విశేష అలంకరణతో అమ్మవారు

హోసూరు, కెలమంగలం: వర మహాలక్ష్మీ పండుగ సందర్భంగా శుక్రవారం క్రిష్ణగిరి జిల్లాలో పెద్దఎత్తున మహిళలు వ్రతాన్ని ఆచరించారు. అమ్మనవారిని కలశంపై ప్రతిష్ఠించి, పూలతో అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కుటుంబంలో సుఖశాంతులు కల్పించాలని, దుష్ట శక్తులను దూరం చేయాలని ప్రార్థించారు. ఇరుగుపొరుగు ముత్తైదువులకు వాయనాలను అందజేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


పోలీసు అధికారులకు బొకె అందజేస్తున్న దృశ్యం

హోసూరు: పారిశ్రామిక రంగంలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు మహా నగరంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ప్రతి ఇంటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని హోసూరు పట్టణ పోలీసులు సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్నానగర్ ప్రాంతంలో అంబేడ్కర్ సేవా సంస్థ, స్థానిక ప్రజలచే ఆ ప్రాంతంలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారి నాగరాజ్ మాట్లాడుతూ... పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు పట్టణంలో దోపిడీలు, దొంగతనాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, పోలీసులు చర్యలు చేపట్టినా ఆగడం లేదని, ప్రస్తుతం ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయని, స్థానిక ప్రజలే స్వచ్ఛందంగా ఆ కెమెరాలను వినియోగించినట్లయితే చోరీలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అంబేడ్కర్ సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు దారుణ హత్య


మునిరాజ్ (ఫైల్)

హోసూరు: హోసూరు సమీపంలో రైతును దారుణంగా హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు... హోసూరు సమీపంలోని చిన్నబేళగొండపల్లి గ్రామానికి చెందిన రైతు మునిరాజ్ (68) సామాజిక సేవాకర్త. గురువారం సాయంత్రం మత్తిగిరి పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు విచారణ కోసం మనవుడితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని దుండగులు వాహనాన్ని అడ్డగించి వేటకొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకొన్న మత్తిగిరి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల సమాచారం మేరకు చిన్నబేళగొండపల్లి గ్రామంలో కొంత మంది చట్టవిరుద్ధంగా కర్ణాటక, తమిళనాడు మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు, ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందజేస్తూ వచ్చాడని, గురువారం అతని పెద్ద కూతురి కొడుకు వేల్‌మురుగన్ (18)తో కలిసి ద్విచక్ర వాహనంలో మత్తిగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అక్రమ సారా విక్రయంపై ఫిర్యాదు చేసి వెళ్తుండగా మత్తిగిరి క్యాటిల్‌ఫాం వద్ద రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ముగ్గురు దుండగులు మునిరాజ్‌పై దాడి చేశారని, ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మునిరాజ్‌ను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనలో నాగరాజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెలవు ప్రకటించని పరిశ్రమలపై చర్యలు

హోసూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రిష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో సెలవు ప్రకటించని 58 పరిశ్రమలపై కార్మిక సంక్షేమ శాఖ చర్యలు చేపట్టింది. చెన్నై కార్మిక సంక్షేమ శాఖాధికారులు గురువారం క్రిష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్ట్ 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికులకు సెలవు ప్రకటించని, దుకాణాలు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు, ద్విచక్ర, నాలుగు చక్ర వాహన తయారీ పరిశ్రమలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సెలవు ప్రకటించని 58 పరిశ్రమలపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

సంస్కృతీ సంప్రదాయాలను రక్షించుకొందాం




ఇత్తలి బిందెను పరిశీలిస్తున్న విద్యార్థులు, పాతకాలం నాటి వస్తు సామగ్రిని తిలకిస్తున్న దృశ్యం

హోసూరు: మన పెద్దలు వినియోగించి ప్రస్తుతం కనుమరుగైపోతున్న సంస్కృతీ సంప్రదాయాలను రక్షించుకొందామని హోసూరు పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ అన్నారు. నాటి సంస్కృతి సంప్రదాయాల పట్ల పిల్లల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో పాఠశాలలో వస్తు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పూర్వీకులు వినియోగిస్తున్న పాత నాణేలు, మట్టి పాత్రలు, వంట సామాగ్రి, రైతులు వినియోగిస్తున్న ఉపకరణాలు, వంట తయారీకి వినియోగిస్తున్న పొయ్యి, కిరోసిన్ స్టవ్ తదితర వస్తువులు ఈ ప్రదర్శనలో చోటు చేసుకొన్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సింధూ మాట్లాడుతూ మన పూర్వీకులు ఆచరిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తీసుకెళ్లే ఉద్దేశంతో అప్పటి ప్రజలు పారంపర్యంగా వినియోగిస్తున్న వస్తువులు, ఉపకరణాలను ప్రదర్శించి పిల్లల్లో చైతన్యం కల్పించేందుకు చర్యలు చేపట్టి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని, వస్తు ప్రదర్శనతో పాటు అప్పటి ప్రజలు సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న కట్టపంచాయతీ, గ్రామపెద్దల తీర్పులు, వీధినాటక ప్రదర్శనలు వంటి సంస్కృతిపై చైతన్యం కల్పించామని, దేశ సంస్కృతిని రాబోవు తరానికి పరిచయం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలో తాత, ముత్తాతలు వినియోగించిన పరికరాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభించింది.

క్లుప్తంగా...

వాటర్ ప్లాంట్ యజమానిపై టీడీపీ కక్షసాధింపు



నిర్వాహకులతో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ: నెల్లూరు 19వ డివిజన్ పరిధిలోని ముత్యాలపాళెంలో వరాల షణ్ముకం నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను టీడీపీ నేతల ఆదేశాలతో మునిసిపల్ అధికారులు మూసివేయించారు. షణ్ముకం సోదరుడు లక్ష్మీనారాయణ వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జిగా ఉన్నాడు. లక్ష్మీనారాయణపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అతని సోదరుడి వాటర్ ప్లాంట్‌ను మూసివేయించారు. రెండు రోజుల క్రితం ఈ ఘటన జరగ్గా.. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం శుక్రవారం వెలుగు చూసింది.

టీడీపీ వేధింపులు.. సొసైటీ గుమాస్తా ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలోని అన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో గుమాస్తాగా పనిచేస్తున్న ఓరుగంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. నల్లగార్లపాడులోని తన ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. కుటుంబ సభ్యులు గుర్తించి నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న రొంపిచర్ల పోలీసులు అతడి వాంగ్మూలం నమోదు చేశారు. తాను రొంపిచర్ల పీఏసీఎస్‌లో ఉద్యోగం చేస్తుండగా.. ఐదేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై అన్నవరం పీఏసీఎస్‌కు వచ్చానని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఉద్యోగం మానుకోవాలని టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నారని, వారి కారణంగా మూడు నెలలుగా జీతం ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డిని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తక్షణమే సీఈవో శ్రీనివాస్, టీడీపీ నేతలపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవసరమైన బస్సులు వచ్చాక ఆ హామీ అమలు

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



కడప (కోటిరెడ్డి సర్కిల్): ఏపీఎస్ ఆర్టీసీని గాడిలో పెట్టేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం కడపలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం వెనుక వైపున వున్న భవనంలో మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవసరమైన బస్సులు తీసుకొచ్చిన తర్వాత ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. ఈ నెల 21 న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సమావేశంలో రవాణా శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

'అన్నా'.. ఇదెక్కడి చోద్యం!

నందిగామలో అన్న క్యాంటీన్‌కు రెండుసార్లు ప్రారంభోత్సవాలు



నందిగామలో ఉదయం అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

నందిగామ టౌన్: అన్న క్యాంటీన్‌కు వేర్వేరుగా ఇద్దరు ప్రారంభోత్సవం చేయడంతో ఇదేం చోద్యం అంటూ జనం నవ్వుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఉదయం ఒకరు, మధ్యాహ్నం మరొకరు వేర్వేరుగా ప్రారంభించడం విశేషం. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ప్రారంభించగా, ఆపై మధ్యాహ్నం మాజీమంత్రి దేవినేని ఉమ కూడా ఇదే క్యాంటీన్‌కు ప్రారంభోత్సవం చేశారు. అయితే ఒకే క్యాంటీన్‌ను రెండుసార్లు ప్రారంభించడంతో టీడీపీ శ్రేణులు అయోమయానికి గురయ్యాయి.



మధ్యాహ్నం రైతుబజార్ అన్నా క్యాంటీన్‌లో పూజా కార్యక్రమాలు చేస్తున్న దేవినేని ఉమ

■ వేరుశనగ.. వర్షార్పణం



కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అరగంట పాటు కురిసిన వర్షం వందలాదిమంది రైతులకు కష్టం తెచ్చిపెట్టింది. శుక్రవారం 158 మంది రైతులు 5,711 సంచుల్లో 2వేల క్వింటాళ్ల వేరుశనగ కాయలు తీసుకొచ్చి ప్లాట్ ఫారంపై ఆరబోశారు. అయితే మధ్యాహ్నం ఎడతెరిపిలేని వర్షం కురవడంతో వేరుశనగంతా తడిచి ముద్దయ్యింది. -ఆదోని అర్బన్

■ చెత్త వేస్తే.. చెప్ప దెబ్బే!



కాలువలో చెత్త వేస్తే.. చెప్పతో కొట్టినట్టే.. అన్నట్టుగా అనంతపురం జిల్లా తాడిపత్రిలో మునిసిపల్ అధికారులు చెట్లకు ఇలా చెప్పలు వేలాడదీశారు. కాలువలో చెత్త కారణంగా మురుగు ముందుకు పోవడం లేదని.. ఇలా చేస్తే కొంతవరకైనా చెత్త వేయడం తగ్గుతుందని వారి భావన. అయితే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు ఇలా చెప్పలు వేలాడదీయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. – తాడిపత్రిటౌన్

కూటమిలో తేలని 'పదవుల' పంచాయితీ

రెండు నెలలైనా ఒక్క నామినేటెడ్ పదవీ భర్తీ చేయని చంద్రబాబు

కీలకమైన టీటీడీ, ఆర్టీసీ, ఏపీఐఐసీ వంటి వాటిపైనా అస్పష్టత

- టీటీడీ చైర్మన్ పదవి కోసం ముఖ్యుల పట్టు
- మూడు పార్టీల మధ్య అవగాహన కుదరకపోవడమే కారణం
- త్వరలో 30 కార్పొరేషన్లను భర్తీ చేసే అవకాశం ఉందంటున్న నేతలు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ఎన్డీఏ కూటమిలో నామినేటెడ్ పదవుల పంపకం ఎటూ తేలడంలేదు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా ఒక్క నామినేటెడ్ పదవిని కూడా సీఎం చంద్రబాబు భర్తీ చేయలేదు. అత్యంత ప్రతిష్టాత్మకమైన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), ఏపీఐఐసీ, ఆర్టీసీ వంటి కార్పొరేషన్ పదవులు సైతం ఇంకా ఎవరికీ ఇవ్వకపోవడంతో మూడు పార్టీల శ్రేణుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ప్రధానంగా టీడీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సహజంగానే నాన్చుడు ధోరణి ప్రదర్శించే చంద్రబాబు ఇప్పుడు కూటమిలో మూడు పార్టీల మధ్య పదవుల పంపకం జరగాల్సి ఉండటంతో మరింత తాత్సారం చేస్తున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీలకు ఏ నిష్పత్తిలో పదవులు ఇవ్వాలనే దానిపై ఒక అవగాహన కుదిరినా ఆశావహులు ఎక్కువగా ఉండడంతో చంద్రబాబు త్వరగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర స్థాయిలో 90కి పైగా కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల పదవులు వందల సంఖ్యలో ఉన్నాయి. మొత్తం పదవుల్లో 70 శాతం టీడీపీకి, 25 శాతం జనసేనకు, 5 శాతం బీజేపీకి కేటాయించాలనే ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. తొలి విడతగా వాటిలో 30 శాతం పదవులనైనా భర్తీ చేయాలని ప్రయత్నిస్తున్నా పార్టీలు, సమీకరణలు, లాబీయింగ్‌తో గందరగోళం ఏర్పడి ఇప్పటివరకు ఒక్క పదవినీ భర్తీ చేయలేకపోయారు. నియోజకవర్గాలకు సంబంధించిన పదవుల్లో గెలిచిన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

టీటీడీకి తీవ్ర పోటీ

అత్యంత కీలకమైన టీటీడీ చైర్మన్ పదవిపై కూటమిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ పదవిని టీడీపీకి కేటాయించుకున్నా దాన్ని ఎవరికి ఇవ్వాలనే దానిపై చంద్రబాబు ఎటూ తేల్చలేకపోతున్నారు. ఎల్లో మీడియాకి చెందిన ఓ ఛానల్ యజమానికి ఈ పదవి ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అంత ప్రాధాన్యత ఉన్న పదవిని పార్టీకి చెందిన వారికి కాకుండా బయటి వ్యక్తులకు ఎలా ఇస్తారనే అభ్యంతరాలు టీడీపీ నుంచి వచ్చినట్లు తెలిసింది. దీంతో సీనియర్ నేత కళా వెంకట్రావు పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఎల్లో మీడియా తరఫున ఓ ఛానల్ అధినేతకు చంద్రబాబు మాట ఇచ్చేశారని, ఆయనకే టీటీడీ చైర్మన్ పదవి లభిస్తుందనే వాదన గట్టిగా వినిపిస్తోంది. టీటీడీ బోర్డు సభ్యుల పదవుల కోసం కూడా విపరీతమైన పోటీ నెలకొంది. ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు, పారిశ్రామికవేత్తల నుంచి కూడా బోర్డు సభ్యత్వం కావాలని వినతులు వచ్చాయి. పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యులు, ఇతర రాష్ట్రాల పెద్దల నుంచి బోర్డు మెంబర్ల కోసం సిఫార్సులు రావడంతో చంద్రబాబు ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు సమాచారం. అయితే జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నుంచి కూన రవికుమార్, వేమిరెడ్డి ప్రశాంతికి బోర్డు సభ్యులుగా నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది.

ప్రచారంలో ఉన్న పేర్లు ఇవే?

ఎన్టీఆర్ జిల్లా మైలవరం సీటును వదులుకున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకి ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కడప జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఏపీఐఐసీ చైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కి పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి పీతల సుజాత, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పేర్లు ఖరారైనట్లు చెబుతున్నారు. తెనాలి సీటు వదులుకున్న ఆలపాటి రాజాకి కీలకమైన పదవి దక్కుతుందని సమాచారం.

వైఎస్ విగ్రహంపై దాడి



ధ్వంసమైన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం అద్దాలు

వేమూరు/పాయకరావుపేట: బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామంలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై టీడీపీ నేతలు దాడి చేశారు. ఈ దాడిలో విగ్రహం చుట్టూ ఉన్న అద్దాలు ధ్వంసమయ్యాయి. మూల్పూరు మధ్యలో రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని అద్దాల మధ్య ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి టీడీపీ నేతలు కొందరు రాళ్లతో అద్దాలు పగులగొట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మూల్పూరు సీతయ్య, పెనుమాల వినయ్ తదితరులు ఆందోళన చేశారు. అద్దాలు పగులగొట్టిన టీడీపీ నేతలు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లిలో విగ్రహం కూల్చివేత

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కూటమి నేతలు కూల్చివేశారు. గ్రామంలో పీహెచ్‌సీ సమీపాన దిమ్మెపై మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను గతంలో ఏర్పాటు చేశారు. ఆగస్టు 15 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వైఎస్సార్ విగ్రహాన్ని రాయితో కొట్టి కిందకి తోసేశారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలరాజు నర్సింహరాజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వైఎస్సార్ విగ్రహాన్ని యథాస్థానంలో పెట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ గోవిందు తెలిపారు.

పక్కా స్క్రిప్టు.. దోపిడీ కిక్కు!

మద్యంలో భారీగా దోపిడీకి సర్కారు పెద్దల ఎత్తుగడ

సాక్షి, అమరావతి : కొత్త మద్యం విధానం ముసుగులో భారీ దోపిడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు తెర తీశారు. అందుకోసం తన ట్రేడ్ మార్కు శైలి అయిన 'కన్సల్టెన్సీ ఎంపిక' పేరుతో ఎత్తుగడ వేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని మద్యం దుకాణాలను టీడీపీ నేతల సిండికేట్ గుత్తాధిపత్యం కిందకు తీసుకువచ్చేందుకు పక్కాగా పన్నాగం పన్నారు. ఈ కుట్రకు రాజ ముద్ర వేయించి, అనంతరం మద్యం విక్రయాల పేరుతో భారీగా దోపిడీకి పాల్పడాలన్నది ఆయన వ్యూహం. అందుకే మద్యం విధానం రూపకల్పన కోసం కన్సల్టెన్సీ ఎంపిక పేరిట డ్రామా ఆడుతున్నారు. మద్యం పాలసీ రూపొందించేందుకు కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఎక్సైజ్ శాఖ ద్వారా కాకుండా 'ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్) ద్వారా టెండర్ల ప్రక్రియ నిర్వహించడం విడ్డూరం. మద్యం విధానం రూపకల్పనలో ఏపీయూఐఏఎంఎల్‌కు ఎలాంటి అనుభవం లేదు. కేవలం ఎక్సైజ్ శాఖకు మట్టి అంటకుండా ఏపీయూఐఏఎంఎల్ ద్వారా కథ నడిపించాలని ఎత్తుగడ వేశారు. తమ అస్మదీయ కన్సల్టెన్సీకి అనుకూలంగా నిబంధనలను రూపొందించి, పక్కాగా మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతూ సాగిస్తున్న కుతంత్రం ఇలా ఉంది.

చంద్రబాబు ట్రేడ్‌మార్కు కన్సల్టెన్సీ కుట్ర

2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి, రాష్ట్రంలో యథేచ్ఛగా మద్యం దోపిడీకి పాల్పడిన విషయం అందరికీ గుర్తుంది. మద్యం దుకాణాలన్నింటినీ టీడీపీ నేతలు గుప్పెట పట్టడంతోపాటు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇది చాలదని.. ఏకంగా 43 వేల బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి ఎంఆర్‌పీ కంటే 25 శాతం అధిక ధరలకు విక్రయించి దోపిడీకి పాల్పడ్డారు. ఏటా రూ.2.50 లక్షల కోట్ల చొప్పున అయిదేళ్లలో రూ.12.50 కోట్లు కొల్లగొట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేసింది. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. దాంతో మద్యం దోపిడీకి అడ్డుకట్ట పడింది. ప్రస్తుతం మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతానికి మించి, మద్యం దుకాణాల ద్వారా దోపిడీకి పాల్పడేందుకు కుట్రకు తెరతీసింది. అందుకోసం చంద్రబాబు అండ్ కో ఇప్పటికే ఓ విధానాన్ని రూపొందించినట్టు సమాచారం. ఎక్సైజ్ పాలసీపై సమీక్ష పేరుతో చంద్రబాబు ఇప్పటికే కొత్త మద్యం విధానాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. కాగా శంఖంలో పోస్తేగానీ తీర్థం కాదన్నట్టు.. తాము రూపొందించిన విధానాన్ని ఓ కన్సల్టెన్సీయే ప్రతిపాదించిందని కనికట్టు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఇటీవల కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఏపీయూఐఏఎంఎల్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు.



బిడ్ల దాఖలుకు నాలుగు రోజులే గడువు

- తమ అస్మదీయ కన్సల్టెన్సీకే రాష్ట్రంలో మద్యం విధానాన్ని రూపొందించే కాంట్రాక్టు దక్కేలా స్క్రిప్ట్ రూపొందించారు. కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఏపీయూఐఏఎంఎల్ రూపొందించిన అర్హత నిబంధనలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.
- టెండర్ల ప్రక్రియలో పాల్గొనే కన్సల్టెన్సీకి గత మూడేళ్లలో సగటున ఏటా రూ.100 కోట్లు టర్నోవర్ ఉండాలని నిబంధన పెట్టారు. ఇతర రాష్ట్రాల్లోగానీ, విదేశాల్లోగానీ ఆ మేరకు టర్నోవర్ ఉండొచ్చన్నారు. ఇంత భారీగా టర్నోవర్ ఉండాలనడానికి ఇది రోడ్లు, ప్రాజెక్టుల నిర్మాణ కాంట్రాక్టు కాదని నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- కేవలం ఓ పాలసీ రూపొందించాల్సిన కన్సల్టెన్సీకి ఏటా రూ.100 కోట్ల టర్నోవర్ ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. అంటే ఇప్పటికే ప్రభుత్వ పెద్దలు తమ అస్మదీయ కన్సల్టెన్సీకి ఇతర కన్సార్షియం ద్వారా రూ.100 కోట్లు టర్నోవర్ ఉందని రికార్డులు సృష్టించి ఉంటారు. అందుకే ఆ నిబంధన పెట్టారన్నది స్పష్టమవుతోంది.
- కన్సల్టెన్సీ ఎంపిక కోసం కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు ఇవ్వడం ప్రభుత్వ దురుద్దేశాన్ని వెల్లడిస్తోంది. సాధారణ టెండర్లకు 21 రోజులు, ఎంతటి స్వల్ప కాలిక టెండరుకు అయినా కనీసం 14 రోజులు గడువు ఇస్తారు. ఏపీయూఐఏఎంఎల్ మాత్రం ఆ నిబంధనను పట్టించుకోలేదు.
- ఈ నెల 13న టెండరు నోటిఫికేషన్ ఇచ్చి.. బిడ్లు దాఖలు చేసేందుకు 16 వరకు తొలుత గడువు విధించింది. తర్వాత మరో రోజు పొడిగించి 17లోగా బిడ్లు సమర్పించాలని పేర్కొంది. కేవలం నాలుగు రోజుల గడువు ఇవ్వడమంటే ఇతర కన్సల్టెన్సీలు ఏవీ పోటీకి రాకూడదని వేసిన ఎత్తుగడేనన్నది స్పష్టమవుతోంది. అంతేకాకుండా బిడ్లను స్వయంగా వచ్చి దాఖలు చేయాలని పేర్కొంది. ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు అవకాశం ఇవ్వ లేదు. పైగా బిడ్లు దాఖలు చేసిన తర్వాత ఒక్క రోజులోనే ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పింది.
- దూరప్రాంతంలో ఉన్న కన్సల్టెన్సీ సంస్థలు కేవలం నాలుగు రోజుల్లోనే బిడ్లను రూపొందించి.. తమ ప్రతినిధులను అమరావతికి పంపించి దాఖలు చేయడం.. అనంతరం ఒక్క రోజులోనే ప్రజెంటేషన్ ఇవ్వడం.. అన్నది మామూలుగా సాధ్యం కాదు. కేవలం ఇతర కన్సల్టెన్సీలు బిడ్లు దాఖలు చేయకుండా ఉండేందుకే ఇటువంటి అసంబద్ధ నిబంధనలు విధించారు. తద్వారా తమ అస్మదీయ కన్సల్టెన్సీకే అడ్డగోలుగా కాంట్రాక్టు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు ఈ ఎత్తుగడ వేశారని ఎక్సైజ్ శాఖ వర్గాలే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

24 గంటలు సాధారణ వైద్యసేవల బంద్

- ఆర్‌జీ కర్ ఘటనకు నిరసనగా ఐఎంఏ నిర్ణయం



సాక్షి, అమరావతి: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ కళాశాలలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం వైద్యసేవల్ని బంద్ చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్ణయించింది. దీనికి వివిధ వైద్యసంఘాలు మద్దతుగా నిలిచాయి. దీంతో అన్ని ఆస్పత్రుల్లో శనివారం వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలపాటు అత్యవసర వైద్యసేవలు మినహా మిగిలిన సేవలను బహిష్కరిస్తున్నట్టు ఐఎంఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఫణిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై విచారణను వేగవంతంగా పూర్తిచేయాలని, ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోను వైద్యసిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం ప్రభుత్వాలు తీసుకునే చర్యల ఆధారంగా తమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు మద్దతు పలకాలని ఆయన కోరారు. మహిళా ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఎక్కువగా హింసకు గురవుతున్నారని అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఏపీ చాప్టర్ చైర్మన్ డాక్టర్ కె.శివశంకర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

'సీబీఐ'లో టీడీపీ దొంగలు

- సీబీఐ సీజ్ చేసిన వాహనాల్లోని సామగ్రి చోరీకి యత్నం
- పోలీసుల అదుపులో టీడీపీ సానుభూతిపరుడు
- బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాల సీజ్



వాహన సామగ్రిని దొంగిలించేందుకు వీలుగా గ్యాస్‌కట్టర్‌తో వేరుచేసిన దృశ్యం

రాయదుర్గం: అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో సీబీఐ సీజ్ చేసిన వాహనాల్లోని సామగ్రి ఎత్తుకెళ్తున్న దొంగలు టీడీపీ సానుభూతిపరులేనని తేలింది. ఈ వ్యవహారంలో డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన భాస్కర్ అనే టీడీపీ సానుభూతిపరుడు శుక్రవారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనితో పాటు మరో 9మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా శుక్రవారం మధ్యాహ్నం ఓఎంసీలోకి ప్రవేశించారు. సీబీఐ సీజ్ చేసిన వాహనాల్లోని విలువైన సామగ్రిని దొంగలించేందుకు పూనుకున్నారు. జేసీబీ వాహనంలోని విలువైన వస్తువులను గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించారు. వీటిని బొలెరో వాహనంలో తరలించేందుకు సిద్ధం చేశారు. ఇంతలోనే పోలీసులకు సమాచారం అందడంతో డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. భాస్కర్‌తో పాటు మరో 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, బొలెరో వాహనం, గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యథేచ్ఛగా దోపిడీ

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో ఇనుప ఖనిజం తవ్వకాలను 2011 సంవత్సరంలో నిలిపేశారు. ఆ సమయంలో సీబీఐ సుమారు 8 లక్షల టన్నుల ఇనుప ఖనిజం, తవ్వకానికి వినియోగించిన జేసీబీలు, ఇటాచీలు, లారీలు, టిప్పర్లు, ఇతర వాహనాలను సీజ్ చేసింది. విలువైన ఇనుప ఖనిజంతో పాటు వాహనాలపై అక్రమార్కుల కన్ను పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొందరు బరి తెగించారు. ఇటీవల ఓఎంసీలోకి చొరబడి రాత్రివేళల్లో ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించారు. అంతటితో ఆగకుండా వాహనాల్లోని విలువైన సామగ్రిని పట్టపగలే దొంగలించేందుకు సిద్ధమై పోలీసులకు పట్టుబడ్డారు.

కదం తొక్కిన జూడాలు

కోల్‌కతా వైద్యవిద్యార్థిని హంతకుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్



ఒంగోలులో జూనియర్ డాక్టర్ల క్యాండిల్ ర్యాలీ



తిరుపతిలో ధర్నాచేస్తున్న రుయా, స్విమ్స్ డాక్టర్లు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జూనియర్ డాక్టర్లు ఆందోళన చేశారు. పలుచోట్ల విధులు బహిష్కరించారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి, హత్యపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలు, ప్రదర్శనలు, మానవహారాలు, రాస్తారోకోలు నిర్వహించారు. హత్యకు గురైన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలంటూ కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణను సత్వరం పూర్తిచేసి దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో వైద్య సంఘాలు, వైద్య సిబ్బంది, విద్యార్థి యూనియన్లు, ఇతర స్వచ్ఛంద సంస్థల వారు పాల్గొన్నారు. కర్నూలులో జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేసి, ర్యాలీగా మెడికల్ కాలేజీలోని ధర్నా శిబిరానికి చేరుకున్నారు. చిత్తూరులోని జిల్లా ఆస్పత్రిలో పీజీ డాక్టర్లు అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చి ఓపీ సేవల్ని బంద్ చేశారు. అనంతరం ధర్నా నిర్వహించారు. విజయవాడలో నిర్వహించిన ఆందోళనలో సిద్ధార్థ, నిమ్రా, పిన్నమనేని సిద్ధార్థ, ఎన్ఆర్ఐ, ఎయిమ్స్ మంగళగిరి వైద్య కళాశాలల జూనియర్ వైద్యులు, అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ డెంటల్ అసోసియేషన్, మెడికల్ రిప్స్ అసోసియేషన్, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ వంటి సంఘాల నుంచి పెద్ద ఎత్తున వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. మరణించిన వైద్యురాలి ఆత్మకు శాంతికలగాలంటూ కొవ్వొత్తులతో ఎంజీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై జరుగుతున్న దాడులపై స్కిట్స్ ప్రదర్శించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర వైద్యసేవలను, క్యాజువాలిటీ, లేబర్‌రూమ్, ఐసీయూల్లో విధులను బహిష్కరించారు. దీంతో అత్యవసర కేసులను మాత్రమే చేర్చుకున్నారు. నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న పెద్దాస్పత్రిలో జూనియర్ డాక్టర్లు వైద్యసేవలను నిలిపేశారు. రెండోరోజు శుక్రవారం కూడా జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి ప్రాంతంలో ర్యాలీ నిర్వహించి ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేశారు. రాత్రి మరోసారి జీటీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కడపలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. తిరుపతిలోని రుయా, స్విమ్స్ వైద్యులు నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఒంగోలులో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన జూనియర్ వైద్యులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.


యుద్ధకళ నేర్చుకున్న మను భాకర్

కత్తిలాంటి చూపు కోసం...

యుద్ధంలో గెలవాలంటే దేహం ఒక ఆయుధంగా మారాలి దృష్టి, ఆలోచన ఆయుధంగా మారాలి. పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మను భాకర్ గురి నిలవడానికి ప్రత్యర్థులను గెలవడానికి 'థాంగ్ తా'ను నేర్చుకుంది. కేరళ కలరిపట్టులాగా మణిపూర్‌కు చెందిన ఈ యుద్ధకళ మనసును లగ్నం చేసి దేహాన్ని ఉద్యుక్తం చేయడంతో సాయం చేస్తుంది.


థాంగ్ తా



'ఒలింపిక్స్‌లో పతకం సాధించడం పెద్ద లక్ష్యం. ఇందుకోసం అన్ని విధాలా సిద్ధం కావాలి. ఇది ఎవరి మీదో ఆధారపడే విషయం కాదు. మనల్ని మనమే తీర్చిదిద్దుకోవాలి. నేను స్త్రీని కాబట్టి పేలవమైన ప్రదర్శన చేసినా సాకులు చెప్పొచ్చులే అనుకోకూడదు. అందుకే నేను షూటర్‌గా గట్టిగా నిలవడానికి అన్నివిధాలా జాగ్రత్తలు తీసుకున్నాను. అందులో థాంగ్ తా నేర్చుకోవడం ఒకటి' అంది మను భాకర్.

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున పతకం సాధించిన తొలి మహిళా షూటర్‌గా, ఒకే సీజన్‌లో రెండు పతకాలు సాధించిన మహిళా షూటర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. అయితే గెలుపు అంత సులభంగా రాదు. ప్రపంచ వేదికపై ప్రత్యర్థులతో తలపడాలంటే ఎంతో ఆందోళన ఉంటుంది. ప్రాక్టీస్‌లో, వేదిక బయట ఎంత గొప్పగా రాణించినా సరిగ్గా నిర్దిష్ట క్షణంలో తొణకక బెణకక పోటీ పడినప్పుడే గెలుపు సాధ్యం. ఇందుకు కఠోర సాధన అవసరం.

యోగా, గుర్రపు స్వారీ, థాంగ్ తా

షూటర్‌గా రాణించడానికి శరీరం, మనసు రాటుదేలి ఉండేందుకు మను భాకర్ సంవత్సరాల తరబడి శారీరక, మానసిక శ్రమ చేసింది.యోగాతో మనసుకు శిక్షణ ఇస్తే గుర్రపు స్వారీతో శరీరంలో చురుకుదనం తెచ్చుకుంది. గురి వైపు తుపాకీ పేల్చడం అంటే గుర్రాన్ని లక్ష్యం వైపు ఉరకెత్తించడమే. ప్రాణం ఉన్న అశ్వాన్ని అదుపులోకి తెచ్చుకుంటే ప్రాణం లేని తుపాకీ అదుపులోకి వస్తుంది. అయితే ఇవి మాత్రమే చాలవు అనుకుంది మను భాకర్. అందుకే థాంగ్ తా నేర్చుకుంది.

గురువుకు లోబడి

మను భాకర్ కోచ్ జస్పాల్ రాణ. మనలో ఎంత ప్రతిభ ఉన్నా గురు ముఖతా నేర్చుకున్నప్పుడే విజయం సిద్ధిస్తుంది. గురువు దగ్గర నేర్చుకోవాలంటే గురువు ఆధిపత్యాన్ని అంగీకరించాలి. చాలామంది శిష్యులు ఆ పని సంపూర్ణంగా చేయలేరు. 'థాంగ్ తా'లో మొదట నేర్పేది శిష్యుడు తన అహాన్ని వీడి గురువుకు లోబడటమే. కత్తి, బల్లెం, డాలు ఉపయోగించి నేర్పే ఈ యుద్ధకళలో గురువు చెప్పిందే వేదం అనుకునేలా ఉండాలి. క్రమశిక్షణ, నిజాయితీ, గౌరవం ఈ కళలో ముఖ్యం. షూటింగ్ సాధనలో గురువు దగ్గర క్రమశిక్షణ తో, నిజాయితీతో, నేర్పే విద్యను గౌరవిస్తూ నేర్చుకోవడంలో మను భాకర్‌కు థాంగ్ తా ఉపయోగపడింది.

తెగలను కాపాడుకునేందుకు...

మణిపూర్ తెగల యుద్ధకళ 'హ్యుయెన్ లల్లాంగ్'. ఇందులో కత్తి, బరిసెలతో చేసేది థాంగ్ తా. ఆయుధాలు లేకుండా చేసేది సరిత్ సరక్. బయట తెగలు వచ్చి స్వీయ తెగలను రూపుమాపకుండా ఉండేందుకు పూర్వం మణిపూర్‌లో ప్రతి ఒక్క పురుషుడు థాంగ్ తాను నేర్చుకుని సిద్ధంగా ఉండేవాడు. స్త్రీలు కూడా నేర్చుకునేవారు. ప్రస్తుతం ఇది జాతీయ స్థాయి క్రీడగా మారింది. చెక్క కత్తి, డాలుతో ఈ యుద్ధక్రీడను సాధన చేస్తున్నారు. భవిష్యత్తులో దీనిని ఒలింపిక్స్ కమిటీ గుర్తిస్తుందనే ఆశ ఉంది. 'ఎంత వీరులైతే అంత వినమ్రులవుతారు ఈ యుద్ధ కళలో' అంటారు మణిపూర్ గురువులు. మను భాకర్ గెలవడానికి ఆమెలోని వినమ్రత కూడా ఒక కారణం కావచ్చు.

మంచి ఆలోచన

గోడకు మొలిచిన పుస్తకాలు

రియల్ ఎస్టేట్ వాళ్లు ఏయే ఎమినిటీస్‌తో ఫ్లాట్లు కడతారో చెబుతుంటారు... క్లబ్‌హౌస్, స్విమింగ్‌పూల్... ఇంకా ఏమిటేమిటో. కాని దానిలో లైబ్రరీ ఉంటుందా? పుస్తకాలు ఉంటాయా? పుస్తకాలు లేని ఇళ్లు సరైన ఇళ్లేనా? 'చెన్నైలో కొన్ని అపార్ట్‌మెంట్లకు ప్రయివేట్ లైబ్రరీలు ఉన్నాయి. ఇది చాలా మంచి విషయం. కాని కాలనీల్లో అలాంటి వీలు లేని ఇళ్లు, వాటిలో నివసించే పిల్లలు పుస్తకాలు చదవాలంటే ఎలా? అందుకే నాకు చేతనైనట్టుగా ఫ్రీ లైబ్రరీ తెరిచాను. ఇక్కడ నుంచి పుస్తకాలు తీసుకోవచ్చు... పుస్తకాలు ఇవ్వొచ్చు' అంటాడు 55 ఏళ్ల జయకుమార్.

చెన్నైలోని అన్నై ఇందిరానగర్‌లో నివసించే ఈ పుస్తక ప్రేమికుడు గతంలో బాగా వెలిగి ఇప్పుడు పలుచబడిన 'లిటిల్ ఫ్రీ లైబ్రరీస్' (ఎల్.ఎఫ్.ఎల్) ఉద్యమానికి నడుం బిగించాడు. తన ఇంటి గోడకు చిన్న అల్మారా బిగించి అందులో పుస్తకాలు ఉంచాడు. 'పుస్తకాలు మనుషుల్ని దగ్గర చేస్తాయి. ఈ పెట్టె బిగించినప్పటి నుంచి స్కూలు, కాలేజీ కుర్రాళ్లు ఆసక్తిగా వీటిని తీసి చూడటం గమనిస్తున్నాను. వాళ్లే కదా పుస్తకాలు చదవాలి' అంటాడు జయకుమార్. 'పుస్తకాలు అద్దెకిచ్చే లైబ్రరీలు ఇప్పుడు లేవు అంకుల్' అని ఆ కుర్రాళ్లు నాతో అన్నారు అంటాడు బాధగా. అయితే ఇలా ఫ్రీ లైబ్రరీ లు గోడకు బిగించి వదిలి



పెట్టడం అంత సులువా? 'చాలా రోజుల వరకు పుస్తకాలు ఎవరూ తాకలేదు. కాని ఇటీవల రాత్రి ఒంటి గంటకు ఒక ఆటో వచ్చి షెల్ఫ్‌లోని 22 పుస్తకాలను దొంగిలించుకుని వెళ్లింది. ఇది నేను సిసి టీవీలో చూశాను. చాలా బాధపడ్డాను. అయితే ఇది తెలిసిన కాలనీ వాళ్లు డొనేషన్లు ఇచ్చారు. ఆశ్చర్యంగా ఒక వ్యక్తి చాలా పెట్టెల పుస్తకాలు తెచ్చి డొనేట్ చేశాడు. అంటే జనం కోసం పెట్టిన ఈ చిన్ని లైబ్రరీ ఎప్పుడూ ఖాళీగా ఉండదన్నమాట' అని చిరునవ్వు నవ్వాడు జయకుమార్. సెల్‌ఫోన్లకు బానిసలు గా మారి, రీల్స్ పిచ్చిలో ప్రాణాలు తీసుకుంటున్న ఈనాటి యువతను మేల్కొలపడానికి చిన్నదైతేనేం ప్రతి గోడకు ఇలా బుజ్జి లైబ్రరీని బిగిస్తే ఈ దేశ మేధో వికాసం మరింత పరిమళిస్తుంది కదా. ఆలోచించేదీ అమలు చేసేదీ ఎందరు?

కోల్‌కతా నిరసన



ఒక్క పిలుపు ఇవ్వగానే వేలాదిమంది మహిళలు అర్ధరాత్రి వేళ వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆమె ప్రఖ్యాత ఉద్యమ నాయకురాలు, రాజకీయ నాయకురాలు కాదు. సాధారణ మహిళ. కోల్‌కత్తాలోని జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై 29 ఏళ్ల రిమ్‌జిమ్ సిన్హా ఫేస్ బుక్ పోస్ట్ వైరల్ కావడమే కాదు అర్ధరాత్రి వేళలో ఉద్యమ స్వరమై ప్రతిధ్వనించింది...

చీకట్లో ఉరిమిన చిరు స్వరం

కోల్‌కత్తా, ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణ హత్యాచార ఘటనను నిరసిస్తూ పశ్చిమబెంగాల్‌తో పాటు ఎన్నో రాష్ట్రాలలో ఎంతోమంది మహిళలు ఆగస్ట్ 14 అర్ధరాత్రి వీధుల్లోకి వచ్చారు. 'రీక్లెయిమ్ ది నైట్: ది నైట్ ఈజ్ అవర్' కాప్షన్‌తో రిమ్‌జిమ్ సిన్హా ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్ సంచలనంగా మారింది. అర్ధరాత్రి వేళ మహిళలు వీధుల్లోకి వచ్చి నిరసన గళం వినిపించేలా చేసింది.

'మహిళల కొత్త స్వాతంత్ర్య పోరాటం'గా 'రీక్లెయిమ్ ది నైట్' క్యాంపెయిన్‌ను అభివర్ణించింది రిమ్‌జిమ్ సిన్హా. రీక్లెయిమ్ ది నైట్' చిహ్నమైన నెలవంక పట్టుకున్న ఎర్ర చేతి పోస్టర్ వైరల్ అయింది.

రిమ్‌జిమ్ సిన్హా కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సోషల్‌సైన్స్ రిసెర్చర్. జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన నన్ను బాధ పెట్టడమే కాదు అభద్రతాభావానికి గురి చేసింది. నగరాల్లో మహిళలు ఎంత సురక్షితంగా ఉన్నారు? అని ఆలోచిస్తేనే భయంగా ఉంది. వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు కోరుతూ ఆగస్ట్ 14 అర్ధరాత్రి నిరసన ప్రదర్శన చేయాలనుకున్నాను. రాత్రిపూట బయటకు వెళ్లే హక్కు మహిళలకు ఎందుకులేదు?' అంటున్న రిమ్‌జిమ్ సిన్హా సోషల్ మీడియా వేదికగా ఎంతో మంది మహిళలను ఐక్యం చేసింది.

మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలపై రిమ్‌జిమ్ సిన్హా మండిపడింది. 'జూనియర్ డాక్టర్ ఒంటరిగా సెమినార్ హాల్‌కు ఎందుకు వెళ్లింది?' అని ఆయన ప్రశ్నించాడు.


'బాధితురాలిపై నిందలు మోపే కుసంస్కారాన్ని అంగీకరించబోము. రాత్రివేళ బయట ఎవరు ఉండాలో, ఎవరు ఉండకూడదో నిర్ణయించే అధికారం ఎవరికీ లేదు' అంటుంది సిన్హా. తన పిలుపు సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని, దేశవ్యాప్తంగా వేలాది మంది అర్ధరాత్రి వేళ వీధుల్లోకి వస్తారని ఆమె ఊహించలేదు.

'వందమంది వరకు వస్తారనుకున్నాను. ఒక వేళ ఎవరూ రాకుంటే నేను ఒక్కదానినే బయటికి రావాలనుకున్నాను. ఇంతమంది మహిళలు అర్ధరాత్రి ఇల్లు దాటి బయటికి వస్తారని నేను ఊహించలేదు. వారి స్పందన నాకు సంతృప్తిని ఇచ్చింది' అంటుంది సిన్హా. రిమ్‌జిమ్ సిన్హా పేరు సంచలనం కావడం మాట ఎలా ఉన్నా ఎంతోమంది రాజకీయ నాయకులకు టార్గెట్‌గా మారింది. 'రీక్లయిమ్ ది నైట్' ఉద్యమ చిహ్నానికి రకరకాలుగా భాష్యం చెబుతూ విమర్శిస్తున్నవారు కూడా ఉన్నారు.

'అర్ధరాత్రిపూట బయటకు వస్తున్నారు. మీకేమైనా అయితే పూచీ మాది కాదు' అంటున్న రాజకీయ నాయకులు ఉన్నారు.

జాదవ్‌పూర్‌లోని 8బీ బస్‌స్టాండ్‌కు దగ్గర జరిగిన సభకు హాజరమైన రిమ్‌జిమ్ సిన్హా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన గురించి మాత్రమే కాదు రాత్రివేళలో మహిళలకు ఎదురయ్యే ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు, పని ప్రదేశంలో మహిళలకు సెపరేట్ టాయిలెట్‌లు, బడులలో లింగ సమానత్వంపై పాఠ్యాంశాలు, రాత్రి విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులకు సురక్షితమై విశ్రాంతి గదులు... మొదలైన వాటి గురించి మాట్లాడింది. 'రీక్లయిమ్ ది నైట్: ది నైట్ ఈజ్ అవర్స్'ను దృష్టిలో పెట్టుకొని 'ఇది మహిళల కొత్త స్వాతంత్ర్య పోరాటం' అంటున్న రిమ్‌జిమ్ సిన్హా ఆ పోరాటానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

యంగ్ రైటర్స్... కథలు రాస్తారా?



కొత్త తరం నుంచి కొత్త ఆలోచనలు పుడతాయి. కొత్త సాహిత్యం వస్తుంది. కొత్త కథావస్తువులు మిలమిలమని మెరుస్తాయి. అందుకే కథలు రాయాలనుకుంటున్న నేటి తరానికి వేదిక పరవాలనుకుంటోంది సాక్షి. 30 ఏళ్ల లోపు యువ రచయితల కోసం 'సాక్షి ఫన్‌డే'లో 'యువ కథ' శీర్షిక ప్రారంభించనుంది. 'సాక్షి ఫన్‌డే' మేగజీన్‌లో ఒకటి లేదా రెండు పేజీల నిడివి వచ్చేలా కథలు రాసి పంపండి. అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తాం. ఒక్క కథ జీవితాంతం మీకో మంచి సాంగత్యం కాగలదు. గుర్తింపు మార్గం ఇవ్వగలదు. ప్రయత్నించండి.

మా చిరునామా: యువ కథ, సాక్షి ఫన్ డే, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34.
ఈమెయిల్: funday.kathalu@gmail.com

బ్యూటిప్స్ — పెసర పిండితో చర్మకాంతి

- టీ స్పూన్ పెసరపిండిలో పచ్చిపాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడిచర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.
- పెసరపిండిలో కొద్దిగా పెరుగు, కొబ్బరి నూనె కలిపి చేతులకు రాయాలి. మృదువుగా రబ్ చేసి, పది నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పెసరపిండి, పెరుగు, కొబ్బరి నూనెలో ఉండే గుణాలు చర్మాన్ని మృదువుగా మారుస్తాయి.

- ఆమె కండక్టర్
- అతను హోంగార్డ్

బతుకు బండికి భరోసా!

ఆమె చేస్తున్నది టీజీఎస్ ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం. ఆమె భర్త హోంగార్డు.. వారిది దిగువ మధ్య తరగతి కుటుంబం.. అయితేనేం, థలసీమియా వ్యాధి బారిన పడిన చిన్నారులకు చేతనైన మేరకు అండదండలు అందించాలన్న సంకల్పానికి ఇవేమీ అడ్డంకి కాలేదు. తన సమీప బంధువు కుమారులు థలసీమియాతో చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు పడిన వేదనను చూసి చలించి పోయింది. అప్పుడే ఆమె థలసీమియా బాధితులకు చేతనైన సేవ చేయాలని సంకల్పించింది. ఆమె సంకల్ప బలం ముందు తనకు వచ్చే ఆదాయం ఎంత..? తాను ఎలా సాయపడగలననే ఆలోచనలు చిన్నవే అయ్యాయి.

రక్త సంబంధాలు


సంకల్ప తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకుంటున్న చిన్నారులు

ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న ప్రొద్దుటూరి అనిత ఖమ్మం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త రవిచందర్ సీపీ కార్యాలయంలో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వారి బంధువుల పిల్లలిద్దరూ థలసీమియాతో బాధపడుతూ మృతిచెందారు. ఆ బాలల తల్లిదండ్రులు పడిన వేదనను దగ్గర నుంచి చూసిన అనిత అలాంటి చిన్నారుల కోసం ఏదైనా చేయాలని సంకల్పించారు. గతంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించే స్వచ్ఛంద సంస్థలో పని చేసిన అనుభవంతో రక్త సేకరణపై దృష్టి పెట్టారు. ఆమె నిర్ణయానికి కుటుంబం మద్దతుగా నిలిచింది.

స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం...

థలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు హైదరాబాద్ వెళ్లి రక్తం ఎక్కించాల్సిన పరిస్థితులు. దీంతో గతంలో అనిత పనిచేసిన ఎన్జీవో ద్వారా సేవ చేద్దామని చూసినా.. వీలు కాకపోవడంతో వ్యక్తిగత దాతల నుంచి రక్తదానం చేయించడం ద్వారా పిల్లలకు రక్తం ఎక్కించేవారు. ఆ తర్వాత 2010లో 'సంకల్ప స్వచ్ఛంద సంస్థ' పేరుతో రిజిస్టర్ చేశారు. తొలుత 25 మందికి ఈ సంస్థ ద్వారా రక్తం ఎక్కించడం ప్రారంభించారు. హైదరాబాద్ వెళ్లి రక్తం ఎక్కించుకోవడం చాలా వ్యయ ప్రయాసలతో కూడిన పని కావడంతో ఇక్కడ సంఖ్య పెరిగింది. దీంతో రక్తదాతల కోసం కాలేజీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రక్తదాతల భాగస్వామ్యంతో ఇప్పుడు 'సంకల్ప' ద్వారా 220 మందికి రక్తం అందుతోంది. ఇక్కడ చికిత్సతో పాటు మందులు కూడా ఉచితమే. 2009 నుంచి ఇప్పటివరకు 500కు పైగా బ్లడ్ క్యాంపులతోపాటు వ్యక్తిగత దాతల నుంచి 15 వేల లీటర్లకు పైగా రక్తాన్ని సేకరించి చిన్నారులకు అందజేశారు.

'కరోనా' కాలంలోనూ...

కరోనా కష్ట కాలంలోనూ థలసీమియా చిన్నారులకు రక్తం ఎక్కించే ప్రక్రియ నిరాటంకంగా సాగింది. అనిత చేస్తున్న సేవతో స్ఫూర్తి పొందిన అనేకమంది బయటకు రావడానికే భయపడుతున్న ఆ సమయంలోనూ ఆ చిన్నారుల కోసం రక్తదానం చేశారు.

సంస్థ ఆధ్వర్యంలో అవగాహన...

థలసీమియా అనేది నివారించదగిన వ్యాధి. అలాగే వంశపారంపర్యంగా వస్తుంది. పెళ్లికి ముందు హెచ్‌బీఏ -2 (ఎలక్ట్రో ఫోర్సెస్) పరీక్ష చేయించుకుంటే థలసీమియా వ్యాధితో పుట్టే పిల్లలు లేకుండా చేసుకోవచ్చు. అయితే ప్రభుత్వాలు కూడా పోలియో, ఎయిడ్స్‌పై ప్రచారం చేసినట్లుగా థలసీమియా పరీక్షలపై అవగాహన కల్పించడం లేదు. ఈ క్రమంలో సంకల్ప స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 7,500 మంది డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. థలసీమియాపై అవగాహన కల్పించేలా ప్రతి ఏడాది ర్యాలీ నిర్వహిస్తున్నారు.

బోన్‌మ్యారో ఆపరేషన్లపై దృష్టి...

థలసీమియా రహితం కావాలంటే బోన్ మ్యారో ఆపరేషన్ ఒక్కటే మార్గం. ఇది సామాన్యులకు సాధ్యపడేది కాదు. అయితే చిన్నారులకు ఈ ఆపరేషన్లు చేయించడం పై దృష్టి పెట్టింది సంకల్ప. నామమాత్రపు ధరలతో ఆపరేషన్ జరిగేలా సంస్థ చర్యలు తీసుకుంటోంది. ఈ సంస్థ ప్రారంభించిన తర్వాత రక్తం అందక చనిపోయిన వారు లేరంటే సంస్థ సంకల్ప బలం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.

- బొల్లం శ్రీనివాస్, సాక్షి, ఖమ్మం

ఓ కుటుంబంలో తలసేమియాతో ఉన్న పిల్లలు పుట్టారంటే వారిని ఎలా కాపాడుకోవాలన్నది బాధ చెప్పలేనిది. ఆ నరకం నుంచి తల్లిదండ్రులు బయటపడాలనేది మా సంకల్పం. ప్రస్తుతం ఇది నిర్విఘ్నంగా సాగుతోందంటే దాతల వల్లనే సాధ్యమవుతోంది. నేను కండక్టర్‌గా బస్సులో ఏ గ్రామానికి వెళ్లినా అక్కడ బస్సు ఎక్కే యువకులకు థలసీమియా గురించి చెప్పి.. రక్తదానం చేయమని కోరేదాన్ని. దాంతో కండక్టర్‌గా నేను ఆ బస్సుకి వస్తే.. నన్ను చూసి భయపడి బస్సు ఎక్కే వాళ్లు కాదు. కొంతకాలం తర్వాత రక్తదానంతో తాము ఒకరికి ప్రాణం పోస్తున్నామని యువకులకు అర్థమైంది. ఇలా మొదలైన ప్రస్థానం యువకుల రక్తదానంతో ముందుకు సాగుతోంది. థలసీమియాతో బాధపడుతున్న పిల్లలకు ప్రభుత్వం పింఛన్ ఇస్తే వారికి ఉపయోగపడుతుంది.

కడుపు కోత తప్పించాలనే...


అనిత, రవిచందర్

- ప్రొద్దుటూరు అనిత, సంకల్ప స్వచ్ఛంద సంస్థ, ఖమ్మం

రిపోర్ట్

తాజాగా కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన పాశవిక హత్యాచార ఉదంతం... దానిని ఖండిస్తూ జరుగుతున్న నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నప్పటికీ నిజానికి పని ప్రదేశంలో లైంగిక వేధింపులు అనేవి

వర్క్‌ప్లేస్‌లో పెరుగుతున్న లైంగిక వేధింపులు

కొత్తేమీ కాదు. పని ప్రదేశాలలో ప్రతి ఏటా మన దేశంలో 400కు పైగా లైంగిక వేధింపుల కేసులు నమోదవుతున్నట్లు బిజినెస్ స్టాండర్డ్ పత్రిక తెలియజేసింది. నేషనల్ క్రైమ్ రిపోర్ట్స్ బ్యూరో నివేదికను అనుసరించి ఏటా సగటున 445 కేసులు, నెలకు 35 చొప్పున లైంగిక వేధింపుల కేసులు నమోదవుతున్నాయి. అంటే పని ప్రదేశంలో కనీసం రోజుకు ఒక లైంగిక వేధింపుల కేసు నమోదవుతోందన్నమాట.

వీటిలో హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధికంగా 97 కేసులు నమోదయితే, కేరళలో 83, మహారాష్ట్రలో 46 కేసులు, కర్ణాటకలో 43 కేసులూ నమోదయ్యాయి. ఈ గణాంకాలన్నీ అధికారికమైనవీ, అందులోనూ 2022 వరకు మాత్రమే నమోదయినవే. అయితే ఆ తర్వాత నుంచి అనధికారికంగా నమోదైన, నమోదవుతున్న లైంగిక వేధింపుల కేసులు అంతకు రెండింతల కన్నా ఎక్కువే ఉండటం గమనార్హం.

2022-23లో 1160 లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. ఇది గత దశాబ్దిలోకెల్లా అతి పెద్ద సంఖ్య. ఇవి సుమారు 300 కంపెనీల నుంచి అందిన గణాంకాలు మాత్రమే.

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం మహిళలను రక్షించడం, లైంగిక వేధింపులను అడ్రస్ చేసే విధానాలను అందించడం కోసం సుమారు ఒక దశాబ్దం క్రితం రూపుదిద్దుకుంది.

ఫస్ట్ టైమ్


సాధనా సక్సేనా నాయర్

ఆర్మీ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా తొలి మహిళ

భారత సాయుధ దళాల జనరల్ హాస్పిటల్ సర్వీసెస్ డైరెక్టర్‌గా లెఫ్టినెంట్ జనరల్ సాధనా సక్సేనా నాయర్ నియమితులయ్యారు. మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులైన తొలి మహిళగానూ ఆమె వార్తల్లో నిలిచారు. వెస్టన్ ఎయిర్ కమాండ్‌కి ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన మొదటి మహిళగా కూడా.

సాధనా సక్సేనా పుణెలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ నుంచి విశిష్ట విద్యా రికార్డుతో డిగ్రీ పొందింది. ఫ్యామిలీ మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, తల్లి-పిల్లల ఆరోగ్యంలో డిప్లొమాలతో సహా వివిధ విద్యా అర్హతలు సాధించిన సాధన సక్సేనా న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో మెడికల్ ఇన్ఫర్మేటిక్స్‌లో రెండు సంవత్సరాల శిక్షణా కార్యక్రమం పూర్తి చేసింది. 1985లో ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో చేరిన సాధనా స్విట్జర్లాండ్‌లోని స్పీజ్‌లో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్, మిలిటరీ మెడికల్ ఎథిక్స్‌తో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ వార్‌ఫేర్‌లో శిక్షణ పొందింది. లెఫ్టినెంట్ జనరల్ నాయర్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) 2019లోని మెడికల్ ఎడ్యుకేషన్ కాంపోనెంట్‌లో కొంత భాగాన్ని రూపొందించడానికి ప్రతిష్టాత్మకమైన డాక్టర్ కస్తూరి రంగన్ కమిటీకి నిపుణులైన సభ్యురాలిగా నామినేట్ చేయబడింది. మెరిటోరియస్ సర్వీస్ కోసం వెస్టన్ ఎయిర్ కమాండ్, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ బాధ్యతలు నిర్వహించింది. భారత రాష్ట్రపతిచే విశిష్ట సేవా పతకం పొందింది. ఆమె కుటుంబంలోని మూడు తరాల వారూ గత ఏడు దశాబ్దాలుగా సాయుధ దళాలలో పని చేశారు.

ఫ్రూట్‌ఫుల్‌గా తినండి

‘మధ్య వయసులో పండ్లు ఎక్కువగా తిన్న వారికి వార్ధక్యంలో డిప్రెషన్ రాదు. మంచి ఆరోగ్యం కోసం రోజుకు మూడు లేదా నాలుగు సార్లు పండ్లు లేదా పండ్లతో కూడిన ఆహారం తీసుకోవాలి’ ఇది ‘ద జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్, హెల్త్ అండ్ ఏజింగ్’ నిర్వహించిన అధ్యయనం. ఇరవై ఏళ్ల పాటు 14 వేల మంది మీద నిర్వహించిన సుదీర్ఘ అధ్యయనం వెల్లడించిన వాస్తవం ఇది.

ఈ అధ్యయనం సింగపూర్‌లో 1993 – 98ల మధ్య అనేక బ్యాచ్‌లుగా మొదలై 2014 నుంచి 2016 వరకు సాగింది. 52 ఏళ్ల వయసు వారితో మొదలైంది. స్టడీ పూర్తయ్యే నాటికి వారి వయసు 72కు చేరింది. రోజుకు మూడు దఫాలు పండ్లు లేదా పండ్ల ఆధారిత ఆహారాలు తీసుకుంటున్న వారితో పోలిస్తే ఒకసారి కూడా క్రమం తప్పకుండా పండ్లు తీసుకోని వారిలో జీరియాట్రిక్ డిప్రెషన్ (వార్ధక్య మాంద్యం) ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వార్ధక్య మాంద్యాన్ని దూరంగా ఉంచడానికి దోహదం చేస్తున్న పండ్లలో ఆరెంజ్, టాంజేరిన్, బొప్పాయి, అరటిపండ్లు, పుచ్చకాయలు ప్రధానంగా ఉన్నాయి. ఈ స్టడీ సింగపూర్‌లో దొరికే పండ్లు, సింగపూర్‌లో నివసించే వారి ఆధారంగా సాగింది. కాబట్టి తమ దేశానికి, వాతావరణానికి నూటికి నూరుశాతం వర్తించడం కష్టమని పాశ్చాత్య దేశాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ స్టడీ మనదేశానికి మాత్రం వర్తిస్తుంది.

స్థూలంగా అధ్యయనం ఏం చెబుతోందంటే... నలభై- యాభైల నుంచి క్రమం తప్పకుండా పండ్లు తింటే మానసిక ఆరోగ్యం బాగుంటుంది. తాజా పండ్లు, ఫ్రోజెన్ ఫ్రూట్స్, సోలార్ డ్రైడ్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్, పండ్లతో చేసిన స్మూతీలు, సలాడ్‌లు, కస్టర్డ్, ఫ్రూట్ కేసరి... ఇలా ఏదో ఒక రూపంలో ఆహారంలో మూడు దఫాలు పండ్లు తీసుకోవడం మంచిది.



మనం తీసుకునే ఆహారం దేహానికి, మనసుకి మధ్య దూరాన్ని పెంచుతోంది. ఆ దూరాన్ని, ఆందోళన, ఒత్తిడి, మానసిక బాధలను తగ్గించడానికి మెడిటరేనియన్ డైట్ దోహదం చేస్తోందని ఒక అధ్యయనాన్ని ప్రకటించారు న్యూయార్క్ చెందిన పరిశోధకులు.

మెడిటరేనియన్ డైట్



పాశ్చాత్య శైలి ఆహారం– మెడిటరేనియన్ శైలి ఆహారం మధ్య జరిగిన తులనాత్మక అధ్యయనం ఇది. ప్రొఫెసర్ లినా బిగ్‌దాషే ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని బింఘంటన్ యూనివర్సిటీ పరిశోధకులు 1,591 మంది ఆహారపు అలవాట్లు, వారి మానసిక శారీరక ఆరోగ్యం మీద సర్వే నిర్వహించారు. ఆ ఫలితాలు ‘క్లోజ్ ఏ గ్యాప్’ పేరుతో న్యూట్రిషన్ అండ్ హెల్త్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మెడిటరేనియన్ డైట్‌లో పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, సీ ఫుడ్, ఆలివ్ ఆయిల్, బీన్స్ ప్రధానంగా ఉంటాయి. ఈ ఆహారం గుండెపోటు, గుండె వ్యాధులు, పక్షవాతాన్ని నివారిస్తుంది. మెడిటరేనియన్ ఫుడ్ దేహాన్ని తేలిగ్గా ఉంచడంతోపాటు మానసిక ఒత్తిడి, మానసిక బాధ తగ్గిస్తుంటే వెస్టర్న్ డైట్‌లో హైగ్లైసిమిక్ స్వభావం, ప్రాసెస్ చేసిన చక్కెరలు ఎక్కువ. ఇవి ఒత్తిడి పెరగడానికి కారణమవుతాయి. ఒత్తిడి అనేది మానసిక బాధలకు ముఖద్వారం వంటిది. అలాగే మాంసం ప్రధానంగా ఉండే ఆహారం నుంచి మనసు నెగెటివ్ స్వభావాన్ని గ్రహిస్తుంది. మెడిటరేనియన్ ఆహారం మెంటల్ అండ్ ఫిజికల్ హెల్త్‌ను పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మెంటల్ వెల్‌బీయింగ్‌కు దోహదం చేస్తుంది.

తిడితే మీరే చెడ్డవుతారు

పేరెంటింగ్

పిల్లలు మాట వినడం లేదు... చదవడం లేదు
ఫోన్ చూస్తున్నారు
ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు.
ఎంత తిట్టినా దారికి రావడం లేదు.
తల్లిదండ్రుల పరేషానీ ఇది.
పిల్లల్ని తిట్టే కొద్దీ వారి తప్పు ఎంతైనా
తల్లిదండ్రులను వారు
నెగెటివ్‌గా చూడటం మొదలెడతారు.
వారిచ్చే గౌరవం తగ్గుతూ పోతుంది.
పిల్లలిచ్చే గౌరవం తగ్గకుండా వారిని
దారికి ఎలా తీసుకురావాలి?



పిల్లలు మాట వినరు. ఎందుకు వినరంటే వాళ్లకు కొన్ని చెల్లుబాటు కావాలి. ఏది తినాలి, ఏ ఆట ఆడుకోవాలి, ఎప్పుడు స్కూల్ మానేయాలి, ఏ బట్టలు ధరించాలి, హోమ్‌వర్క్ ఎప్పుడు చేసుకోవాలి... ఇవన్నీ వాళ్ల దృష్టిలో తమ అధికారాన్ని తాము నిలబెట్టుకునే విషయాలు. పిల్లలు పిల్లలే అయినా వారూ అధికారం కోసం చూస్తారు. ఆ అధికారం నెరవేర్చుకునే క్రమాన్నే తల్లిదండ్రులు ‘మాట వినడం లేదు’ అని భావిస్తారు. అంతేకాదు పిల్లలకు ఇంట్లో తల్లిదండ్రుల నుంచి సరిగ్గా ప్రేమ అందకపోయినా, తోబుట్టువులతో ఘర్షణ ఉన్నా, తమను పట్టించుకునేవారు లేరనే ఫీలింగ్ కలిగినా వారు మొండికేస్తారు. సబబైన కారణాలను కూడా వ్యతిరేకిస్తారు. వారిని తిట్టేకొద్దీ తల్లిదండ్రులను మరింత విలన్లుగా భావిస్తూ వెళతారు. అందుకే తల్లిదండ్రులు తమ తరఫు నుంచి వారి తరఫు నుంచి కూడా ఆలోచించి విషయాలను దారికి తెచ్చుకోవాలి. ఏం చేయాలి?

సుదీర్ఘ ఉపన్యాసాలు వద్దు

తల్లిదండ్రులు కూడా మాట వినని పిల్లల్ని దొరికినప్పుడు ఇచ్చి పడేద్దాం అనుకుంటారు. పిల్లలు ఏదైనా తప్పో, పొరపాటో చేస్తే పాత చిట్టాపద్దులు తీసి సుదీర్ఘ క్లాసులు పీకుతారు. అస్సలు క్లాసులు పీక కూడని సమయమది. ‘ఈ పొరపాటు మళ్లీ జరక్కుండా చూసుకో’ అనే ఒక్కమాటతో ఆ సందర్భాన్ని వదిలి మళ్లీ ఆ పిల్లలు ప్లెజర్ మూడ్‌లో ఉన్నప్పుడు మెల్లగా వారు చేసిన తప్పును ఎనలైజ్ చేసి సలహాలు ఇవ్వాలి. ఇదే వారు వినే టైము. అది కాదు.

వారితోనే మాట్లాడండి: పిల్లలు దారికి రావాలంటే వారికి సుద్దులు చెప్పే సమయంలో తల్లిదండ్రులు టీవీ చూస్తూ, రెడీ అవుతూ, కూరగాయలు తరుగుతూ, ఫోన్ చూసుకుంటూ ఉంటే వారు వినరు. వారి పక్కన కూచోవాలి. వారిని నిలబెట్టి వారి ముందు మోకాళ్ల మీద కూచుని కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ మృదువుగా వారికి చెప్పాల్సింది చెప్తే మన తపన వారికి అర్థమవుతుంది. వింటారు. వాళ్లు కోరే బ్రేక్‌ఫాస్ట్ ఇవాళ పెట్టలేకపోతే రేపు పెడతామని చెప్పినా గొడవ ముగుస్తుంది.

వద్దు అనే మాట వద్దు: ఇంట్లో పరిగెత్తొద్దు, తమ్ముణ్ణి తాకొద్దు, ఫ్రిజ్ తెరవొద్దు, ఫోన్ చూడొద్దు... ఈ వద్దు అనే మాట పిల్లలను సగం మొండిగా మారుస్తుంది. ఎందుకు వద్దు అనిపిస్తుంది. ఈ వద్దును ఇంకోలా చెప్పాలి. ‘ఇప్పుడే ఇల్లు తుడిచాను. ఆరాక తిరుగు నాన్నా’, ‘తమ్ముడు చిరాగ్గా ఉన్నాడు. పాపం వాణ్ణి కాసేపు వదిలెయ్’, ‘ఫ్రిజ్‌ను ఊరికూరికే తెరిస్తే కూలింగ్ పోయి నీ చాక్లెట్లే పాడవుతాయి కన్నా’... ‘ఫోన్‌లో అంత ఇంటెరెస్టింగ్ ఏమున్నాయ్... క్రికెట్ కోసం పిలుస్తున్నారు చూడు’... ఇలా.

మెచ్చుకోలు

పిల్లల్ని మెచ్చుకుంటే డబ్బులు ఖర్చవుతాయన్నట్టు కొందరు తల్లిదండ్రులు ఉంటారు. ‘బాగా చేశావు’, ‘చక్కగా పని అందుకున్నావు’, ‘నువ్వు చాలా కన్సర్న్ ఉన్న పిల్లాడివి’, ‘అన్నీ అర్థం చేసుకునే అమ్మాయివి’... ఇలా మాట్లాడితే ఈ మెచ్చుకోలుకు కొనసాగింపుగా వారి తప్పుల్ని సరిదిద్దే మాటలు వారికి చెప్పొచ్చు. ప్రశంస లేకుండా విమర్శ మాత్రమే ఉండాలంటే ఎలా? అది కుదరదు పిల్లల విషయంలో.

తుఫానుకు ముందు సంకేతం: పిల్లలు మాట వినడం లేదనేది తుఫానుకు ముందు సంకేతం. వారికి ఏ సమస్య ఉంది, ఏ అలజడి ఉంది, అది చెప్పలేక ఇలా ప్రవర్తిస్తున్నారా... అనేది చూసుకోవాలి. స్కూల్ వాతావరణం, ఇంటి వాతావరణం, స్నేహితులు, ఇరుగు పొరుగు, బంధువులు, పరీక్షలు, మార్కులు... ఈ మొత్తం ఆవరణంలో వారు ఎక్కడ అవస్థ పడుతున్నారో తెలుసుకుని పరిష్కారం చూపితే ఈ మాట వినకపోవడం ఆటోమాటిక్‌గా పోతుంది. తల్లిదండ్రుల గౌరవం మిగులుతుంది.

లైఫ్@360

పళ్లు జివ్వు..?

కొంతమందికి వేడి కాఫీ, టీ తాగినప్పుడు లేదా చల్లని పానీయాలు తాగినప్పుడు, చల్ల గాలిలోనూ, బ్రష్ చేసేటప్పుడు, స్వీట్స్ తీసుకున్నప్పుడు పంటి నొప్పి వస్తుంది. ఈ సమస్యకి చెక్ పెట్టాలంటే కొన్ని ఇంటి చిట్కాలు ఫాలో అవ్వాలి. అవేంటో చూద్దామా...



గ్రీన్ టీ... గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ కార్డియోవాస్క్యులర్, క్యాన్సర్ సమస్యల్ని దూరం చేస్తాయి. అంతే కాకుండా గ్రీన్ టీ తీసుకోవడం వల్ల ఓరల్ హెల్త్ బాగుంటుంది. దంత సమస్యలు ఉన్నప్పుడు గ్రీన్ టీని రోజుకి రెండుసార్లు తాగడం మంచిది.

పసుపు... పసుపులోని కర్కుమిన్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి ఆయుర్వేదిక్ చికిత్సలు, జీర్ణ సమస్యలు, గాయాలని తగ్గించడంలో వాడతారు. దీనికోసం.. పచ్చి పసుపుకొమ్ముని పళ్లపై రుద్దాలి. లేదంటే..టీ స్పూన్ పసుపుని అర టీస్పూన్ ఉప్పు, అరటీస్పూన్, ఆవనూనెలో కలపాలి. దీనిని చిగుళ్లపై రాస్తే నొప్పి తగ్గుతుంది.

తేనె, గోరువెచ్చని నీరు... తేనెలో యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. దీనిని వాడడం వల్ల వల్ల నొప్పి, వాపు తగ్గుతాయి. దీనికోసం ముందుగా గోరువెచ్చని నీటిలో స్పూన్ పరిమాణంలో తేనె కలపండి. దీంతో పుక్కిలించండి.

పుక్కిలించడం... ఉప్పులో యాంటీ సెప్టిక్ గుణాలు ఉన్నాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్‌ని దూరం చేస్తుంది. దీంతో నొప్పు తగ్గుతుంది. అందుకోసం ఉప్పు నీటితో రోజుకి రెండుసార్లు పుక్కిలించాలి.

దీనికోసం... కొద్దిగా ఉప్పుని గ్లాసు గోరువెచ్చని నీటిలో వేయాలి. ఈ నీటిని నోటిలో పోసి 30 సెకన్ల పాటు ఉండాలి. తర్వాత నీటిని ఉమ్మేయాలి.

దీంతోపాటు... ఈ ఇంటి చిట్కాలన్నీ తాత్కాలిక ఉపశమనానికి మాత్రమే. వీటిని పాటిస్తున్నా, సమస్య తగ్గకపోతే డాక్టర్‌ని కలవాలి. సమస్య రాకుండా ఉండాలంటే.. ఓరల్ హైజీన్ సరిగ్గా ఉండాలి. దంతాలను, నోటిని చక్కగా శుభ్రం చేయాలి. సాఫ్ట్ టూత్ బ్రష్ వాడాలి. అసిడిటీని కలిగించే ఆహార పానీయాలను తగ్గించాలి. రెగ్యులర్‌గా డెంటల్ చెకప్స్ చేయించాలి.

ఇంటిప్

బట్టలు ఆరడం లేదా?



వర్షాకాలం వచ్చిందంటే చాలు.. బట్టలు ఆరడం పెద్దపని అని చెప్పొచ్చు. వాటిని నీరు లేకుండా ఎంత గట్టిగా పిండి ఆరేసినా అంత త్వరగా ఆరవు. అలాంటప్పుడు ఏం చేయాలంటే బట్టల్ని అన్నింటినీ ఒకేసారి ఆరబెట్టద్దు. కొన్ని బట్టలు ఉతికిన తర్వాత, అవి ఆరిన తర్వాత మరికొన్ని బట్టల్ని ఆరెయ్యాలి. దీంతో బట్టలు త్వరగా ఆరతాయి. అలాగే ఐరన్ చేయడం వల్ల కూడా బట్టల్ని ఈజీగా ఆరబెట్టుకోవచ్చు. దీనివల్ల బట్టలు పొడిగా అవుతాయి. అయితే, మరీ తడిబట్టలపై ట్రై చేయొద్దు. అలానే, ఒక టబ్‌లో పాత టవల్స్ వేసి, ఆరెయ్యాల్సిన బట్టలు వాటి మీద వేయండి. అందులోని నీరు టవల్ పీల్చుకుంటుంది. తర్వాత రెండింటిని ఆరెయ్యాలి.

సినిమా


పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి



● ‘బన్నీ’ వాసు

‘‘‘ఆయ్’ కో ప్రొడ్యూసర్స్ రియాజ్, భాను నాకు మంచి మిత్రులు. వాళ్లు చెప్పడంతో అంజి చెప్పిన ‘ఆయ్’ కథ వింటూ రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్వాను. ప్రేక్షకులతో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నా ముందు సీట్‌లో ఉన్న ఓ వ్యక్తి నవ్వలేక లేచి నిలబడ్డాడు. నేను కథ విన్నప్పుడు ఎలాగైతే ఎంజాయ్ చేశానో దాన్ని స్క్రీన్‌పై చూసి ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారని అప్పుడు అర్థమైంది’’ అని నిర్మాత ‘బన్నీ’ వాసు అన్నారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా అంజి కె. మణిపుత్ర దర్శకత్వం వహించిన చిత్రం ‘ఆయ్’. అల్లు అరవింద్ సమర్పణలో ‘బన్నీ’ వాసు, విద్యా కొప్పినీడు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం ‘బన్నీ’ వాసు మీడియాతో మాట్లాడుతూ– ‘‘‘ఆయ్’లోని వినోదానికి దర్శకుడు భావోద్వేగాలను కలపడంతో మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యింది. ఈ చిత్రానికి వస్తోన్న స్పందన చూసి పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. ‘ఆయ్’ షోలు పెంచేందుకు చర్చలు జరుగుతున్నాయి’’ అన్నారు.

ప్రేక్షకుల అభిరుచిని నమ్ముతాను



● కేఈ జ్ఞానవేల్ రాజా

‘‘‘తంగలాన్’ సినిమాకు తెలుగులో మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. మేము అనుకున్నదానికంటే రెట్టింపు వసూళ్లు వస్తుండటంతో ఆశ్చర్యపోతున్నాం. విక్రమ్‌గారి కెరీర్‌లో ‘తంగలాన్’ చిత్రానివే హయ్యెస్ట్ ఓపెనింగ్స్’’ అని నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా అన్నారు. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వం వహించిన చిత్రం ‘తంగలాన్’. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న రిలీజ్ అయింది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా కేఈ జ్ఞానవేల్ రాజా మీడియాతో మాట్లాడుతూ– ‘‘నేనెప్పుడూ డైరెక్టర్‌నే నమ్ముతాను. పా. రంజిత్‌గారిపై నమ్మకంతో ‘తంగలాన్’ విషయంలో స్వేచ్ఛ ఇచ్చాం. సినిమాల మేకింగ్ విషయంలో నా నమ్మకం ఏంటంటే ప్రేక్షకుల అభిరుచిని విశ్వసించడమే. హిందీతో పాటు మిగతా అన్ని భాషల్లోనూ ఈ నెల 30న ‘తంగలాన్’ని రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు.

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రకటన

భావోద్వేగానికి పట్టం

● ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి ● ఉత్తమ నటీమణులు నిత్యామీనన్, మానసీ పరేఖ్ ● ఉత్తమ చిత్రం మలయాళ ‘ఆట్టమ్’ ● ఉత్తమ దర్శకుడు సూరజ్ బర్జాత్యా ● ప్రాంతీయ ఉత్తమ చిత్రం ‘కార్తికేయ 2’

70వ జాతీయ అవార్డులకు గాను దేశవ్యాప్తంగా 28 భాషలకు చెందిన 300 చిత్రాల వరకూ పోటీ పడ్డాయి. 2022 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 లోపు సెన్సార్ అయిన చిత్రాలకు పోటీలో అవకాశం ఉంటుంది. అవార్డుల కోసం వివిధ విభాగాలకు సంబంధించిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి విజేతలను వెల్లడించింది. ఈసారి భావోద్వేగానికి పట్టం కట్టినట్లుగా తెలుస్తోంది. ప్రధాన అవార్డులను పరిశీలిస్తే... ఎమోషనల్‌గా సాగే కథాంశాలకు, భావోద్వేగమైన నటనకు అవార్డులు దక్కినట్లుగా అనిపిస్తోంది. ఆ వివరాలు...

ద్వాపర యుగంలోని శ్రీకృష్ణుడి కడియం కలియుగంలో అంతు చిక్కని సమ్యలకు ఎలా పరిష్కారం చూపించింది? అనే అంశంతో రూపొందిన డివోషనల్, ఎమోషనల్ తెలుగు మూవీ ‘కార్తికేయ 2’ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘కాంతార’. ఈ చిత్రంలో కనబర్చిన పవర్‌ఫుల్, ఎమోషనల్ నటనకుగాను రిషబ్ శెట్టి జాతీయ ఉత్తమ నటుడి అవార్డు సాధించగా, సంపూర్ణ వినోదాన్ని అందించి, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం గానూ అవార్డు దక్కించుకుంది. ప్రేమ, ప్రేమలో విఫలం, కుటుంబ బంధాల నేపథ్యంలో మిత్రన్ జవహర్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం ‘తిరుచిత్రాంబళమ్’లో కనబరిచిన గాఢమైన భావోద్వేగ నటనకు గాను నిత్యామీనన్‌ను జాతీయ ఉత్తమ నటి అవార్డు వరించింది. భర్త అక్రమ సంబంధం సాగిస్తున్నాడని తెలుసుకున్నాక ఓ భార్య ఏం చేసింది? అనే కథాంశంతో రూపొందిన గుజరాతీ చిత్రం ‘కచ్ ఎక్స్‌ప్రెస్’లో భార్య పాత్రలో కనబర్చిన భావోద్వేగానికి గాను ఉత్తమ నటిగా మానసీ పరేఖ్ అవార్డు అందుకోనున్నారు. ఓ నాటక రంగానికి సంబంధించిన ట్రూప్ నేపథ్యంలో ఆనంద్ ఇకర్షి దర్శకత్వంలో రూపొందిన మలయాళ చిత్రం ‘ఆట్టమ్’కి ఉత్తమ చిత్రం, స్క్రీన్‌ప్లే విభాగాల్లో రెండు అవార్డులు దక్కాయి. చనిపోయిన ఓ స్నేహితుడి చివరి కోరికను నెరవేర్చడానికి ముగ్గురు వృద్ధ స్నేహితులు ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి ట్రెక్‌కి వెళ్లే కథాంశంతో తెరకెక్కిన హిందీ చిత్రం ‘ఊంచాయి’. ఈ ఎమోషనల్ రైడ్‌ని అద్భుతంగా ఆవిష్కరించిన సూరజ్ బర్జాత్యా జాతీయ ఉత్తమ దర్శకుడి అవార్డు సాధించారు. ఉత్తమ సంగీత దర్శకత్వం (పాటలు) అవార్డును హిందీ ‘బ్రహ్మాస్త్ర – పార్ట్ 1: శివ’కి సంగీత దర్శకుడు ప్రీతమ్, ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డును తమిళ ‘పొన్నియిన్ సెల్వన్ పార్ట్–1’కు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ దక్కించుకున్నారు.



● నిత్యా మీనన్ ● మానసీ పరేఖ్



● ‘కార్తికేయ 2’ పోస్టర్

ఇక గత ఏడాది పది అవార్డులు దక్కించుకున్న తెలుగు పరిశ్రమ ఈసారి ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డుతో సరిపెట్టుకుంది. ఇంకా పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించారు.

జాతీయ అవార్డుల్లోని కొన్ని విభాగాలు....
● ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార – కన్నడ) ● నటీమణులు: నిత్యా మీనన్ (తిరుచిత్రాంబళమ్ – తమిళ్), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్ – గుజరాతీ) ● చిత్రం: ఆట్టమ్ (మలయాళం) ● దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఊంచాయి – హిందీ) ● దర్శకుడు (డెబ్యూ): ప్రమోద్ కుమార్ (ఫౌజా –హరియాన్వీ) ● సంగీత దర్శకత్వం (పాటలు): ప్రీతమ్ (బ్రహ్మాస్త్ర: శివ– హిందీ) ● సంగీత దర్శకత్వం (నేపథ్య సంగీతం): ఏఆర్ రెహమాన్ (పొన్నియిన్ సెల్వన్ – 1, తమిళ్) నేపథ్య గాయకుడు: అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర– పార్ట్ 1: శివ – హిందీ) ● నేపథ్య గాయని: బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225/2009 – మలయాళం) ● సహాయ నటి: నీనా గుప్తా (ఊంచాయి– హిందీ) ● సహాయ నటుడు: పవన్ రాజ్ మల్హోత్రా (ఫౌజా – హరియాన్వీ) ● బాల నటుడు: శ్రీపత్ (మాలికాపురమ్ – మలయాళం) ● సినిమాటోగ్రఫీ: రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వన్ పార్ట్ – 1) ● కొరియోగ్రఫీ: జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ (తిరుచిత్రాంబళమ్ – తమిళ్) ● యాక్షన్ డైరెక్షన్: అన్బు–అరివు (కేజీఎఫ్ 2 – కన్నడ) ● విజువల్ ఎఫెక్ట్స్: బ్రహ్మాస్త్ర – పార్ట్ 1: శివ (హిందీ) ● మాటల రచయిత : అర్పితా ముఖర్జీ, రాహుల్ వి. చిట్టెల (గుల్‌మోహర్ – హిందీ) ● సౌండ్ డిజైన్: ఆనంద్ కృష్ణమూర్తి – పొన్నియిన్ సెల్వన్ – 1 (తమిళం) ● స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): ఆనంద్ ఏకర్షి (ఆట్టమ్ – మలయాళం) ● జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలను ప్రోత్సహించే చిత్రం: కచ్ ఎక్స్‌ప్రెస్ (గుజరాతీ) ● సంపూర్ణ వినోదాన్ని అందించి, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: కాంతార (కన్నడ).


ప్రాంతీయ ఉత్తమ చిత్రాలు
● తెలుగు: కార్తికేయ–2 ● కన్నడ: కేజీఎఫ్ చాప్టర్–2 ● తమిళ్: పొన్నియిన్ సెల్వన్ – 1 ● మలయాళం: సౌదీ వెల్లక్క సీసీ 225/2009 ● హిందీ: గుల్‌మోహర్



● ‘కాంతార’ పోస్టర్



● ‘ఆట్టమ్’ పోస్టర్



● సూరజ్ బర్జాత్యా

అవార్డు బాధ్యత పెంచింది – చందు మొండేటి



● టీజీ విశ్వప్రసాద్, చందు, అభిషేక్ అగర్వాల్

‘‘మా సినిమాకి జాతీయ అవార్డు రావడం మా బాధ్యతని మరింత పెంచింది. ‘కార్తికేయ 2’ తర్వాత ‘కార్తికేయ 3’పై అంచనాలు ఎంతలా పెరిగాయో తెలుసు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ‘కార్తికేయ 3’ ఉంటుంది’’ అని డైరెక్టర్ చందు మొండేటి అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా చందు మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన చిత్రం ‘కార్తికేయ 2’. ప్రాంతీయ విభాగంలో ఉత్తమ చిత్రం అవార్డును సాధించిన సందర్భంగా చిత్రబృందం సమావేశం నిర్వహించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ‘‘ఈ నేషనల్ అవార్డు మా పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ఓ మైల్‌స్టోన్ మూమెంట్. మా బ్యానర్‌కి తొలి జాతీయ అవార్డు ఇది’’ అన్నారు. ‘‘కృష్ణుడు నిజం అని ఈరోజు మరోసారి ప్రూవ్ అయ్యింది. ఈ అవార్డు కృష్ణుడే తీసుకొచ్చారని భావిస్తున్నాను’’ అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నిఖిల్ మాట్లాడుతూ – ‘‘‘కార్తికేయ 2’ విజయం సాధించడానికి, అవార్డు రావడానికి కారణం మా టీమ్. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ చూసిన సినిమా ఇది. దేశవ్యాప్తంగా చాలా భాషల్లో రిలీజై, అద్భుతమైన విజయం సాధించింది. మా సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు, అవార్డు ప్రకటించిన జ్యూరీకి థ్యాంక్స్’’ అన్నారు.

కార్తికేయ కథేమిటంటే... ద్వాపర యుగంలో తనువు చాలించే ముందు శ్రీకృష్ణుడు తన కాలి కడియాన్ని ఉద్ధవునికి ఇచ్చి, ‘కలియుగంలో వచ్చే ఎన్నో అంతు చిక్కని సమస్యలకు ఈ కడియం పరిష్కారం చూపుతుంది’ అని చెబుతాడు. కలియుగంలో నాస్తికుడైన డాక్టర్ కార్తికేయ (నిఖిల్) తన తల్లి ఒత్తిడి మేరకు ఓ మొక్కు తీర్చుకోవడానికి ద్వారక నగరానికి వెళతాడు. అప్పటికే కడియానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించిన ప్రొఫెసర్ రంగనాథ రావ్‌ను హతమార్చడానికి ట్రై చేస్తుంటాడు సైంటిస్ట్ శాంతను. అతని మనుషుల చేతిలో హతమవ్వడానికి ముందు రంగనాథ రావ్ అనుకోకుండా కార్తికేయను చివరిసారి కలుస్తాడు. దాంతో శాంతను మనుషులతో పాటు శ్రీకృష్ణ భక్తులైన అభీరుల తెగకు చెందిన వ్యక్తులకు సైతం కార్తికేయ టార్గెట్ అవుతాడు. అయితే రంగనాథ రావ్ మనవరాలు ముగ్ధ (అనుపమ) సాయంతో వారందరి నుంచి డాక్టర్ కార్తికేయ ఎలా తప్పించుకున్నాడు? చంద్రశిల శిఖరంలోని శ్రీకృష్ణుడి కడియాన్ని ఎలా సొంతం చేసుకున్నాడు? అన్నదే కథ.

ఆనంద్ ఇకర్షి దర్శకత్వం వహించిన ‘ఆట్టమ్’ కథేంటంటే.. ఓ నాటక బృందంలో 12 మంది నటులు, ఒక నటీమణి ఉంటారు. నటులుగా వినయ్ పాత్రలో వినయ్ ఫోర్ట్, అంజలిగా జరీన్ షిబాబ్, కళాభవన్ షాజాన్ హరి కీలక పాత్రలు పోషించారు. వీళ్ల నాటక ప్రదర్శన ఓ విదేశీ జంటకి నచ్చడంతో తమ రిసార్ట్‌లో వాళ్లకి ఆతిథ్యమిస్తారు. పార్టీ అనంతరం ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లి నిద్రపోతారు. అయితే తన గదిలో కిటికీ పక్కన నిద్రపోతున్న అంజలితో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తాడు. ఆ వ్యక్తి నాటక బృందంలోని 12 మందిలో ఒకరా? లేకుంటే బయటి వ్యక్తా? అనే విషయాన్ని అంజలి ఎలా బయటపెట్టింది? అన్నది ‘ఆట్టమ్’ కథ. హాలీవుడ్ మూవీ ‘12 యాంగ్రీమెన్’ (1954) ఆధారంగా ‘ఆట్టమ్’ రూపొందింది.

కెరాడి టు పాన్ ఇండియా

కర్ణాటకలోని కెరాడి అనే గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు రిషబ్ శెట్టి. చిత్ర పరిశ్రమలోకి రాక ముందు పలు ఉద్యోగాలు చేశారు రిషబ్. డిగ్రీ చదివేటప్పుడు సినిమాలు చూసేందుకు డబ్బుల కోసం కూలి పనులు చేశారు. 2004 నుంచి 2014 వరకు (తొలిసారి డైరెక్షన్ చేసేవరకు) వాటర్ క్యాన్‌లు అమ్మారు. రియల్ ఎస్టేట్ సంస్థలో, హోటల్స్‌లో పని చేశారు. క్లాప్ బాయ్‌గా ఇండస్ట్రీలో జర్నీ ప్రారంభించిన రిషబ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గానూ చేశారు. ‘తుగ్లక్’ అనే చిత్రంలో తన మొదటి పాత్రను పోషించారు. రక్షిత్ శెట్టి హీరోగా రిషబ్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం ‘రికీ’ (2016). ఆ తర్వాతి సినిమా ‘కిరిక్ పార్టీ’తో దర్శకుడిగా రిషబ్ పేరు కన్నడ నాట మార్మోగింది. హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ‘కాంతార’తో రిషబ్ పాన్ ఇండియా స్టార్ అయ్యారు.

సాక్షి బిజినెస్
శనివారం
17-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,331	80,437
నిఫ్టీ ▲	397	24,541

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,642	▲	47
డోజోన్స్	40,682	▲	108
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,311	▲	36
డాక్స్	18,322	▲	139
షాంఘై	2,879	▲	2
నికాయ్	38,063	▲	4

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో (బుధవారం ముగింపు)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	70,604
బంగారం (99.5 స్వచ్ఛత)	70,321
వెండి (కేజీ)	81,510

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.54	84.56
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.90	109.48
€	యూరో	ఎస్‌బీఐ	91.10	93.49
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.82	57.07
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.35	66.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.67

ఎస్‌బీఐ రుణ రేట్లు పెరిగాయ్..

0.1శాతం పెంపు ; తక్షణం అమల్లోకి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణాలపై వడ్డీరేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణరేటు (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగింది. ఆగస్టు 15 నుంచి తాజా 0.1% రుణ రేటు పెరుగుదల అన్ని వర్తిస్తుందని తన వెబ్‌సైట్‌లో బ్యాంక్ పేర్కొంది. దీనితో ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన కస్టమర్ల రుణాల వడ్డీరేట్లు స్వల్పంగా పెరగనున్నాయి. తాజా రేట్లను పరిశీలిస్తే..



- ఆటో, వ్యక్తిగత రుణాలకు సాధారణంగా వర్తించే ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్ 8.85% నుంచి 8.95%కి పెరిగింది.
- రెండేళ్ల రేటు 9.05%కి, మూడేళ్లరేటు 9.10 శాతానికి ఎగసింది.
- నెల, మూడు, ఆరు నెలల కాలపరిమితుల రేట్లు 8.45 శాతం–8.85 శాతం శ్రేణిలో ఉంటాయి. ఓవర్‌నైట్ కాలపరిమితి రేటు 8.10 శాతం నుంచి 8.20 శాతం ఎగసింది.
- పీఎన్‌బీ రుణ రేటు ఇటీవలే అన్ని కాలపరిమితులపై 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా, బీఓఐ కేవలం బెంచ్‌మార్క్ ఏడాది రుణ రేటును ఇదే స్థాయిలో 0.05 శాతం పెంచింది. ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ కూడా రుణ రేట్లను అన్ని కాలపరిమితుల 5 బేసిస్ పాయింట్లు పెంచింది. తాజాగా ఎస్‌బీఐ మూడవసారి పెంచింది.

చెలరేగిన బుల్!

రెండు నెలల్లో అతిపెద్ద ర్యాలీ



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ లాభాలు ఆర్జించాయి. అన్ని రంగాల్లో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 1,331 పాయింట్లు పెరిగి 80,437 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 397 పాయింట్లు లాభపడి 24,541 వద్ద నిలిచింది. ఈ ముగింపు రెండు వారాల గరిష్టం కావడం విశేషం. సూచీలు 2% ర్యాలీతో స్టాక్ మార్కెట్లో రూ.7.30 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.451.59 లక్షల కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) కు చేరింది.

ఇంట్రాడే ట్రేడింగ్ ఇలా..!

సెన్సెక్స్ ఉదయం 649 పాయింట్లు లాభంతో 79,755 వద్ద, నిఫ్టీ 191 పాయింట్లు పెరిగి 24,335 వద్ద మొదలైంది. రోజంతా లాభాల్లో కొన సాగాయి. ఐటీతో పాటు అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,412 పాయింట్లు ర్యాలీ చేసి 80,518 వద్ద, నిఫ్టీ 295 పాయింట్లు పెరిగి 24,531 వద్ద గరిష్టాలు తాకాయి.

- బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 3%, రియల్టీ 2.50%, ఆటో, కమోడిటీ, విద్యుత్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు రెండుశాతం చొప్పున రాణించాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 2%, 1.75 శాతం రాణించాయి.
- సెన్సెక్స్ సూచీలో 30 షేర్లన్నీ లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, టీసీఎస్, హెచ్‌సీఎల్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. నిఫ్టీ సూచీలో 50 షేర్లలో దివీస్ ల్యాబ్స్ (0.50%), ఎస్‌బీఐ లైఫ్ (0.10%), డాక్టర్ రెడ్డీస్ (0.01%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 47 షేర్లూ లాభపడ్డాయి.
- ఎలక్ట్రిక్ బైక్స్‌లో 3 మోడళ్లను ఆవిష్కరించడంతో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ షేరు 20% ర్యాలీ చేసి రూ.133 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

లాభాలు ఎందుకంటే

- అమెరికా రిటైల్ అమ్మకాలు పెరగడం, నిరుద్యోగ క్లెయిమ్స్ డేటా తగ్గడంతో ఆర్థిక మాంద్యం భయాలు సన్నగిల్లాయి. అలాగే జూలై సీపీఐ ద్రవ్యోల్బణ డేటా అంచనాలకు తగ్గట్లు నమోదు కావడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై అంచనాలు పెరిగాయి. ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ ఇండెక్స్ 103 స్థాయి నుంచి 102.81 స్థాయికి దిగివచ్చింది. ఇటీవల భారీగా పతనమైన జపాన్ కరెన్సీ యెన్ స్థిరత్వాన్ని ప్రదర్శించింది. దీంతో యూఎస్ మార్కెట్లు గురువారం 2% ర్యాలీ చేశాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 3–1% చొప్పున లాభపడ్డాయి. అమెరికాతో సహా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల ధోరణి దేశీయ ఈక్విటీ మార్కెట్లకు కలిసొచ్చాయి.
- సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాయి. ఆగస్టు నెలలో 2.5 శాతం దాకా నష్టపోయాయి. దీంతో కనిష్టాల వద్ద ఇన్వెస్టర్లు కొనుగోళ్ల చేపట్టడం సూచీలకు కలిసొచ్చిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- బ్లూచిప్ షేర్లు టీసీఎస్ (3%), ఐసీఐసీఐ (2%), ఇన్ఫీ (2%), ఐటీసీ (2%) హెచ్‌డీఎఫ్‌సీ (1.50%), రిలయన్స్ (1%) రాణించి ర్యాలీకి దన్నుగా నిలిచాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ. 4000 కోట్ల ఐపీఓ	ఏసీ కంపెనీలకు కలిసొచ్చిన వేసవి

అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి రికార్డులు



న్యూయార్క్: అంతర్జాతీయంగా న్యూయార్క్ కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ధర కొత్త రికార్డు స్థాయిలను చూసింది. చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ ఫ్యూచర్స్ ఔన్స్ (31.1గ్రా) ధర ఈ వార్త రాస్తున్న రాత్రి 10 గంటల సమయంలో క్రితం ముగింపుతో పోల్చితే 40 డాలర్లు పెరిగి 2,534 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 2,538 డాలర్లనుసైతం చూసింది. అమెరికా ఫెడ్ ఫండ్ రేటు కోత అంచనాలకుతోడు భౌగోళిక ఉద్రిక్తతలు ప్రత్యేకించి పశ్చిమాసియా పరిణామాలు దీనికి నేపథ్యం.

ఉద్యోగుల రివార్డుల్లో 'నవ'శకం!

ఉద్యోగుల శ్రమకు గుర్తింపుగా సర్టిఫికెట్లు, గిఫ్టుల వంటివి ఇవ్వడం పరిపాటే. అయితే, అన్ని రంగాల్లో ఇప్పుడు నవతరం జెన్ జెడ్ అడుగుపెట్టడంతో ఈ ట్రెండ్ క్రమంగా మారుతోంది. సిబ్బందికి రివార్డుల్లో భారత కార్పొరేట్ కంపెనీలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సాంప్రదాయ బహుమతులు, సర్టిఫికెట్లకు బదులు డిజిటల్ బాట పడుతూ 'సోషల్' కల్చర్‌తో వారిలో నూతనోత్తేజాన్ని నింపుతున్నాయి. – సాక్షి, బిజినెస్ డెస్క్

- సర్టిఫికెట్లు, రొటీన్ బహుమతులకు గుడ్‌బై
- డిజిటల్ బాట పడుతున్న కార్పొరేట్లు..
- బ్యాడ్జ్‌లు, పాయింట్లు తదితర రూపాల్లో గుర్తింపు
- అంతా జెన్ జడ్ మహిమే అంటున్న విశ్లేషకులు

భారత కార్పొరేట్ రంగంలో కొత్త రివార్డుల సంస్కృతికి తెరలేచింది. కంపెనీలు తమ ఉద్యోగులకు అందించే బహుమతుల ప్రోగ్రామ్‌ను పూర్తిగా మార్చేస్తున్నాయి. ఇప్పుడంతా డిజిటల్ రివార్డులకే ఓటేయాల్సిన పరిస్థితి. ముఖ్యంగా యువ ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో వారి ప్రాధాన్యతలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి కంపెనీలు. ఉద్యోగుల విజయాలు, కొత్తగా నేర్చుకున్న స్కిల్స్‌కు గుర్తింపుగా బ్యాడ్జ్‌లు, పాయింట్లు, నోట్స్ వంటివి అందిస్తుండటంతో ఎంప్లాయీస్ మూడు షేర్.. ఆరు లైకలతో ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఎప్సిలాన్ ఇండియా 'సిటిజన్ ఆఫ్ 'యూ'నివర్స్' పేరుతో 'పాస్‌పోర్ట్'ను ప్రవేశపెట్టింది. యువతరం కోరుకునే వినోదం, సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని దీన్ని తీసుకొచ్చింది. 'ఈ రోజుల్లో ప్రజలు, ముఖ్యంగా యువత దేన్నైనా సరే ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసేస్తున్నారు. ఆఫీస్ సమావేశం లేదా ఈవెంట్లో పాల్గొన్న ప్రతిసారి 'పాస్‌పోర్ట్'పై స్టాంప్ పడుతుంది. ఈ గుర్తింపును వారు షేర్ చేసుకోవడం ద్వారా ఇతరులతో పంచుకోవచ్చు' అని కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ సోనాలి దేసర్కార్ పేర్కొన్నారు. రోషె ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ ఇండియా కూడా అప్లాజ్ పేరుతో అంతర్గత స్టోర్‌ను ఉద్యోగులకు అందుబాటులోకి తెచ్చింది. గుర్తింపులో భాగంగా లభించే పాయింట్లతో సిబ్బంది హెడ్‌ఫోన్ల నుంచి ఈవెంట్ టిక్కెట్ల వరకు ఏదైనా కొనుక్కునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కంపెనీ ఎండీ రాజా జమలమడక చెప్పారు.



అంతా 'సోషల్'మయం...

ఉద్యోగులు, ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో మునిగితేలుతుండటంతో.. కంపెనీలు తప్పనిసరిగా ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నాయి. 'యువతరంలో సోషల్ ఆరాటం, భావోద్వేగాలు చాలా ఎక్కువ. అందుకే వారు సాధించే విజయాలను సీనియారిటీతో సంబంధం లేకుండా సహచరులు ఒకరికొకరు అభినందించుకోవడానికి, కృతజ్ఞతలు తెలియజేయడానికి లీడర్‌షిప్‌బోర్డ్‌లు వీలు కల్పిస్తున్నాయి' అని థ్రైవ్ డిజిటల్ ప్రెసిడెంట్, సీఈఓ శంకరనారాయణన్ చెప్పారు. ఇక మెర్క్ ఇండియా వార్షిక గుర్తింపు వారం, ప్యానెల్ ఆధారిత అవార్డులు, స్పాట్ అవార్డులు.. ఇలా మూడు రకాలను అమలు చేస్తోంది. ఆల్‌స్టేట్ ఇండియా ప్రతి ఉద్యోగికి నెలనెలా 100 పాయింట్లు అందిస్తోంది. వీటిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవచ్చు, అంతర్గత స్టోర్‌లో రీడీమ్ చేసుకోవచ్చు.

డిజిటల్ బ్యాడ్జ్‌లకు ప్రాచుర్యం

ఉద్యోగుల విజయాలు, నైపుణ్యాలకు అద్దంపట్టే డిజిటల్ బ్యాడ్జ్‌లకు అన్ని కంపెనీల్లోనూ బాగా ప్రాచుర్యం లభిస్తోంది. సిబ్బంది తమ సాఫల్యాలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో షేర్ చేసుకునే విధంగా కంపెనీలు ఈ బ్యాడ్జ్‌లను రూపొందిస్తున్నాయి. 'ఉద్యోగులు పనిలో మరింత ఎంగేజ్ అయ్యేలా, స్ఫూర్తి నింపడంలో గేమిఫికేషన్ సమర్థ సాధనంగా మారుతోంది. ముఖ్యంగా ప్రస్తుత గ్లోబల్ కేపబిలిటీ ఎకోసిస్టమ్‌లో ఇది చాలా కీలకం. ఒకరినొకరు అభినందించుకోవడం, రివార్డులను షేర్ చేసుకోవడం వంటివి పరస్పర గౌరవాన్ని పెంచడంతో పాటు టీమ్‌లను బలోపేతం చేస్తుంది' అని ర్యాండ్‌స్టాడ్ డిజిటల్ ఇండియా ఎండీ మిలింద్ షా అభిప్రాయపడ్డారు.

- ఎప్సిలాన్ ఇండియా కొత్తగా 'పాస్‌పోర్ట్' ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఆఫీస్ సమావేశాల్లో పాల్గొన్న ప్రతిసారీ ఉద్యోగులకు 'స్టాంప్' పడుతుంది. సోషల్ మీడియాలో ప్రతిదీ షేర్ చేసుకోవాలని పరితపించే నవతరం ఉద్యోగులకు ఇది తెగ నచ్చేస్తోందట!
- రోషె ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ 'అప్లాజ్' పేరుతో అంతర్గత స్టోర్ తెరిచింది. ఉద్యోగులకిచ్చే పాయింట్లను రీడీమ్ చేసుకొని ఇక్కడ హెడ్‌ఫోన్స్, టిక్కెట్ల వంటివి కొనుక్కోవచ్చు.
- కొత్త స్కిల్స్, బాధ్యతల్లో విజయాలకు ప్రతిగా టాలెంట్‌ను గుర్తించేందుకు ఇస్తున్న డిజిటల్ బ్యాడ్జ్‌లు (బెస్ట్ ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ వంటివి) కంపెనీల్లో బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి.
- మెర్క్ ఇండియా, ఆల్‌స్టేట్ ఇండియా, థ్రైవ్ డిజిటల్‌లీడర్‌షిప్ బోర్డులను అమలు చేస్తున్నాయి. సీనియారిటీతో సంబంధం లేకుండా సహోద్యోగులు ఒకరికొకరు అభినందనలు తెలియజేసేందుకు ఇది తోడ్పడుతోంది.

సాక్షి స్పోర్ట్స్

డిక్‌వెల్లాపై సస్పెన్షన్ వేటు



కొలంబో: శ్రీలంక వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్‌వెల్లాపై సస్పెన్షన్ వేటు పడింది. లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) సందర్భంగా నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో విఫలమైనందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) అతడిపై వేటు వేసింది. లీగ్‌లో గాలె మార్వెల్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న డిక్‌వెల్లాపై శుక్రవారం నుంచే నిషేధం అమల్లోకి వచ్చినట్లు ఎస్ఎల్‌సీ పేర్కొంది. డిక్‌వెల్లా జాతీయ జట్టు తరఫున 54 టెస్టులు, 55 వన్డేలు, 28 టీ20లు ఆడాడు.

భారత మహిళల 'ఎ' జట్టుకు మరో పరాజయం

మెక్‌కాయ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల 'ఎ' జట్టు పరాజయాల వరంపర కొనసాగుతోంది. టీ20 సిరీస్‌లో మూడు మ్యాచ్‌లూ ఓడిన మన అమ్మాయిల జట్టు.. వన్డేల్లోనూ వరుసగా రెండో మ్యాచ్ ఓడి సిరీస్ కోల్పోయింది. శుక్రవారం రెండో వన్డేలో భారత మహిళల 'ఎ' జట్టు 8 వికెట్లతో ఓడింది. మొదట భారత్ 48 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ కాగా..ఛేదనలో ఆస్ట్రేలియా 40.2 ఓవర్లలో 2 వికెట్లకు 221 పరుగులు చేసింది.

'క్రీడా సంస్కృతి పెరగాలి'

పారిస్ ఒలింపిక్స్ చెఫ్ డి మిషన్ నారంగ్



పారిస్: దేశంలో క్రీడా సంస్కృతి పెరిగితేనే ప్రతిష్టాత్మక పోటీల్లో మరిన్ని పతకాలు సాధించవచ్చని.. పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల బృందానికి చెఫ్ డి మిషన్‌గా పనిచేసిన షూటర్ గగన్ నారంగ్ అన్నాడు. 'పారిస్' క్రీడల్లో మన అథ్లెట్ల ప్రదర్శనను అభినందించిన నారంగ్.. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో మన ప్రాతినిధ్యం మరింత పెరగాలని ఆకాంక్షించాడు. 'తాజా ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు మంచి ప్రదర్శన కనబర్చారు. 6 పతకాలు వచ్చినందుకు సంతోషంగానే ఉన్నా.. మరిన్ని అవకాశాలు త్రుటిలో చేజారడం నిరాశ పర్చింది. ఒత్తిడిని జయిస్తే ఇంకొన్ని పతకాలు వచ్చేవి. ఇక మీదట దానిపై దృష్టిపెట్టాలి. దేశంలో క్రీడా సంస్కృతి మరింత పెంచాల్సిన అవసరముంది. అప్పుడే వచ్చే ఒలింపిక్స్‌లో మన ప్రాతినిధ్యం పెరిగి పతకాలు ఎక్కువ సాధించే అవకాశం ఉంటుంది. పరాజయాల నుంచి తిరిగి కోలుకొని సత్తాచాటడం ఎలా అనే అంశంలో మన అథ్లెట్లు రాటుదేలాలి. గతంతో పోలిస్తే దేశంలో క్రీడా మౌలిక వసతులు ఎంతగానో వృద్ధి చెందాయి'అని 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన నారంగ్ అన్నాడు.

దక్షిణాఫ్రికా ఆధిపత్యం


ముల్డర్

ప్రావిడెన్స్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చింది. రెండో ఇన్నింగ్స్‌లో 26 ఓవర్లలో వికెట్ నష్టానికి 93 పరుగులు చేసింది. దాంతో దక్షిణాఫ్రికా ఆధిక్యం 109 పరుగులకు చేరింది. టోనీ జోర్జి (39) రాణించాడు. అంతకు ముందు దక్షిణాఫ్రికాకు తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సఫారీ బౌలర్ల ధాటికి వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే ఆలౌటైంది. జేసన్ హోల్డర్ (88 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరిపోరాటం చేసి అర్ధసెంచరీ సాధించాడు. వియాన్ ముల్డర్ (4/32), బర్గర్ (3/49), కేశవ్ మహరాజ్ (2/8) విండీస్‌ను దెబ్బ తీశారు. దక్షిణాఫ్రికా కూడా తమ తొలి ఇన్నింగ్స్‌లో 97 పరుగుల వద్దే 9వ వికెట్ కోల్పోయినా...డీన్ పీట్ (38 నాటౌట్), బర్గర్ (23) కలిసి 63 పరుగుల చివరి వికెట్ భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు.



పారా అథ్లెట్లతో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా

పారాలింపిక్స్ సమయం

- పారిస్‌కు బయల్దేరిన భారత పారా అథ్లెట్లు
- 12 క్రీడాంశాల్లో 84 మంది పోటీ
- పతాకధారులుగా భాగ్యశ్రీ, సుమిత్


భాగ్యశ్రీ


సుమిత్

న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో సత్తా చాటడమే లక్ష్యంగా భారత అథ్లెట్ల బృందం శుక్రవారం ఫ్రాన్స్‌కు పయనమైంది. ఇటీవల పారిస్ వేదికగా ఒలింపిక్స్ ముగియగా.. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు అక్కడే పారాలింపిక్స్ జరగనున్నాయి. ఈ క్రీడల్లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు 12 క్రీడాంశాల్లో పాల్గొంటారు. విశ్వ క్రీడలకు బయలుదేరే ముందు భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ల క్రితం టోక్యోలో జరిగిన పారాలింపిక్స్‌లో భారత్ నుంచి 54 మంది బరిలోకి దిగి 19 పతకాలు (5 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలు) సాధించగా.. ఈసారి ఆ సంఖ్య మరింత పెరుగుతుందని భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియా అన్నాడు. పారిస్ పారాలింపిక్స్‌లో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కనోయింగ్, సైక్లింగ్, బ్లైండ్ జూడో, పవర్ లిఫ్టింగ్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండోలో మన అథ్లెట్లు బరిలోకి దిగనున్నారు. 'ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని మన పారా అథ్లెట్లు ఒలింపిక్స్ వరకు చేరుకున్నారు. 'పారిస్' పారాక్రీడల్లో సత్తా చాటి అధిక సంఖ్యలో పతకాలు సాధిస్తారనే నమ్మకముంది. ఈ బృందంలో చాలా మంది అథ్లెట్లు 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా లబ్ధి పొందినవారే. అథ్లెట్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. విశ్వక్రీడల్లో అధిక సంఖ్యలో పతకాలు సాధించి దేశ ఖ్యాతిని మరింత పెంపొందించాలి' అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా అన్నారు.

ఫ్లాగ్ బేరర్లుగా భాగ్యశ్రీ, సుమిత్

పారిస్ పారాలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ జాదవ్ భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. టోక్యో పారాలింపిక్స్ ఎఫ్64 విభాగంలో స్వర్ణం నెగ్గిన సుమిత్ అంటిల్.. గత ఏడాది ప్రపంచ పారా చాంపియన్‌షిప్‌లోనూ బంగారు పతకం సాధించాడు. మహిళల ఎఫ్34 కేటగిరీలో పోటీపడుతున్న భాగ్యశ్రీ ఆసియా పారా క్రీడల్లో రజతం సాధించింది. ఈ నేపథ్యంలో పీసీఐ అధ్యక్షుడు ఝఝారియా మాట్లాడుతూ.. 'విశ్వక్రీడల ఆరంభ వేడుకలో సుమిత్, భాగ్యశ్రీ ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరిస్తారు. వీరిద్దరూ గత కొంతకాలంగా చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నారు. టోక్యో పారాలింపిక్స్ కంటే ఎక్కువ పతకాలు సాధిస్తామనే నమ్మకముంది. అనేక క్రీడాంశాల్లో మన అథ్లెట్లు అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నారు. దాని వెనక వారి కఠోర శ్రమ, కృషి ఉంది. పారిస్ పారాలింపిక్స్‌లో దానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నాడు. ఈ క్రీడల్లో తెలంగాణ నుంచి మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో జివాంజి దీప్తి పోటీపడనుంది.

భారత డేవిస్ కప్ జట్టులో నగాల్

- యూకీ బాంబ్రీ దూరం
- వచ్చేనెల 14, 15 తేదీల్లో స్వీడన్‌తో పోరు



న్యూఢిల్లీ: భారత సింగిల్స్ టాప్‌స్టార్ సుమిత్ నగాల్ తిరిగి డేవిస్ కప్ జట్టులోకి వచ్చేశాడు. వరల్డ్ గ్రూప్–1 పోరులో భాగంగా భారత్ వచ్చే నెల స్వీడన్‌తో తలపడనుంది. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో స్టాక్‌హోమ్‌లోని ఇండోర్ హార్డ్ కోర్ట్ వేదికపై జరిగే ఈ పోటీలకు డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ దూరమయ్యాడు. ఈ ఏడాది ఆరంభంలో నగాల్... ఇస్లామాబాద్‌లో పాకిస్తాన్‌తో జరిగిన డేవిస్ కప్ పోరుకు దూరంగా ఉన్నాడు. అక్కడ గ్రాస్‌కోర్ట్‌పై అనాసక్తి కనబరిచిన సుమిత్ ఇప్పుడు హార్డ్‌కోర్ట్‌లో జరిగే పోటీలకు అందుబాటులోకి వచ్చాడు. భారత టాప్–3 ప్లేయర్, ప్రపంచ 476 ర్యాంకర్ శశికుమార్ ముకుంద్‌పై రెండు 'టై'ల సస్పెన్షన్ ఉండటంతో అతన్ని ఎంపిక చేయలేదు. వరుసగా డేవిస్ కప్ టోర్నీలకు గైర్హాజరు అవుతుండటంతో అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం సమావేశమైన ఐటా సెలక్షన్ కమిటీ సుమిత్ నగాల్, రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, నికీ పునాచా, సిద్ధార్థ్ విశ్వకర్మలను ఎంపిక చేసింది. రోహిత్ రాజ్‌పాల్ కెప్టెన్‌గా వ్యవహరించే ఈ జట్టుకు ఆర్యన్ షా రిజర్వ్ ప్లేయర్‌గా ఉంటాడు. యూకీ అందుబాటులో లేకపోవడంతో రామ్‌కుమార్ సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లోనూ బరిలోకి దిగుతాడు. యూకీ తన గైర్హాజరుకు గల కారణాలు బయటికి వెల్లడించనప్పటికీ... పారిస్ ఒలింపిక్స్‌కు రోహన్ బోపన్నకు జోడీగా తనను పంపకపోవడంపై కినుక వహించినట్లు తెలిసింది. అయితే ఇందులో 'ఐటా' చేసిందేమీ లేదని వెటరన్ స్టార్ బోపన్న తన భాగస్వామిగా శ్రీరామ్ బాలాజీని ఎంచుకోవడంతో అతన్నే పంపాల్సివచ్చిందని ఐటా వర్గాలు వెల్లడించాయి. జీషాన్ అలీ కోచ్ పదవి నుంచి తప్పుకోవడంతో మాజీ ఢిల్లీ ప్లేయర్ అశుతోశ్ సింగ్‌కు కోచింగ్ బాధ్యతలు అప్పగించే అవకాశముంది. బాలచంద్రన్ పేరు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ ఐటా సెలక్షన్ కమిటీ అశుతోశ్ వైపు మొగ్గుచూపుతోంది. ప్రస్తుతానికి భారత డేవిస్ కప్ జట్టును ఎంపిక చేశామని కోచ్‌పై తుది నిర్ణయం తీసుకోలేదని ఐటా కార్యదర్శి అనిల్ ధూపర్ తెలిపారు.

ప్రొ కబడ్డీ లీగ్‌లో 118 మంది

- ముగిసిన వేలం ప్రక్రియ
- రెండో రోజు అత్యధికంగా అజిత్‌కు రూ.66 లక్షలు

ముంబై: రెండు రోజుల పాటు జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆటగాళ్ల వేలంపాట ముగిసింది. మొత్తం 118 మంది ఆటగాళ్లు ఈ వేలంలో అమ్ముడుపోగా... తొలిరోజు రూ.2 కోట్లయినా వెచ్చించేందుకు వెనుకాడని ఫ్రాంచైజీలు రెండో రోజు మాత్రం పెద్దగా ఎగబడలేదు. శుక్రవారం 'సి', 'డి' కేటగిరీ ఆటగాళ్ల వేలం నిర్వహించగా ఏ ఒక్కరు రూ. కోటి దాకా వెళ్లలేకపోయారు. రెయిడర్ అజిత్ కుమార్‌కు అత్యధికంగా రూ. 66 లక్షలు దక్కాయి. రెండో రోజు వేలంలో ఇదే పెద్ద మొత్తం కాగా, పుణేరి పల్టన్ ఆ రెయిడర్‌ను దక్కించుకుంది. జై భగవాన్‌ను రూ. 63 లక్షలకు బెంగళూరు బుల్స్ కొనుగోలు చేసింది. వీరిద్దరితో పాటు 'సి' కేటగిరీలో మరో ఇద్దరు రూ.అరకోటి మార్క్ దాటారు. ఆల్‌రౌండర్ గుర్‌దీప్‌ను రూ. 59 లక్షలకు, డిఫెండర్ దీపక్ రాజేందర్ సింగ్‌ను రూ. 50 లక్షలకు పట్నా పైరేట్స్ పైరేట్స్ కొనుక్కుంది. 'డి' కేటగిరీ ఆటగాళ్ల జాబితాలో రెయిడర్ అర్జున్ రాఠికి అత్యధికంగా రూ.41 లక్షలు లభించాయి. బెంగాల్ వారియర్స్ అతన్ని చేజిక్కించుకోగా, ఆ తర్వాత ఇంకెవరూ ఈ జాబితాలో కనీసం రూ.20 లక్షలైనా పొందలేకపోయారు. డిఫెండర్ మొహమ్మద్ అమన్‌ను రూ.16.20 లక్షలకు పుణేరి పల్టన్, రెయిడర్ స్టువర్ట్ సింగ్‌ను రూ.14.20 లక్షలకు యు ముంబా జట్లు తీసుకున్నాయి. మొత్తం మీద ప్రొ కబడ్డీ లీగ్ చరిత్రలో 11వ సీజన్ కోసం నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో ఇద్దరు ప్లేయర్లు సచిన్ (రూ.2.15 కోట్లు; తమిళ్ తలైవాస్), మొహమ్మద్ రెజా (రూ.2.07 కోట్లు; హరియాణా) రెండు కోట్లపైచిలుకు అమ్ముడయ్యారు. ఆరు మందికి రూ.కోటికి పైగా మొత్తం లభించింది. ఇక 12 ఫ్రాంచైజీల్లో ఆటగాళ్ల కోసం అత్యధికంగా హరియాణా స్టీలర్స్ ఫ్రాంచైజీ దాదాపు రూ. ఐదు కోట్లు (రూ.4.99 కోట్లు) ఖర్చు చేసింది.

క్లుప్తంగా...

నేడు ఏపీ నిట్ స్నాతకోత్సవం



తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఆరో స్నాతకోత్సవం శనివారం జరగనుంది. 2020–24 బీటెక్ విద్యార్థులు 527 మందికి డిగ్రీలు అందజేయనున్నారు. వీరితోపాటు ఎంటెక్ కోర్సు పూర్తిచేసిన 15 మందికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. పీహెచ్‌డీ చేసిన 25 మందికి డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేయనున్నారు. మొత్తం ఎనిమిది కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందించనున్నారు.

19 నుంచి తుది దశ ఈఏపీసెట్ కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి/ఏచ్చెర్ల క్యాంపస్: ఇంజనీరింగ్ ప్రవేశాల్లో భాగంగా ఏపీఈఏపీసెట్–2024 తుది/మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియను ఆగస్టు 19 నుంచి ప్రారంభిస్తున్నట్టు సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్, ప్రవేశాల కన్వీనర్ గణేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు పూర్తి చేయాలన్నారు. 19 నుంచి 22 వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందన్నారు. విద్యార్థులు 20 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించారు. 23న ఆప్షన్ల మార్పు, 26న తుది సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయ చేతిరాత పోటీల్లో ఏపీ విద్యార్థుల సత్తా

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయి చేతిరాత పోటీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సత్తా చాటారని చేతిరాత నిపుణులు షేక్ మహబూబ్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో నేషనల్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ కెప్టెన్‌గా ఎ.అర్జున్ గెలుపొందారని పేర్కొన్నారు. ఎస్ఆర్ఐ నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్, అఖిల భారత హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 14న ఆన్‌లైన్ విధానంలో పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. సీనియర్ స్థాయిలో కైకలూరు విద్యార్థిని సీహెచ్ లక్ష్మీకావ్య వండర్ ఆఫ్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ విభాగంలో మొదటి స్థానం, జూనియర్ విభాగంలో విజయవాడ ఐదోతరగతి విద్యార్థి అభిరామ దన్విక్ మొదటి స్థానం, 8వ తరగతి విద్యార్థిని బొప్పన ముకుంద ప్రియ తృతీయ స్థానం సాధించారని వివరించారు.

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌కు 6 నామినేషన్లు



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నికకు శుక్రవారం విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. షెడ్యూల్ ప్రకారం శనివారం నామినేషన్లను పరిశీలిస్తారు. ఉపసంహరణకు సోమవారం వరకు గడువుంది. అవసరమైతే సెప్టెంబర్ 8వ తేదీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఆరు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ విషయాన్ని సెప్టెంబర్ 8న అధికారికంగా ప్రకటిస్తారు. అపెక్స్ కౌన్సిల్ పానెల్ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, కార్యదర్శిగా సతీష్ బాబు, సంయుక్త కార్యదర్శిగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కోశాధికారిగా డి.శ్రీనివాస్, కౌన్సిలర్‌గా విష్ణు నామినేషన్లు దాఖలు చేశారు.

ఔట్‌సోర్సింగ్ కోచ్‌లకు జీతాలివ్వండి

సాక్షి, అమరావతి: శాప్ పరిధిలో ఔట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న 97 మంది కోచ్‌లు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి పెండింగ్ బకాయిలను చెల్లించాలని భారత ప్రజాతంత్రయువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై విజయవాడలోని శాప్ ఎండీని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.


'ఆయాలు, వాచ్‌మెన్‌లకు జీతాలు చెల్లించాలి'

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్షలోని ఉద్యోగులకు సమ్మె కాలానికి జీతాలు, ఆయాలు, వాచ్‌మెన్‌లకు జీతాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కె.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు కోరారు. దీనికి సంబంధించి శుక్రవారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేశారు. విశ్వవిద్యాలయాల్లోని ఐదువేల అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాలను రద్దుతోపాటు మైనర్, మేజర్ కోర్సుల్లో ఇబ్బందులను తొలగించాలని, జీవో 117, తరగతుల విలీనాన్ని రద్దు చేయాలన్నారు.



అయినా.. పట్టాలెందుకు తప్పుతున్నాయ్!

రైల్వే ప్రమాదాల పెరుగుదలపై కాగ్ ఆక్షేపణ
- ఈ ఏడాది ఇప్పటికే 19 దుర్ఘటనలు
- ట్రాక్‌ల నిర్వహణ నిధుల్లో కోత
- కొత్త లైన్ల నిర్మాణానికి అరకొర నిధులతో సరి
- రైల్వే శాఖ నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు



సాక్షి, అమరావతి: రైల్వేలను ఆధునీకరిస్తున్నాం.. బుల్లెట్ రైళ్లు, హైస్పీడ్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఘనమైన ప్రకటనలివి. అయినా.. దేశంలో రైళ్లు పట్టాలు తప్పి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. దేశంలో రైళ్లు పట్టాలు తప్పి.. ప్రమాదానికి గురవుతున్న దుర్ఘటనలు గణనీయంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 19 రైళ్లు పట్టాలు తప్పిన ప్రమాదాలు సంభవించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. రైల్వే శాఖ ఘనమైన చర్యలు చేపడుతున్నా దేశంలో రైలు ప్రమాదాలు పెరుగుతుండటంపై కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ (కాగ్) తీవ్రంగా ఆక్షేపించింది. కేంద్ర ప్రభుత్వం రైల్వే ట్రాక్‌ల నిర్వహణ, గేజ్ మార్పిడి, కొత్త లైన్ల నిర్మాణానికి కేటాయించే నిధుల్లో కోత విధిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

గాడి తప్పుతున్న రైళ్లు

నాలుగేళ్లుగా రైళ్లు పట్టాలు తప్పి ప్రమాదాలకు గురవుతున్న దుర్ఘటనలు పెరుగుతున్నాయి. 2021–22లో 27 ప్రమాదాలు సంభవించగా... 2022–23లో 36 చోట్ల రైళ్లు పట్టాలు తప్పాయి. ఒకే ట్రాక్ మీదకు ఎదురెదురుగా రైళ్లు వచ్చి ఢీకొన్న ప్రమాదాలు కూడా సంభవిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2021–22లో రెండు ప్రమాదాలు సంభవించగా.. 2022–23లో రైళ్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదాలు ఏకంగా ఆరు సంభవించాయి.

కొత్త లైన్ల నిర్మాణానికీ నిధుల తగ్గింపు

రైల్వే భద్రతకు కీలకమైన కొత్త లైన్ల నిర్మాణానికి నిధుల కేటాయింపును కూడా రైల్వే శాఖ క్రమంగా తగ్గిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా రైల్వే బడ్జెట్‌లో కనీసం 15 శాతం నిధులను కొత్త లైన్ల నిర్మాణానికి కేటాయించాలన్నది ప్రామాణికంగా నిర్దేశించారు. కానీ.. రైల్వే శాఖ మూడేళ్లుగా ఈ ప్రమాణాలను పాటించడం లేదు. 2022–23 బడ్జెట్‌లో 14.1 శాతం నిధులు కేటాయించగా.. 2023–24కు కొత్త రైల్వే లైన్ల నిర్మాణ నిధులను 10.3 శాతానికి తగ్గించారు. ఇటీవల ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌లో కొత్త లైన్ల నిర్మాణం కోసం కేవలం 7 శాతం నిధులనే కేటాయించడం విస్మయం కలిగిస్తోంది. అదే విధంగా గేజ్ మార్పిడి కోసం మొత్తం బడ్జెట్‌లో కనీసం 3 శాతం నిధులు కేటాయించాలన్న ప్రామాణిక నిర్దేశం. రైల్వే శాఖ మాత్రం 2022–23లో 2 శాతం నిధులు కేటాయించగా.. 2023–24లో కేవలం 1.6 శాతం నిధులే కేటాయించారు. ఇటీవల ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌లో కొద్దిగా పెంచి 1.8 శాతం నిధులతో సరిపెట్టారు. మరోవైపు కేటాయిస్తున్న అరకొర నిధులను కూడా రైల్వే శాఖ ఆయా పనులకు పూర్తిగా వెచ్చించడం లేదు. దాంతో రైల్వే ట్రాక్‌ల నిర్వహణ లోపభూయిష్టంగా మారి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

వేధిస్తున్న నిర్వహణ వ్యయంతో కోత

రైళ్లు పట్టాలు తప్పి.. ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు ఎదురెదురుగా వచ్చి ప్రమాదాలు సంభవించడానికి 24 రకాల కారణాలు ఉంటాయని రైల్వే శాఖ వెల్లడించింది. ఇందుకు ట్రాక్‌ల నిర్వహణ వ్యయంలో కోత, ట్రాక్‌ల నిర్వహణ ప్రమాణాల ఉల్లంఘన, రైల్వే కోచ్‌లు, వ్యాగన్ల నిర్మాణంలో నాణ్యత లోపాలు అత్యంత ప్రధానమైనవి. కాగా.. రైల్వే శాఖ కొన్నేళ్లుగా రైల్వే ట్రాక్‌ల నిర్వహణ వ్యయంలో కోత విధిస్తుండటం ఇటువంటి ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోంది. 2017–2021 వరకు రైళ్లు పట్టాలు తప్పిన ప్రమాదాల్లో 26 శాతం రైల్వే ట్రాక్‌ల నిర్వహణల లోపమే కారణమని కాగ్ నివేదిక వెల్లడించింది. ఇంత జరుగుతున్నా రైల్వే శాఖ నిర్లక్ష్యం వీడటం లేదు. రైల్వే ట్రాక్‌ల నిర్వహణ వ్యయంలో కోత విధించడాన్ని కొనసాగిస్తోంది. ఏటా రైల్వే బడ్జెట్ పెరుగుతోంది కానీ.. అందులో ట్రాక్‌ల నిర్వహణ వ్యయం వాటాను మాత్రం తగ్గిస్తుండటం గమనార్హం. 2022–23 రైల్వే బడ్జెట్‌రూ.1.2 లక్షల కోట్లు కాగా.. అందులో రైల్వే ట్రాక్‌ల రెన్యువల్, నిర్వహణ కోసం 13.5 శాతం నిధులు కేటాయించారు. కాగా.. 2023–24 రైల్వే బడ్జెట్ 1.5 లక్షల కోట్లకు పెరిగినా అందులోనూ రైల్వే ట్రాక్‌ల రెన్యూవల్, నిర్వహణ నిధులను 11 శాతానికి తగ్గించడం గమనార్హం. గత వారం ప్రవేశపెట్టిన 2024–25 రైల్వే బడ్జెట్‌లో 1.8 లక్షల కోట్లు కేటాయించారు. కానీ,, రైల్వే ట్రాక్‌ల రెన్యువల్, నిర్వహణ నిధులను కేవలం 9.7 శాతానికే పరిమితం చేశారు.

ఇస్రో అమ్ముల పొదిలోకి

మరో రాకెట్

ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం సక్సెస్



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమ్ముల పొదిలోకి మరో రాకెట్ చేరింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) డి–3 ప్రయోగాన్ని శుక్రవారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈవోఎస్–08), ఎస్ఆర్–0 డెమోశాట్ అనే రెండు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగానికి శుక్రవారం తెల్లవారుజామున 2.47 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. ఆరున్నర గంటలపాటు కౌంట్‌డౌన్ అనంతరం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్‌వీ డి–3 రాకెట్ నింగివైపునకు దూసుకెళ్లింది. రాకెట్‌లోని మొత్తం నాలుగు దశలు సక్రమంగా పనిచేయడంతో 16.56 నిమిషాల్లోనే ప్రయోగం విజయవంతంగా ముగిసింది. భూమికి 475 కిలోమీటర్లు ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లో 37.2 డిగ్రీల వృత్తాకారపు కక్ష్యలోకి విజయవంతంగా ఉప గ్రహాలను ప్రవేశపెట్టారు. మొదట ఈవోఎస్–08ను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఎస్ఆర్–0 డెమోశాట్ అనే చిన్న ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఇస్రో చిన్న తరహా ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా గుర్తింపు పొందింది.

ఇవీ ఉపయోగాలు

ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్–08లో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం–రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీ యూవీ డొసిమీటర్ అనే మూడు రకాల పేలోడ్స్‌ను అమర్చారు. వీటి ద్వారా ఈ ఉపగ్రహం భూమి మీద వాతావరణ పరిస్థితులు(భౌగోళిక–పర్యావరణం)పై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ సమాచారాన్ని చేరవేస్తుంది. ముఖ్యంగా అటవీ, వ్యవసాయం, భూమి స్వభావం, నీరు అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. ఈ ఉపగ్రహం ఒక్క ఏడాదే సేవలు అందిస్తుంది.

వాణిజ్యపరంగా కూడా వినియోగిస్తాం



ఎస్ఎస్ఎల్‌వీ డి–3 ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ ఇస్రోలో సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ చేరిందని చెప్పారు. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్–3 వంటి ఐదు రకాల రాకెట్లు మాత్రమే ఉండేవని తెలిపారు. 2022 ఆగస్టు 7న ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ డి–1 రాకెట్ విఫలం కావడంతో అందులో ఏర్పడిన లోపాలను సరిచేసి.. ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎస్ఎస్ఎల్‌వీ డి–3 ప్రయోగానికి సిద్ధమయ్యామన్నారు. దీనికోసం అహర్నిశలు పనిచేసిన ఇస్రోలోని అన్ని విభాగాలకు అభినందనలు తెలిపారు. వాణిజ్యపరంగా కూడా ఈ రాకెట్‌ను వినియోగిస్తామని చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ఎస్ఎస్ వినోద్, శాటిలైట్ డైరెక్టర్ ఎ.అవినాష్ మాట్లాడుతూ ఉపగ్రహం నుంచి నిర్దేశించిన విధంగా సిగ్నల్స్ అందాయని తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్ జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి శుక్రవారం స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) డి–3ని విజయవంతంగా ప్రయోగించడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఈ ప్రయోగం ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈవోఎస్–08), ఎస్ఆర్–0 డెమోశాట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన శాస్త్రవేత్తలకు వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. అంతరిక్ష పరిశోధన రంగంలో ఈ విజయం ఇస్రోను ప్రపంచ వేదికపై నిలిపిందని ఆయన పేర్కొన్నారు.



అల్పపీడన ద్రోణి కారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. దీనికి తోడు విపరీతమైన ఉక్కపోతతో జనం 'చల్ల'దనం కోసం పరుగులు తీస్తున్నారు. ఇందుకోసం ఏసీలను కొనుగోలు చేస్తున్నారు.

హీట్ వేవ్స్.. హాట్ సేల్స్

తగ్గని ఎండ.. పెరుగుతున్న ఉక్కపోత

ఏసీల అమ్మకాల్లో గణనీయ వృద్ధి

2024లో ఏసీల అమ్మకాలు 1.50 కోట్ల యూనిట్లు దాటతాయని అంచనా

సాక్షి, అమరావతి: సాధారణంగా వేసవి తరువాత ఏసీల అమ్మకాల్లో తగ్గుదల సహజం. కానీ సెప్టెంబర్ వస్తున్నా రికార్డు స్థాయిలో ఏసీల అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో తయారీ కంపెనీలు భారీ లాభాల బాట పడుతున్నాయి. ఈ వేసవిలో ఏసీ అమ్మకాల్లో 60 నుంచి 70 శాతం వృద్ధి నమోదు కాగా జూలై నుంచి జరుగుతున్న అమ్మకాల్లో కూడా 30 నుంచి 40 శాతం వృద్ధి నమోదవుతున్నట్లు కంపెనీలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్) నెలల్లో పలు ఏసీ కంపెనీలు ప్రకటించిన ఆర్థిక ఫలితాల్లో లాభాలు రెండు రెట్లు పెరిగాయంటే అమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కంపెనీలకు భారీ లాభాలు

అత్యధిక వాటా కలిగిన వోల్టాస్ లాభం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో రెండు రెట్లు పెరిగి రూ.355 కోట్లకు చేరింది. ఈ మూడు నెలల కాలంలో వోల్టాస్ రికార్డు స్థాయిలో 10 లక్షల యూనిట్లు విక్రయించింది. బ్లూస్టార్ లాభం కూడా రెండు రెట్లు పెరిగి రూ.169 కోట్లకు చేరింది. గతేడాది రూ.62 కోట్ల నష్టాలను ప్రకటించిన హావెల్స్ ఈ ఏడాది రూ.67 కోట్ల లాభాలను ప్రకటించడం గమనార్హం. 2023లో దేశవ్యాప్తంగా 1.1 కోట్ల ఏసీల అమ్మకాలు జరిగితే 2024లో 1.5 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లియన్సెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సీమా) ప్రెసిడెంట్ సునీల్ వచాని తెలిపారు.

ఆన్‌లైన్ రిటైల్ సంస్థల పోటీ

ప్రస్తుత మార్కెట్ డిమాండ్‌ను క్యాష్ చేసుకోవడానికి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌వంటి ఆన్‌లైన్ రిటైల్ సంస్థలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నామంటూ కొన్ని కంపెనీలు వాపోతున్నాయి.

2037 నాటికి ప్రతి 15 సెకన్లకు ఒక ఏసీ

2011 తర్వాత ఈ స్థాయిలో ఏసీల అమ్మకాలు పెరగడం ఇదే తొలిసారని, 2037 నాటికి ప్రతీ 15 సెకన్లకు ఒక ఏసీ విక్రయించే స్థాయికి ఇండియా ఎదుగుతుందని ప్రపంచబ్యాంకు అంచనా వేస్తోంది.

95 శాతం తొలిసారి కొంటున్నవారే

దేశవ్యాప్తంగా వేడిగాలుల ప్రభావం అధికంగా ఉండటంతో వినియోగదారులు ఏసీలు, రిఫ్రిజరేటర్ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారని, ఇప్పుడు ఏసీ అన్నది లగ్జరీ సాధనంగా కాకుండా బతకడానికి తప్పనిసరి వస్తువుగా మారిపోయిందని మార్కెట్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ప్రపంచ సగటుతో పోలిస్తే దేశంలో సొంత ఏసీ వినియోగం చాలా తక్కువగానే ఉంది. దేశవ్యాప్తంగా మొత్తం కుటుంబాల్లో కేవలం 8 శాతం మందికి మాత్రమే సొంత ఏసీలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సగటున చల్లదనం కోసం ప్రతీ వ్యక్తి 272 కేడబ్ల్యూహెచ్ విద్యుత్‌ను వినియోగిస్తుంటే, మన దేశంలో అది కేవలం 69 కేడబ్ల్యూహెచ్‌గా ఉంది. ఈ ఏడాది తమ సంస్థ అమ్మిన ఏసీల్లో 95 శాతం మంది తొలిసారిగా కొన్నవారే ఉన్నారని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. ఇందులో 65 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచే ఉన్నారు.


పద్మ మృతదేహం

అమ్మా.. లే.. అమ్మా!

- రెండేళ్ల చిన్నారిని నడుముకు కట్టుకుని మహిళ ఆత్మహత్య
- తుప్పల్లో అమ్మ మృతదేహంతోనే రెండు రోజులున్న చిన్నారి
- ఒంటి నిండా దోమకాట్లతో ఏడుస్తూ రోడ్డుపైకి..

ఆ అమ్మ మనసుకు తట్టుకోలేని గాయమైంది. ఆత్మహత్యే శరణ్యం అనుకుంది. తన రెండేళ్ల చిన్నారిని నడుముకు కట్టుకుని ఊరి చివర తుప్పల్లో చెట్టుకు ఉరేసుకుంది. ఈ విషయం తెలియని చిన్నారి అమ్మతోనే ఉన్నాననుకుని ధైర్యంగా ఉంది. ఓపక్క ఆకలి.. చుట్టూ చీకటి.. కీచురాళ్ల అరుపులు.. దోమల కాట్లు.. అయినా అమ్మ ఉందన్న నమ్మకం రెండు రోజులు బతికించింది. అమ్మతో పాటే ఆ చెట్టుకు వేలాడింది. రెండు రోజుల తర్వాత కట్టు విడిపోవడంతో కింద పడి ఏడ్చుకుంటూ సమీపంలోని రోడ్డుపైకి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ పానిరంగిని గ్రామంలో జరిగింది. స్థానిక సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్, గ్రామస్తుల కథనం ప్రకారం.. అరకు మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన పాంగి పద్మ (24) భర్త, ఇద్దరు పిల్లలు, అత్త, మామతో కలిసి జీవిస్తోంది. ఆమె బుధవారం తన రెండేళ్ల కుమార్తె చిన్నితో కలిసి పానిరంగిని గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం భోజనం తర్వాత బంధువులు వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వచ్చేసరికి పద్మ ఇంటి వద్ద లేదు. ఆమె పద్మాపురం వెళ్లిపోయి ఉంటుందని వారు భావించారు. అయితే శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఏడ్చుకుంటూ పానిరంగిని గ్రామ సమీపంలోని తుప్పల నుంచి చిన్నారి బయటకు రావడం గ్రామస్తులు గమనించారు. దోమల కాట్లతో వీపంతా ఎర్రగా కందిపోయిన ఆ చిన్నారిని చూసి పద్మ కుమార్తెగా గుర్తించారు. ఆ సమాచారాన్ని వారు వెంటనే బంధువులకు అందించారు. దీంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా పద్మ చెట్టుకు ఉరివేసుకుని చనిపోయి ఉంది. చిన్నారిని నడుముకు కట్టుకుని బుధవారం మధ్యాహ్నమే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని, కట్టువీడటంతో చిన్నారి బయటపడి రోడ్డుపైకి వచ్చిందని, తల్లివద్ద పాలుతాగి ఆకలి తీర్చుకుని ఉంటుందని భావిస్తున్నారు. వారం క్రితం మద్యం మత్తులో ఉండగా పద్మకు, భర్తకు గొడవ జరిగిందని, మనస్తాపానికి గురయ్యి పద్మ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పాడేరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సంతోష్ చెప్పారు. ఘటనా స్థలాన్ని సర్పంచ్ సుస్మిత పరిశీలించారు.


అమ్మ వీపు కట్టునుంచి బయటపడిన చిన్ని

\- అరకులోయ రూరల్

వైద్య కళాశాలల ప్రారంభానికి

చర్యలు తీసుకోలేదు

- నిధుల విషయం తేలాకే పీపీపీపై ముందడుగు
- అద్భుతాలు చేయడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు
- 30 అంశాలతో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్దేశించుకున్నాం
- వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్మిస్తున్న కొత్త వైద్య కళాశాలలకు నిధుల లభ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దానిని ఎలా అధిగమించాలో ఆలోచించిన తర్వాత పీపీపీ విధానంపై ముందుకు వెళ్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది కొత్త వైద్య కళాశాలల ప్రారంభానికి చర్యలు తీసుకోలేదని చెప్పారు. వైద్య రంగంలో అద్భుతాలు చేయడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని అన్నారు. వైద్య రంగంలో సమస్యల పరిష్కారానికి 30 అంశాలతో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకున్నామని తెలిపారు. ముందుగా ప్రభుత్వాస్పత్రుల్లో వనరుల ఆవశ్యకతపై ఆడిట్ చేస్తామన్నారు. అనంతరం ఆరు నెలల్లోగా ఆస్పత్రుల్లో వసతులు, సాంకేతిక నిపుణుల కొరతను అధిగమిస్తామని చెప్పారు. ఏడాదిలోగా అవసరాల మేరకు సీటీ, ఎమ్మారై వంటి ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించేలా ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా)తో చర్చించామన్నారు. ఇప్పటికే రూ.200 కోట్లు విడుదల చేశామని, మరో రూ.300 కోట్లు త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. నెలవారీగా బిల్లులు విడుదల చేయాలని ఆశా ప్రతినిధులు కోరినట్టు వెల్లడించారు.

గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదంటూనే..

గత ప్రభుత్వంలో వైద్య రంగంలో అభివృద్ధి చెందింది ఏమీ లేదని, ఎక్కడ చూసినా సమస్యలున్నాయని ఆరోపిస్తూనే.. అనంతపురం జీజీహెచ్‌లో పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు వచ్చి చికిత్స పొందుతున్నారని, గుంటూరు జీజీహెచ్‌లో కిడ్నీ, గుండె, లివర్ వంటి అవయవాల మార్పిడి సర్జరీలు కూడా చేస్తున్నారని చెప్పారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు

తరగతుల ప్రారంభానికి సిద్ధమైన పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, పాడేరు, ఆదోని వైద్య కళాశాలల ప్రారంభంపై మంత్రి స్పందించారు. వైద్య శాఖలో స్వల్ప కాలంలో పరిష్కరించదగ్గ సమస్యలపై దృష్టి పెట్టామన్నారు. ఐదు వైద్య కళాశాలల్లో సరిపడా ఫ్యాకల్టీ లేరని, వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేకపోవడంతో నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతులు నిరాకరించిందన్నారు. రెండు నెలల్లో పోస్టులేమీ భర్తీ చేయలేదని తెలిపారు. పులివెందుల వైద్య కళాశాలలో 50 సీట్లకు అండర్‌టేకింగ్ ఇస్తామన్నారు. ఐదు వైద్య కళాశాలల్లో ఈ ఏడాది ప్రవేశాలు ఉంటాయని విద్యార్థులు ఎదురుచూస్తున్న మాట వాస్తవమేనన్నారు. అయితే తొలి, మలి, చివరి విడతల కళాశాలల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. స్వల్ప వ్యవధిలో అద్భుతాలు సృష్టించలేమని పేర్కొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

లేఖన సామగ్రి పంపిణీ



పిల్లలకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్: బళ్లారి వాసవిక్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కంబ్లీ బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు.120 మంది విద్యార్థులకు పెన్నులు, బ్యాగులు పంపిణీ చేసినట్లు క్లబ్ సహకార్యదర్శి జయంతి కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ వారంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరో 500 పెన్నులు, బ్యాగులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, కార్యదర్శి తిప్పయ్య, కోశాధికారి హరికృష్ణ, కమల జువెలర్స్ శ్రీనివాస్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని బైక్ చోదకుడు దుర్మరణం

రాయచూరు రూరల్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలైన ఘటన జిల్లాలో గురువారం సాయంత్రం జరిగింది. తాలూకాలోని ఎలెబిచ్చాలిలో హిట్ అండ్ రన్ కేసులో మరణించిన వ్యక్తిని ద్విచక్ర వాహనంపై వెళుతున్న హనుమాపుర చంద్రశేఖర్(21)గా యరగేర పోలీసులు గుర్తించారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో చంద్రశేఖర్ స్థలంలోనే మరణించాడు. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ సబ్జావలి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

సంగొళ్లి రాయణ్ణ జయంతి



చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాధికారి కార్యాలయంలో క్రాంతి వీర సంగొళ్లి రాయణ్ణ జయంతిని ఘనంగా ఆచరించారు. శుక్రవారం సంగొళ్లి రాయణ్ణ చిత్రపటానికి జిల్లాధికారి నితీష్ పుష్పాంజలి ఘటించారు. యువత సన్మార్గం వైపు నడవాలని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. అదనపు జిల్లాధికారి శివప్ప, నగర కోశాధికారి జగదీష్, ఏసీ మెహబూబీలున్నారు.

బైకును అడ్డగించి దోపిడీ

హుబ్లీ: బైకులో వెళ్తున్న ఓ వ్యక్తిని అడ్డగించిన ముగ్గురు అతని నుంచి రూ.60 వేలు విలువ చేసే బైకు, మొబైల్‌ను దోచుకొని పరారైన ఘటన పాత హుబ్లీ ఆనంద నగర శ్మశానం దగ్గర చోటు చేసుకుంది. రాయనాళ గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి తమ ఊరికి బైకులో వెళ్తుండగా ముగ్గురు దుండగులు ఈ చోరీకి పాల్పడ్డారు. చాకును చూపించి ప్రాణాలు తీస్తామని బెదిరించి బైకును, మొబైల్‌ను తీసుకొని పరారైనట్లు బాధితుడు పాత హుబ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో నిరాశ్రయులను ఆదుకోవడం మనందరి కర్తవ్యమని సిరవార తాలూకా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రేణుక పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం చేసి మాట్లాడారు. ఏ బాదరబందీ లేని వారికి చేదోడువాదోడుగా ఉండడంతో పాటు వారిని మనలో ఒక భాగంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మారుతి, ద్రాక్షాయణి, మౌనేష్, మృత్యుంజయ, రజియాలున్నారు.

హత్యాచారం ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నర్సులు

రాయచూరు రూరల్: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఇటీవల జూనియర్ డాక్టర్‌పై కొందరు దుర్మార్గులు సామూహిక అత్యాచారం చేసి హత్య చేయడాన్ని ఖండిస్తూ భారతీయ వైద్య సంఘం(ఐఎంఏ) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్ వద్ద వైద్యులు, నర్సులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆందోళనకు నాయకత్వం వహించిన జిల్లాధ్యక్షుడు డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ కోల్‌కతా ప్రభుత్వ ఆర్జీకార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో విధులు నిర్వహించిన యువ వైద్యురాలు కవితపై అత్యాచారం చేసి హత్య చేయడం తగదన్నారు. హత్య చేసిన నిందితులపై ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటూ కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు.

వరమహాలక్ష్మీ నమోస్తుతే.!

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి వ్రత పూజలు
- ఆలయాల్లో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ వారు



పటేల్ నగర్‌లోని చిన్నదుర్గమ్మకు లక్ష్మీదేవి అలంకరణ



బళ్లారిలో దుర్గమ్మ దర్శనానికి భక్తుల క్యూ

సాక్షి,బళ్లారి: వరమహాలక్ష్మీ వ్రత పర్వదినం పురస్కరించుకుని మహిళలు భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మీ వ్రతం పూజలు చేశారు.శ్రావణ మాసం రెండో శుక్రవారం పౌర్ణమి ముందు వచ్చే రోజును ప్రతి ఏటా వరమహాలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇంటింటా వరమహాలక్ష్మీ పూజలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. ప్రతి ఇంటా మహిళలు ఉదయం నుంచి ఇళ్లను శుభ్రం చేసుకుని, కొత్తచీర, కలశంతో అమ్మవారిని వివిధ ఆభరణాలతో అలంకరణ చేసుకుని, వివిధ రకాల పిండివంటలు తయారు చేసి, నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి, మంగళహారతులిచ్చి వరమహాలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఇంటింటా ఈ పండుగను ఘనంగా జరుపుకోవడంతో పాటు నగర ఆదిదేవత కనక దుర్గమ్మ ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తులతో పోటెత్తారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో దేదీప్యమానంగా కనిపించింది. కనక దుర్గమ్మ ఆలయంలో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు.

వాడవాడలా ప్రత్యేక పూజలు

బళ్లారి అర్బన్: శ్రావణ శుక్రవారం రోజున వరమహాలక్ష్మీ వ్రత పూజలను నగర వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర వాసుల ఆరాధ్యదైవం కనకదుర్గమ్మకు బంగారు ఆభరణాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించినట్లు ఈఓ హనుమంతప్ప తెలిపారు. భక్తులకు క్యూలైన్ల ద్వారా దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే పటేల్ నగర్ చిన్న దుర్గమ్మకు లక్ష్మీదేవి అలంకరణ, బెంకీమారెమ్మకు గంధం అలంకరణ, బెంగళూరు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, మిల్లర్‌పేట్ మల్నాడు దుర్గమ్మ ఆలయంలో, ఏళుమక్కళ తాయమ్మ ఆలయంలో, విద్యానగర్ కొల్హాపురి మహాలక్ష్మి ఆలయంలో, ఫైర్ ఆఫీసు వద్ద ఉన్న ఆదిశక్తి ఆలయంలో, సిరుగుప్ప రోడ్డులోని అంబాభవాని ఆలయంలో, కంటోన్మెంట్‌లో ఉన్న సంతోషి మాతకు విశేష అలంకరణ, దేవీనగర్‌లోని రేణుక యల్లమ్మ తదితర అమ్మవార్ల ఆలయాల్లో అలంకరణ పూజలతో పాటు వరమహాలక్ష్మీ వ్రత పూజలను నిర్వహించారు.



రేణుక యల్లమ్మకు ప్రత్యేక అలంకరణ



రాయచూరులో అమ్మవారికి అలంకరణ



మిల్లర్‌పేట్ మల్నాడు దుర్గమ్మకు విశేష అలంకరణ

వైభవంగా పూజలు

రాయచూరు రూరల్: నగరంలో వైభవంగా వరమహాలక్ష్మి పూజలు జరిగాయి. శుక్రవారం జిల్లా అంతటా మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు జరిపారు. మార్కెట్లో పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటినా లెక్క చేయకుండా మహిళలు వరమహాలక్ష్మి పూజలు చేశారు. సాయంత్రం ముత్తైదు మహిళలకు గాజులు తొడగడం, ఒడి బియ్యం నింపడం వంటివి జరిగాయి.

ఉపాధ్యాయినికి కన్నీటి వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయినికి సన్మానం

హుబ్లీ: బదిలీ అయిన ఉపాధ్యాయురాలికి విద్యార్థినులు కన్నీటితో వీడ్కోలు పలికి తమను విడిచిపోకండి అంటూ భోరుమన్న ఘటన ధార్వాడ తాలూకా ముమ్మిగట్టి గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని గీతా సురేష్ బెటగేరి 30 ఏళ్ల నుంచి ఆ పాఠశాలలో సేవలు అందించింది. ఈ సమయంలో ఆమె అక్కడి విద్యార్థులతో ఎనలేని ప్రేమ, విశ్వాసాలను చూరగొంది. ప్రస్తుతం ముమ్మిగట్టి నుంచి ఆమెకు ధార్వాడ గాంధీనగర్ లేఔట్ పాఠశాలకు బదిలీ అయింది. ఈనేపథ్యంలో ఉపాధ్యాయురాలికి వీడ్కోలు పలికే వేళ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఉపాధ్యాయురాలు గీతా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన కోసం ఎంతో శ్రమించారు. కేవలం విద్యార్థులకే కాగా గ్రామస్తులకు ఆమె నచ్చిన, మెచ్చిన ఉపాధ్యాయురాలిగా పేరు తెచ్చుకొన్నారు. దీంతో ఆమె బదిలీపై వెళ్తున్న సమయంలో రథోత్సవంలా ఆమెను ఊరిలో ఊరేగింపు నిర్వహించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

భయానక వీడియోల వైరల్‌పై కేసు నమోదు

హుబ్లీ: మారణాయుధాలను చూపించి ప్రజలకు భయం కల్గించేలా వీడియోలను తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన నలుగురిపై పాత హుబ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అభి, మను, రాజభీమ, ప్రదీప్‌లపై ఈ కేసు నమోదైంది. వీరంతా మారణాయుధాలను పట్టుకొని రౌడీల్లా ఫోజులు కొడుతూ ఆ వీడియోలను చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజల్లో భయాందోళనలు కలిగించినందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకొన్నారు.

టీబీడ్యాంను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

- 19వ నంబరు గేటు అమర్చే పనుల పరిశీలన



డ్యాం వద్ద గేటు పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్ట్‌గేటు స్థానంలో నూతన స్టాప్‌లాగ్ గేటు అమర్చే పనులను మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పరిశీలించారు. ఆయన శుక్రవారం తుంగభద్ర డ్యాం వద్దకు నగర కార్పొరేటర్లు, పలువురు బీజేపీ నాయకులతో కలిసి విచ్చేసి స్టాప్‌లాగ్ గేటు అమర్చే ప్రక్రియకు సంబంధించిన నిపుణులు, సిబ్బందితో మాట్లాడారు. వీలైంత త్వరగా గేటు అమర్చే ప్రక్రియను పూర్తి చేసి, ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను, డ్యాంలో నీటి నిల్వను కాపాడాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి

సాక్షి,బళ్లారి: విద్యుత్ షాక్‌తో దంపతులు మృతి చెందిన ఘటన దావణగెరె జిల్లాలో చోటు చేసుకుంది. దావణగెరె జిల్లా మాయకొండ ఫిర్కా పరిధిలో కాటీహళ్లి గ్రామంలో లత, నాగరాజు అనే దంపతులు తమ పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బసవంతప్ప గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దంపతులు ఇద్దరు పొలంలో ఎంతో కష్టపడి పని చేసుకుంటూ జీవనం సాగించేవారని, గ్రామంలోనే ఆదర్శ రైతు దంపతులుగా పేరొందిన ఇద్దరు పొలంలోనే ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృత్యువులోనూ భార్యాభర్తల బంధం వీడలేదని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతులు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దంపతులు నాగరాజు, లత(ఫైల్)

స్వయం ఉపాధిపై దృష్టి పెట్టండి

రాయచూరు రూరల్: బ్రతుకు తెరువుకు జీవనోపాధికి, స్వయం ఉపాధిపై విద్యార్థులు దృష్టి సారించాలని హైదరాబాద్ కర్ణాటక విద్యా సంస్థ ఉపాధ్యక్షుడు రాజా భీమళ్లి పిలుపునిచ్చారు. శుక్రవారం కలబుర్గి హైదరాబాద్ కర్ణాటక విద్యా సంస్థ వీరమ్మ గంగ సిరి మహిళా జూనియర్ కళాశాలలో అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్కారాలతో పాటు జీవిత విలువలను వారిలో అలవర్చుకొనేలా జాతీయ సేవా పథకంలో ఒక భాగమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉదయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి మహేష్, ప్రిన్సిపాల్ రాజేంద్ర కొండా, వీణా, మోహన్‌రాజ, సుష్మా, ఉమా, రేణుకలున్నారు.

తాగునీటి ఎద్దడిపై వాడివేడి చర్చ



పాల్గొన్న జిల్లాధికారి నితీష్ తదితరులు




సమావేశంలో మాట్లాడుతున్న సభ్యుడు

రాయచూరు రూరల్: నగరంలో వివిధ అంశాలకు తోడు తాగునీటి ఎద్దడిపై జిల్లాధికారి నితీష్ నగర సభ సభ్యులతో వాడివేడిగా చర్చ జరిగింది. శుక్రవారం నగరసభ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాకు రెండు పక్కల నదులున్నా తాగునీటి ఎద్దడి నివారణలో అధికారులు, ఇంజినీర్ల లోపాలు చేస్తున్నారని సభ్యులు జిల్లాధికారికి విన్నవించారు. ప్రధాన నీటి పైపుల నుంచి నీటి కొళాయిలకు, 24 పరిశ్రమల కేంద్రాలకు కనెక్షన్లు ఇచ్చారని సభ్యులు ముక్తకంఠంతో వివరించారు. నీటి నిర్వహణలో అధికారులు, ఇంజినీర్లు లోపాలను సవరించుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వీధిలో విద్యుత్ దీపాల అమరిక, వీధి కుక్కలు, పశువుల బెడద నియంత్రణకు తోడు మ్యుటేషన్, ఈ ఖాతా వంటి పనులు చురుకుగా చేసే విధంగా ఆదేశించాలన్నారు. వార్డుల్లో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వసంత్ కుమార్, నగరసభ సభ్యులు జయన్న, బసవరాజ్, నాగరాజ్, శ్రీనివాస రెడ్డి, పవన్ కుమార్, శశిరాజ్, సరోజమ్మ, నరసమ్మ, కమిషనర్ గురుసిద్దయ్యలున్నారు.

2ఏ రిజర్వేషన్‌పై గళమెత్తరేం?

- ఎమ్మెల్యేలపై స్వామీజీ ఆగ్రహం



మాట్లాడుతున్న బసవజయ మృత్యుంజయ స్వామీజీ

హుబ్లీ: పంచమసాలి కులానికి 2ఏ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం వినిపించని సామాజిక వర్గ ఎమ్మెల్యేలపై కూడల సంగమ పంచమసాలి పీఠం జగద్గురువు బసవజయ మృత్యుంజయ స్వామీజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై ఆయన శుక్రవారం బెళగావిలో మాట్లాడారు. బొమ్మై, యడియూరప్ప సర్కార్ల హయాంలో అసెంబ్లీ సమావేశాల్లో ముందుండి పోరాటం చేశారు. అయితే ఈ సర్కార్ హయాంలో ఎందుకు పోరాటం చేయలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆయన కన్నెర్ర చేశారు. ఈ విషయం తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. గురువుగా మఠం విడిచి వారి ఇంటి వాకిటికి వెళ్లాను. లేఖల ఉద్యమం ద్వారా ఎమ్మెల్యేలందరి ఇళ్లకు వెళ్లి విజ్ఞప్తి చేశాను. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించమని ప్రతి ఎమ్మెల్యేకు లేఖ రాసి కోరానన్నారు. అయినా స్పీకర్ దగ్గరకు వెళ్లి ఈ విషయాన్ని అజెండాలో చేర్చాలన్న ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఒక వేళ స్పీకర్ అవకాశం ఇవ్వకుంటే ఎమ్మెల్యేలు ప్రతిఘటించి వాకౌట్ చేయాల్సింది. సీఎం ఇంటికి వెళ్లి ఒత్తిడి తీసుకురావాల్సింది. అయినా ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా తమ సామాజిక వర్గం తరపున ఈ విధంగా చేయలేదని ప్రజలందరూ అసంతృప్తితో ఉన్నారన్నారు. కొందరు ఎమ్మెల్యేలు ప్రయత్నం చేసి ఉండవచ్చు. మిగిలిన ఎమ్మెల్యేలు అవకాశం దొరకకపోతే వాకౌట్ చేసి సీఎం నివాసానికి వెళ్లాల్సింది. అయితే ఏ ఒక్క ఎమ్మెల్యే ప్రశ్నించలేదన్న బాధ తనను వేధిస్తోందన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా ఒక్క సమావేశం నిర్వహించడం సాధ్యం కాలేదన్నారు. సమాజ అభివృద్ధిపై తపన ఉంటే తక్షణమే సీఎం ఇంటికి వెళ్లి చర్చించాలని స్వామీజీ ఎమ్మెల్యేలకు హితవు చెప్పారు.

నా రక్తంలో బీజేపీ, హిందూత్వ ఉంది

- కాంగ్రెస్‌లో చేరే ప్రశ్నే లేదు
- మాజీ మంత్రి రేణుకాచార్య



రేణుకాచార్య

సాక్షి,బళ్లారి: నా రక్తంలో అణువణువునా బీజేపీ, హిందూత్వ నిండిపోయిందని, తాను కాంగ్రెస్‌లో చేరే ప్రశ్నే లేదని మాజీ మంత్రి రేణుకాచార్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దావణగెరెలో విలేకరులతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ప్రచారం జరుగుతోందని, అలాంటి వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గతంలో కూడా తాను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మల్లికార్జునను కలిశానన్నారు. అయినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీలో చేరుతానా? అంటూ ప్రశ్నించారు. యడియూరప్ప ద్వారానే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, మళ్లీ కూడా ఆయన నేతృత్వంలోనే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. విజయేంద్ర గురించి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, విజయేంద్రకు ఎవరి భిక్ష అవసరం లేదన్నారు. డీకేశి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. యత్నాళ్ పాదయాత్ర చేస్తానని చెప్పారని, ఆయన పార్టీ అనుమతితో పాదయాత్ర చేస్తే ఎలాంటి అభ్యంతరం లేదని, లేకపోతే పార్టీ అధినాయకత్వం చూసుకుంటుందన్నారు.

లింగాయత్‌లలో విభేదాలెందుకు?

- వచనానందశ్రీ స్వామి



వచనానంద స్వామీజీ

సాక్షి,బళ్లారి: వేరే మతాలు పుట్టక ముందే హిందూ ధర్మం పుట్టింది,. ప్రపంచంలోని అన్ని సిద్ధాంతాలకు మూలం హిందూ ధర్మమని హరిహర పంచమసాలి పీఠాధిపతి వచనానందశ్రీ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం హావేరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లింగాయత్ సమాజానికి చెందిన వారు కలిసికట్టుగా లేకపోతే ఎలా సాధ్యం అవుతుందన్నారు. ప్రత్యేక ధర్మం ఇప్పటి వరకు లింగాయత్‌లకు ఎందుకు లభించలేదని, వీరశైవ లింగాయత్ సమాజ స్థాపకుడు విశ్వగురు బసవణ్ణ పుట్టుకతో బ్రాహ్మణుడని, ఆయన లింగాయత్ సమాజాన్ని ఉద్ధరించారని, లింగాయత్‌లు అందరూ బ్రాహ్మణులకు కృతజ్ఞులుగా ఉండాలన్నారు. లింగాయత్‌లను ఉద్ధరించేందుకు ఒక బ్రాహ్మణుడు అవసరం అయిందన్నారు. లింగాయత్‌లు కాని వీరశైవ లింగాయత్‌లు కాని, అందులోని ఉప కులాలు కాని ఒకటిగా ఉంటేనే ఏదైనా సాధించేందుకు వీలవుతుందన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన దృశ్యం

కోలారు: ప్రతిభావంత విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి సహకారం అందించాలని బీడబ్ల్యుఎస్ఎస్‌బీ అధ్యక్షుడు రామ ప్రసాద్ మనోహర్ తెలిపారు. శుక్రవారం క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ 226వ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను అన్ని విధాలా ప్రోత్సహించాలని కోరారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారు అభివృద్ధి చెందడానికి విద్య ఎంతో ముఖ్యం. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి జాయింట్ సెక్రటరీ బి శివస్వామి, క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ నౌకరుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మునిరాజు, తహసీల్దార్ డాక్టర్ నయన పాల్గొన్నారు.

వీధిలో మురుగు పరుగు

- విద్యానగర్ 5వ క్రాస్‌లో పారుతున్న డ్రైనేజీ నీరు
- దుర్వాసన భరించలేక ముక్కు మూసుకొంటున్న స్థానికులు



వీధి చివర్లో చాంబర్ నుంచి డ్రైనేజీ నీరు బయటకు వస్తున్న దృశ్యం



5వ క్రాస్ వెస్ట్ ప్రాంతం వైపు కాలువగా సాగుతున్న మురుగు నీరు

బళ్లారి రూరల్: విద్యానగర్..నగరంలో ధనవంతులు, నాయకులు నివాసం ఉండే ప్రదేశమని అందరికీ తెలిసిందే. అయితే డ్రైనేజీల నుంచి మురుగునీరు కాలువల్లా పారుతున్నా, రోడ్లు మట్టికొట్టుకుపోతున్నా చర్యలు మాత్రం అంతంత మాత్రమే. విద్యానగర్ 5వ క్రాస్ చివరన గురువారం తెల్లవారుజామున నుంచి డ్రైనేజీ నీరు మ్యాన్‌హోల్ నుంచి బయటకు పొంగి వీధి చివరి వరకు ప్రవహించి చిన్నపాటి కుంటలా ఏర్పడింది. చుట్టూ ఉన్న ఇళ్లల్లోకి దుర్వాసన వస్తోంది. వాహనాల సంచారానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. సిటీ కార్పొరేషన్ అధికారులు గాని, నాయకులుగాని పట్టించుకొన్న దాఖలాలు లేవు. పైగా సమీపంలోనే ఇద్దరు మాజీ కార్పొరేటర్ల నివాసాలు ఉండటం గమనార్హం . ఇప్పటికైనా సిటీ కార్పొరేషన్ సిబ్బంది డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పీడీఓపై చర్యలకు డిమాండ్

రాయచూరు రూరల్: ఆర్‌హెచ్ క్యాంప్–1 పీడీఓపై చర్యలు చేపట్టాలని ఆర్‌హెచ్ క్యాంప్–1 జీపీ అధ్యక్షురాలు రేణుక డిమాండ్ చేశారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో అధ్యక్ష ప దవిని చేపట్టానని, జీపీలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయన్నారు. 2022లో అధ్యక్షురాలుగా కొనసాగిన సమయంలో పదో తరగతి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చెల్లించాల్సిన విద్యార్థి వేతనాల విషయంలో పిల్లలకు చెక్‌లు ఇవ్వకుండా 2024లో చెక్‌లివ్వాలంటూ తనపై ఒత్తిడి తెచ్చిందన్నారు. పంచాయతీలో విద్యుత్ దీపాల కొనుగోలులో నాసిరకంగా బల్బులు కొన్నారని ఆరోపించారు. వివిధ సామగ్రిల కొనుగోలులో రెండింతలు బిల్లులను రూపొందించి నిధులు కాజేసిన పీడీఓ నాగరత్న అలియాస్ పూర్ణిమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. పంచాయతీపై రూ.25 లక్షలు అప్పు ఉందన్నారు. పంచాయతీలో 32 మంది సభ్యులున్నారని, ఆరు పంచాయతీల పరిధి ఉన్నా పీడీఓ అవినీతికి పాల్పడిందని ఆమెపై చర్యలు చేపట్టాలని కోరారు.

సాధకులకు సత్కార దండలు



డాక్టర్ మంజునాథ్ దంపతులను సన్మానిస్తున్న సుఖాణి



అన్వర్ అలీఖాన్‌కు కాయకశ్రీ అవార్డు అందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: వైద్య రంగంలో రాణించిన చిన్న పిల్లల డాక్టర్ మంజునాథ్‌కు పండిత్ తారానాథ్ అవార్డును, రూ.లక్ష నగదును తారానాథ్ విద్యా సంస్థల అధ్యక్షుడు పారసమల్ సుఖాణి అందజేశారు. బీఆర్‌బీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంజునాథ్ వైద్య రంగంలో సాధించిన సాధనలను వివరించారు. కాయకశ్రీ అవార్డును అన్వర్ అలీ ఖాన్‌కు ఇచ్చి గౌరవించారు. సమావేశంలో పవన్ కుమార్ సుఖాణి, శ్రీనివాస్, అంబాపతి, దేవిరెడ్డి, అరుణలున్నారు.